మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 3 • సంచిక: 362 • పేజీలు: 12+12 • వెల: రూ.5 | గురువారం • 2-1-2020 | www.manamnews.com | /manamnews

ముహూర్తం: స్వస్తి శ్రీ వికారి నామ సం మార్గశిరమాసం దక్షిణాయనం హేమంత ఋతువు, తిథి: సప్తమి, గురువారం, నక్షత్రం: ఉత్తరాభాద్ర, వర్జ్యం: మ.3.10–4.58 వరకు, దుర్ముహూర్తం: ఉ.10:14–11:05, రాహుకాలం: మ.1.30 నుంచి 3.00 వరకు

ఎన్ఆర్సీపై నిర్ణయం ప్రభుత్వానిదే

ప్రగతిశీల రాష్ట్రాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి

- ఏపీ సీఎం జగన్‌తో మంచి సంబంధాలున్నాయి
- చంద్రబాబు హయాంలోనూ మంచి సంబంధాలే ఉన్నాయ్
- పోలీస్ కమిషనర్‌పై ఉత్తమ్ వ్యాఖ్యలు సరికావు
- మున్సిపల్ ఎన్నికల్లో మా ప్రత్యర్థి కాంగ్రెసే: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి):



కేంద్రంలో అధికార పార్టీ కలసాకారం కావాలంటే దేశంలోని ప్రగతిశీల రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకోవాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. ఫార్మారంగంలో తెలంగాణ భారీగా అభివృద్ధిసాధిస్తోందని, నగరంలో ఏర్పాటు చేయడోయే ఫార్మాసిటీని ఈ సంవత్సరంలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్నపార్టీలు అభివృద్ధిలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు చేయూత నివ్వాలన్నారు. ఆయా రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత కూడా కేంద్రం పై ఉందన్నారు. కేంద్రం సాయం చేయకున్నా ఐటీలో హైదరాబాద్ అగ్రస్థానంలో దూసుకుపోతోందన్నారు. ఎన్పీఆర్, ఎన్ఆర్సీపై నిర్ణయం ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. ఈనెల 3న ముంబయ్‌లో జరిగే ఫార్మాసదస్సుకు హాజరుకానున్నట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఏపీతో సహా మిగిలిన పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కొనసాగిస్తామని ఈసందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పీసీసీ పదవిని వదులుకుంటానని ఉత్తమ్ చేసిన ..మిగతా 2లో

ఇక వన్ నేషన్.. వన్ రేషన్

ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాలలో నేటి నుంచి అమలు

- కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ ప్రకటన
- ఈ కార్డుతో చౌకగా నాణ్యమైన నిత్యావసర సరుకుల పంపిణీ

2





ఇదంతా ప్రతిపక్షాల నిర్వాకమే

విపక్షాల క్షమాపణకు బీజేపీ డిమాండ్

- ఈ పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయి
- ఇవి అభివృద్ధి నిరోధక శక్తులు: జవదేకర్

న్యూఢిల్లీ, జనవరి 1 (మనం ప్రతినిధి):

ఒక్క పౌరసత్వ చట్టంపైనే కాకుండా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని బీజేపీ మండిపడింది. దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఉద్దేశించిన ప్రతి చట్టాన్ని, ప్రతి పథకాన్ని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు తమ దుష్ప్రచారంతో నిరోధించే ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర మంత్రిప్రకాశ్ జవదేకర్ విమర్శించారు. ఆ రెండు పార్టీలు పని గట్టుకుని విద్వేషాన్ని రెచ్చగొడుతున్నాయని, వివిధ వర్గాల మధ్య ..మిగతా 2లో



రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో సీడీఎస్ బిపిన్ రావత్ సమావేశం

పలు అంశాలపై చర్చ

న్యూఢిల్లీ, జనవరి 1:

రక్షణ దళాల అధిపతి (సీడీఎస్)గా నూతన బాధ్యతలు చేపట్టిన జనరల్ బిపిన్ రావత్ ఇవాళ రక్షణ మంత్రి రాజ్‌నాద్ సింగ్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జనరల్ రావతుకు రక్షణ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే పదవీ కాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఆర్మీ ఛీఫ్‌గా పదవీ విరమణ పొందిన జనరల్ రావత్... బుధవారం సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా త్రివిధ దళాలు ఆయనకు ఘనంగా గౌరవ వందనం సమర్పించాయి. కాగా తొలి సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన ..మిగతా 2లో



గవర్నర్ను కలిసిన సీఎం కేసీఆర్

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి):

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం రాజ భవన్‌లో గవర్నర్ తమిళిసైను ముఖ్యమంత్రి కేసీఆర్ కలిసారు. ఈ సందర్భంగా కేసీఆర్ ..మిగతా 2లో



సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్

హైదరాబాద్, జనవరి 1 (మనం ప్రతినిధి):

నూతన సంవత్సరం సందర్భంగా ప్రగతి భవన్‌లో పలువురు ప్రముఖులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి ఛైర్మన్ ..మిగతా 2లో

నీట్ దరఖాస్తు గడువు పొడిగింపు

హైదరాబాద్, జనవరి 1:



ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర మెడికల్ కోర్సులకు సంబంధించి దేశంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశం కల్పించే నీట్(నేషనల్ ఎలిజబిలిటీ కం ఎంట్రన్ టెస్ట్) పరీక్షకు దరఖాస్తు గడువు పెరిగింది. ఈ నెల 6వ తేదీ రాత్రి 11.50 గంటలకు వరకు నీట్ దరఖాస్తు గడువును పెంచారు. ఈ గడువు మొదట 31 డిసెంబర్, 2019గా ఉంది. కాగా వెబ్సైట్లో రద్దీ ..మిగతా 2లో

లంచం కేసులో పట్టుబడ్డ ఏడీజీ

పెద్ద అవినీతి తిమింగలాన్ని అరెస్టు చేసిన సీబీఐ



న్యూఢిల్లీ, జనవరి 1:

కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) బుధవారం రూ.3 కోట్ల లంచం కేసులో డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) చంద్ర శేఖరును అరెస్టు చేసింది. ఆయన లూధియానా డీఆర్ఐ ఏడీజీగా పని చేస్తున్నారు. ఆయనతోపాటు ..మిగతా 2లో

కొత్త మున్సిపల్ చట్టాన్ని అమలుచేస్తాం

ఎంఐఎంతో కలిసి పనిచేయం.. సీఎం పదవిపై స్పందించిన కేటీఆర్

- కేసీఆరే రాష్ట్రానికి ఎప్పటికీ ముఖ్యమంత్రి

హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి):



మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించి కొత్త సంవత్సరాన్ని ప్రారంభిస్తామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మునిసిపల్ శాఖ మంత్రి కె. తారకరామారావు అన్నారు. సంక్రాంతి తర్వాత జిల్లాల్లో పార్టీ కార్యాలయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. కొత్త మున్సిపల్ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయడమే ప్రస్తుతం తమ ముందున్న లక్ష్యమని ఆయన వెల్లడించారు. 2019 తమకు బ్రహ్మాండమైన ఆరంభాన్ని ఇచ్చిందని, మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయంతో 2020ని ప్రారంభిస్తామని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని కేటీఆర్ అన్నారు.దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఈనెల మొదటివారంలోనే కేసీఆర్ అధ్యక్షతన పార్టీ సమావేశం ఉంటుందని తెలిపారు. ఈసందర్భంగా సమావేశంలో సీఎం కేసీఆర్ మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తూ, దిశానిర్దేశం చేయనున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్స్ చట్టం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఇక 2020–30 దశకం టీఆర్ఎస్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్రానిదేనని కేటీఆర్ స్పష్టంచేశారు. ఈ ఏడాది తాను సీఎం అవుతానన్న చర్చే అవసరం లేదని ఈసందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి స్వయంగా అసెంబ్లీలోనే చెప్పారని గుర్తుచేశారు. కేసీఆరే తమ సీఎం అని స్పష్టం చేశారు. అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ స్పష్టత ఇచ్చాక అనుమానమెందుకని ప్రశ్నించారు. ఎంఐఎంతో స్నేహం కొనసాగుతుందని, అయితే ఎన్నికల్లో కలసి పోటీ చేయమని స్పష్టం చేశారు. ఇటీవల ఎంఐఎం నిజామాబాద్లో నిర్వహించిన సభలో టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నంత మాత్రాన.. హిందువులు వ్యతిరేకం కారని చెప్పారు. కేసీఆర్ కంటే గొప్ప హిందువు ఉన్నాడా అని మరోసారి ప్రశ్నించారు.ముస్లిం పదాన్ని చేర్చితే సీఏఏకు అనుకూలంగా ఓటేస్తామని చెప్పామని, బీజేపీ తీసుకొచ్చిన బిల్లులకు గతంలో అనేకసార్లు మద్దతునిచ్చామని గుర్తుచేశారు. తమకు శాశ్వత శత్రువులు.. రాజకీయ శత్రువులు లేరని ..మిగతా 2లో




అబ్బే.. న్యూఇయర్ కోసం కాదట.. రాజీనామా చేస్తా మన్నారు కదా.. అందుకు శుభాకాంక్షలు చెప్పడానికొచ్చారట సార్.!

సరిహద్దు సమస్యకు శాశ్వత పరిష్కారం

చైనా సరిహద్దు సమస్యపై ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు..

- సేనల ఆధునీకరణకు కీలక ప్రాధాన్యత



న్యూఢిల్లీ, జనవరి 1:

చైనాతో సరిహద్దు సమస్యలకు త్వరలోనే శాశ్వత సానుకూల పరిష్కారం లభిస్తుందని నూతన ఆర్మీ చీఫ్ జనరల్ ముకుంద్ నరవనే ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు ప్రధాన దేశాలతో భారత్ సరిహద్దులు పంచుకుంటోందని..ఇరు దేశాలూ సమాన ప్రాధాన్యత కలిగినవేనని ఆయన అన్నారు. గతంలో మనం పశ్చిమ ప్రాంతంవైపే దృష్టిసారించా మని, ఉత్తర ప్రాంతం కూడా అంతే ప్రాధాన్యత కలిగిఉందని గుర్తెరగాలన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ స్వాధీనంపై రాజకీయ నేతలు తరచూ చేస్తున్న ప్రకటనలపై స్పందిస్తూ అన్ని సవాళ్లు, వ్యూహాలపై సైన్యం విశ్లేషిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని జనరల్ నరవనే పేర్కొన్నారు. సేనల ఆధునీకరణ ప్రణాళికలకు కీలక ప్రాధాన్యత ఇస్తామని చెప్పుకొచ్చారు. సవాళ్లకు అనుగుణంగా దీర్ఘకాల వ్యూహాలతో ముందుకెళతామని, సేనలకు ఎదురయ్యే సవాళ్లలో మార్పులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. కాగా సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన జనరల్ బిపిన్ రావత్ స్థానంలో దేశ 28వ ఆర్మీ ఛీఫ్‌గా జనరల్ నరవనే మంగళవారం నూతన బాధ్యతలు స్వీకరించారు.

చంద్రయాన్ 3 సక్సెస్ చేస్తాం

ఈ ఏడాది గగన్యాన్ ప్రయోగం

- ఇందుకోసం నలుగురు వ్యోమగాములు ఎంపిక: ఇస్రో ఛైర్మన్ శివన్

న్యూఢిల్లీ, జనవరి 1:

చంద్రయాన్–3 ప్రయోగానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఛైర్మన్ కే.శివన్ తెలిపారు. శివన్ ..మిగతా 2లో



అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ రీసెర్చ్ డైరెక్టర్‌గా సిన్హా

హైదరాబాద్, జనవరి 1(మనం ప్రతినిధి):



డిపార్ట్‌మెంట్‌ఆఫ్ అటామిక్ ఎనర్జీలోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండి)డైరెక్టర్‌గా డాక్టర్ డికె సిన్హా నియమితులయ్యారు. ఈ పదవిని చేపట్టడానికి ముందు డాక్టర్ సిన్హా ఇదే డైరెక్టరేట్లో అదనపు డైరెక్టర్‌గా పనిచేశారు. డాక్టర్ సిన్హా మధ్య ప్రదేశ్, సాగర్‌లోని డాక్టర్ హరిసింగ్ గౌర్ విశ్వవిద్యాలయం నుంచి అనువర్తిత భూగర్భ శాస్త్రం(అప్లైడ్ జియాలజీ)లో ఎంటెక్ చేశారు. 1984లో ఎఎండిలో చేరారు. నాగపూర్ విశ్వవిద్యాలయం నుంచి 1993లో భూగర్భ శాస్త్రంలో డాక్టరేట్ తీసుకున్నారు. భారత దేశంలోని తూర్పు, పశ్చిమ, మధ్య భాగాలకు సంబంధించి భిన్నమైన భౌగోళిక డొమైన్‌లలో 35 ఏళ్లుగా విస్తరించి ఉన్న అణుఖనిజాల అన్వేషణలో ఆయనకు విశేష అనుభవజ్ఞానం ఉంది. ఆయన అన్వేషణ వ్యూహం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ , జార్ఖండ్ రాష్ట్రాలలో పెద్దయెత్తున అణుఖనిజాల నిక్షేపాలను పెంచింది. డాక్టర్ సిన్హా అన్వేషణ భగర్భ శాస్త్రానికి అంకితమైన పరిశోధకుడు. దేశంలో యురేనియం అన్వేషణ ప్రోగ్రామ్‌లో విస్తృతంగా ఉపయోగపడుతున్న అనేక కొత్త అంశాలను ఆయన ప్రచురించారు. యూనివర్శిటీ, పరిశోధన సంస్థలతో సహకరించడానికి అతని భౌగోళిక చతురతను వివిధ విద్యావేత్తలు అనేక సింపోజియంలలో, సెమినార్లు, శిక్షణ, సహకార ప్రాజెక్టుల వంటి అనేక కార్యక్రమాల్లో ప్రశంసించారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో అనేక పరిశోధనా కథనాలను డాక్టర్ సిన్హా ప్రచురించారు.

కొత్త మున్సిపల్ చట్టాన్ని అమలుచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తేల్చిచెప్పారు. ఎంఎంటీఎస్ ఫేజ్ 2 పనులను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఓల్ సిటీలో మెట్రో కచ్చితంగా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ను పట్టించుకోవటం లేదనేది సరైంది కాదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ క్యాడర్ మధ్యనే తీవ్ర పోటీ ఉందని, ఇండిపెండెంట్లుగా బరిలో ఉండొద్దని బ్రతిమాలుకుంటున్నామని కేటీఆర్ చెప్పారు.

కాబోయే సీఎం నేను కాదు

కేసీఆర్ తర్వాత తెలంగాణకు కాబోయే సీఎం ఎవరు అనేది హాట్ టాపిక్గా మారింది. మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేసిన వ్యాఖ్యలతో నెక్ట్స్ సీఎం అంశం చర్చకు దారితీసింది. కేసీఆర్ తర్వాత కాబోయే సీఎం కేటీఆరే అంటూ ఇటీవల మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది టీఆర్ఎస్ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవయ్యాయి. కొందరు అంగీకారం తెలిపితే మరికొందరు హరీష్ రావు పేరుని తెరపైకి తెచ్చారు. హరీష్ రావుకి ఏం తక్కువ.. ముఖ్యమంత్రి కావడానికి ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయని వాదించారు.

తాజాగా ఈ అంశంపై స్వయంగా మంత్రి కేటీఆర్ స్పందించారు.



మీడియాతో చిట్ చాట్ చేశారు. నేను కాబోయే సీఎం అన్నది వాస్తవం కాదన్నారు. తాను సీఎంగా కొనసాగుతానని సీఎం కేసీర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తు చేశారు. అయినా.. కేటీఆర్ సీఎం అని మళ్లీ ప్రచారం చేయడం భావ్యం కాదన్నారు. కాబోయే సీఎం నేను కాదు అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. కేటీఆర్ అలా ఎందుకు అన్నారు అని డిస్కస్ చేసుకుంటున్నారు. పార్టీలో విభేదాలు రాకుండా కేటీఆర్ అలా చెప్పి ఉంటారని విశ్లేషిస్తున్నారు.

వాస్తవంగా టీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత ఎవరు అనేది ఆసక్తికరంగా మారింది. కొన్ని వర్గాలు కేటీఆర్ కు మద్దతుగా ఉంటే.. కొన్ని వర్గాలు హరీష్ రావుకి సపోర్ట్ గా ఉంటున్నాయి. హరీష్ రావు సీనియర్ రాజకీయ నాయకుడు, అపారమైన రాజకీయ అనుభవం, పరిపాలన దక్షత ఉన్నాయని చెబుతున్నారు. ముందు నుంచి తెలంగాణ ఉద్యమంలో ఉన్నారని, పార్టీలో యాక్టివ్ రోల్ ప్లే చేశారని గుర్తు చేస్తున్నారు. దీంతో కాబోయే సీఎం ఎవరు అనే అంశం టీఆర్ఎస్ లో వివాదానికి దారితీసే చాన్స్ కనిపించింది. వెంటనే స్పందించిన కేటీఆర్.. వివాదం మరింత ముదరకుండా ఫుల్ స్టాప్ పెట్టారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ముఖ్యమంత్రి కేసీఆర్ తర్వాత యువనేత కేటీఆర్ తదుపరి సీఎం అవుతారని కొన్ని రోజుల క్రితం శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దేశమంతా కేసీఆర్ వైపు చూస్తోంటే.. రాష్ట్రంలోని యువత కేటీఆర్ వైపు చూస్తోందని, విజన్ ఉన్న నేత కేటీఆర్ అని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ తర్వాత కేటీఆర్ సీఎం కావడం సహజమైన విషయమేనని అన్నారు.

ఇదంతా ప్రతిపక్షాల నిర్వాకమే

(మొదటిపేజీ తరువాయి)



అంతరాలు, విభేదాలు సృష్టిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. దేశ రాజధానిలో హింసను ప్రేరేపించినందుకు ఈ రెండు పార్టీలు జాతికి క్షమాపణ చెప్పాలని ప్రకాశ్ జవదేకర్ డిమాండ్ చేశారు. ఢిల్లీ ప్రజలను ఈ పార్టీలు రెచ్చగొట్టడంతో డిసెంబర్ 15న జరిగిన నిరసనల్లో హింస చెలరేగిందని వ్యాఖ్యానించారు. ఢిల్లీ వంటి ప్రశాంత నగరంలో పౌర చట్టంపై దుష్ప్రచారం చేయడంతో విద్వేష వాతావరణం నెలకొందని, హింసాత్మక ఘటనల్లో వాటిల్లిన ఆస్తి నష్టానికి కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలే బాధ్యత వహించాలని అన్నారు.

ఈ రెండు పార్టీలు ప్రజలను క్షమాపణ కోరాలని జవదేకర్ డిమాండ్ చేశారు. ఢిల్లీ అభివృద్ధికి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇచ్చిన వాగ్దానాల అమలులో ఘోరంగా విఫలమయ్యారని మంత్రి మండిపడ్డారు. తప్పుడు హామీలను ఇచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. మున్సిపల్ కార్పొరేషన్లను అభివృద్ధి పనులు చేపట్టకుండా ఆప్ సర్కార్ అడ్డుకుందని, రూ 900 కోట్ల నిధులను మంజూరు చేయకుండా తాత్సారం చేసిందని ఆరోపిం చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఆప్ సరార్పై కేంద్ర మంత్రి విమర్శలు గుప్పించారు.

పెరిగిన రైలు ప్రయాణ చార్జీలు

విజయవాడ, జనవరి 1 (మనం న్యూస్ ప్రతినిధి):

నూతన సంవత్సరంలో రైలు టికెట్ ఛార్జీలను స్వల్పంగా పెంచింది. ఆర్డినరీ సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్కు కిలోమీటర్కు ఒక పైసా చొప్పున పెంచాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మెయిల్ సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్కు కిలోమీటర్కు 2 పైసల చొప్పును పెంచింది. ఏసీ చైర్ కార్, ఏసీ 3, 4 టైర్, ఏసీ ఫస్ట్ క్లాస్కు కిలోమీటర్కు 4 పైసలు పెంచుతున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. పెంచిన ఛార్జీలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఐదేళ్ల నుంచి రైల్వే ఛార్జీలను పెంచని దృష్ట్యా రైలు ఛార్జీలను హేతుబద్ధీకరించామని వెల్లడించింది. 2014లో చివరి సారిగా రైల్వే ఛార్జీలను పెంచారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికా రంలోకి వచ్చిన ఐదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు పెంచుతున్నారు. అప్పట్లో ప్రయాణికుల ఛార్జీలు 14.2 శాతం, సరుకు రవాణా ఛార్జీలు 6.5 శాతం పెరిగాయి. ఛార్జీల పెంపుతోపాటు రైళ్లలో ప్రయాణికుల వసతి, సౌకర్యాలను మెరుగుపరుస్తామని, కోచ్ల ఆధునీకరణ, స్టేషన్ల లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

రాజధాని, శతాబ్ది, దురంతో, వందేభారత్ , తేజస్, హమ్సఫర్, మహామన, గతిమాన్, అంత్యోదయ, గరీబ్రథ్, జన్ శతాబ్ది, రాజ్యరాణి, యువ ఎక్స్ప్రెస్లు, సువిధ, ప్రత్యేక చార్జీలతో ప్రత్యేక రైళ్ళు, ఏసి మెము(నాన్ సబర్బన్), ఏసి డెము (నాన్ సబర్బన్) మొదలైన రైలు సర్వీసులన్నిటికి ఈ చార్జీల సవరణ వర్తిస్తుందని దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి సిహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇక వన్ నేషన్.. వన్ రేషన్

న్యూఢిల్లీ, జనవరి 1(మనం ప్రతినిధి): ఒక దేశం-ఒకే రేషన్ కార్డు సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో బుధవారం ప్రారంభించింది. నూతన సంవత్సరం తొలి రోజున ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, గుజరాత్, మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్,




కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, గోవా, జార్ఖండ్, త్రిపురల్లో ప్రారంభించింది. ఈ 12 రాష్ట్రాల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ లబ్ధిదారులు వారు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నా తమ రేషన్ వాటాను పొందే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. మొదటి దశలో ఈ పథకం వల్ల సుమారు మూడు కోట్ల మంది లబ్ధి పొందుతారని కేంద్రం తెలిపింది. ఇటీవల కేంద్ర పౌర సరఫరాల శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఈ పథకం గురించి ప్రకటించారు. జనవరి ఒకటి నుంచి ఈ పథకం అమలులోకి వస్తుందని కూడా ఆయన వెల్లడించారు.

ఈ ఏడాది జూన్ నాటికి దేశంలోని అన్ని రాష్ట్రాలను వన్ నేషన్-వన్ రేషన్ సదుపాయానికి అనుసంధానిస్తారు. ఈ సదు పాయం కింద నూతన ఫార్మాట్లో రేషన్ కార్డును రూపొందించాలని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించింది. ఈ ఏడాది జూన్ 1 నుంచి నూతన రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు జారీ చేసే రేషన్ కార్డులు ఇక స్టాండర్డ్ ఫార్మాట్లో ఉంటాయి. పేద ప్రజలకు ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలకు ఈ పథకం వల్ల నిత్యావసర సరుకులు చౌకధరలో లభిస్తాయి. నాణ్యమైన సరుకులను అందించడానికి కేంద్రం సుమారు మూడు నెలల నుంచి కసరత్తు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అత్యధికంగా సుమారు కోటి మందికి దీనివల్ల ప్రయోజనం చేకూరుతుందని అంచనా.

చంద్రయాన్ 3 సక్సెస్ చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడుతూ.. చంద్రయాన్-2 ప్రయోగానికి రూ. 250కోట్లు ఖర్చు కావచ్చని తెలిపారు. చంద్రయాన్-3 కూడా విజయవంతం



అవుతుందని తెలిపారు. చంద్రయాన్-3లో ల్యాండర్, ప్రొపల్షన్ మాడ్యుల్ రోవర్ ఉంటాయని అన్నారు. చంద్రయాన్-2 ప్రయోగంతో సైన్స్ డేటాను ఉత్పత్తి చేయడానికి 7 సంవత్సరాలు పనిచేస్తుందని తెలిపారు. చంద్రుడి భూ ఉపరితలంపై పరిశోధనలు జరిపేందుకు ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-2 చివరి నిమిషంలో విఫలం అవడం పట్ల కే. శివన్, ఇతర శాస్త్రవేత్తలు నిరాశ చెందడం, ప్రధాని నరేంద్ర మోదీ వారిని ఓదార్చిన విషయం తెలిసిందే. 2019లో ఇస్రో విజయాలను శివన్ ప్రస్తావిస్తూ.. కొత్త సంవత్సరంలో ఇస్రో ప్రణాళికలను మీడియాకు తెలియజేశారు. 2020లో చంద్రయాన్-3, గగన్యాన్ ప్రయోగాల విజయవంతం అవ్వడానికి కృషి చేస్తామన్నారు. గగన్యాన్ ప్రయోగం దిశగా 2019లో మంచి పురోగతి సాధించాం. అంతరిక్షంలోకి మనుషులను పంపేందుకు భారత్ తొలిసారిగా చేపడుతున్న ప్రయోగం కోసం.. నలుగురు వ్యోమగాములను గుర్తించామని, వీరికి త్వరలోనే శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని శివన్ తెలిపారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ..2020లో చంద్రయాన్-3 ప్రయోగాన్ని ప్రారంభస్తారని.. చంద్రయాన్-2 కంటే చంద్రయాన్-3 చాలా తక్కువ ఖర్చవుతుందని అభిప్రాయపడ్డారు. చివరి నిమిషంలో చంద్రయాన్-2 విఫలమవ్వడం పట్ల శివన్ స్పందిస్తూ..రెండు దశలు కొనసాగిన చంద్రయాన్-2 ప్రయోగంలో మొదటి దశలో చంద్రయాన్ 3,84,400 కిలోమీటర్లు అంతరిక్షంలో విజయవంవతంగా ప్రయాణించిందని అన్నారు. రెండో దశ చాలా క్లిష్టమైందని, అందులోనే కొంచెం విఫలమయ్యామని అన్నారు ప్రపంచంలో చంద్రయాన్-2 ప్రయోగం ద్వారా చంద్రుడి ఉపరితలంపై ప్రవేశించిన మొదటి దేశం భారత్ అని పేర్కొన్నారు. అగ్ర దేశాలైన అమెరికా, చైనా కూడా ఇంత వరకు ప్రయత్నించలేదని శివన్ గుర్తు చేశారు.

ఎన్ఆర్సీపై నిర్ణయం ప్రభుత్వానిదే

(మొదటిపేజీ తరువాయి)



వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ స్పందిస్తూ అది ఆయన వ్యక్తిగత విషయమని అన్నారు. కానీ హైదరాబాద్ కమిషనర్ విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. శాంతిభద్రతలను కాపాడేందుకే కాంగ్రెస్ ర్యాలీని అనుమతి ఇవ్వలేదని, పోలీసు అధికారిపై గవర్నర్కు కాంగ్రెస్ ఫిర్యాదు సరికాదని కేటీఆర్ సూచించారు.

ఏపీ సీఎం జగన్తో మంచి సంబంధాలు కొనసాగుతున్నాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. పొరుగు రాష్ట్రాలతో సఖ్యతగా ఉన్నాం కాబట్టే కాళేశ్వరం పూర్తైందని చెప్పారు. గోదావరి, కృష్ణాపై ఉమ్మడి ప్రాజెక్టును పక్కన పెట్టలేదని, ప్రాజెక్టును పక్కనపెట్టామని సీఎంలు కూడా చెప్పలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో కూడా ఏపీతో మంచి సంబంధాలున్నాయని కేటీఆర్ తెలిపారు. మునిసిపల్ ఎన్నికల్లో తమ ప్రత్యర్థి కాంగ్రెస్సేనని మంత్రి చెప్పారు. కాంగ్రెస్కు ఎంతో చరిత్ర ఉందని, ఎన్నో ఒడిదొడుకులు చూసిందన్నారు. కాంగ్రెస్ను తీసిపారేయడానికి లేదని, ఒకటి, రెండు విజయాలు రాగానే తాము ఎగిరి పడటం లేదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి అంత సీన్ లేదని వాళ్లకూ తెలుసన్నారు. తాను చిన్నప్పుడు బీజేపీ ఎలా ఉందో.. ఇప్పుడు అలాగే ఉందని తెలిపారు.



గవర్నరును కలిసిన సీఎం కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీకే అరుణ సహా పలువురు నేతలు కూడా గవర్నర్కు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సోమేశ్కుమార్ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ను మర్యాదపూర్వకంగా కలిశాకు. ఈసందర్భంగా ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా భీమా కోరేగావ్ వార్షికోత్సవం..



- **అజిత్ పవార్ సహా మంత్రుల హాజరు**

పూణె: మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా ఈ ఏడు భీమా కోరెగావ్ వార్షికోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. భీమా కోరేగావ్ యుద్ధానికి బుధవారంతో 202 ఏళ్లు నిండాయి. మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన దాదాపు 5 లక్షల మంది దళితులతో పుణె జిల్లాలోని పెర్నే గ్రామంలో సందడి నెలకొంది.

డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులూ..

భీమా కోరేగావ్ యుద్ధం జరిగిన స్థలంలో ఏర్పాటు చేసిన 'విజయ స్తూపం' వద్ద అమరవీరులకు నివాళులర్పించేందుకు దేశం నలుమూలల నుంచి దళితులు వచ్చారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ బుధవారం ఉదయమే పెర్నే వెళ్లి విజయ్ స్తూపాన్ని సందర్శించుకున్నారు. ఆయనతో పాటు ఎన్సీపీ కీలక నేతలు కూడా ఉన్నారు. డిప్యూటీ సీఎం తర్వాత పలువురు మంత్రులు కూడా భీమా కోరేగావ్ వార్షికోత్సవానికి హాజరయ్యారు.

టైట్ సెక్యూరిటీ.. ఇంటర్నెట్ బంద్..

రెండేండ్ల కిందట ఇక్కడ భీకర ఘర్షణలు చోటుచేసుకోవడం, దానిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో భీమా కోరేగావ్ వార్షికోత్సవాలకు సెక్యూరిటీ పెంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని స్కూళ్లు, కాలేజీలకు సెలవకు ప్రకటించారు. పెర్నేతోపాటు ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

అసలేం జరిగిందంటే..

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యానికి చెందిన మహర్ రెజిమెంట్కు, ఉన్నత కులాలైన పీష్వాలకు మధ్య పుణెలోని పెర్నే ప్రాంతంలో.. 1818, జనవరి 1న జరిగిన యుద్ధాన్నే భీమా కోరేగావ్ యుద్ధంగా చరిత్ర చెబుతోంది. పుణెకు దగ్గరల్లోని కోరేగావ్లో భీమా నది ఒడ్డున జరగడంతో ఈ యుద్ధానికి ఆ పేరు వచ్చింది. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పీష్వాలతో కలిసి పోరాడుతామని దళితులు ముందుకు రాగా.. అందుకు బాజీరావ్ పీష్వా నిరాకరిస్తాడు. దీంతో దళితులంతా బ్రిటిష్ సైన్యంలో చేరతారు. నిజానికి ఇది రెండో బాజీరావు పీష్వాపై బ్రిటిషర్లు సాధించిన విజయమైనప్పటికీ... కుల వివక్షపై దళితులు సాధించిన గెలుపుగానూ భీమా కోరేగావ్ ప్రసిద్ధికెక్కింది. నాటి యుద్ధంలో చనిపోయినవారి గుర్తుగా బ్రిటిషర్లు 'విజయ స్తూపం' ఏర్పాటుచేశారు. దళితులు భీమా కోరేగావ్ను విజయోత్సవంగా జరుపుకోవడాన్ని పెద్దకులాలు, పలు హిందూ సంస్థలు తప్పుపడతాయి.



సీఎం కేసీఆర్కు శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్

(మొదటిపేజీ తరువాయి)

గుత్తాసుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాపరిషత్ ఛైర్పర్సన్లు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, జెన్కో, ట్రాన్స్కో సీఎండి దేవుల పల్లి ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు. హైస్కూల్ విద్యార్థులకు అందించే మోడల్ డిక్షనరీని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జనార్ధన్రెడ్డి అందించారు. ఐనవోలు దేవాలయం, యాదాద్రి దేవాలయ క్యాలండర్లను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ను కలిసిన వారిలో పార్లమెంటరీ పార్టీనాయకుడు కె.కేశవరావు, లోకసభ విపక్షనేత నామా నాగేశ్వరరావు, టీఎస్పీఎస్పి ఛైర్మన్ ఘంటా చక్రపాణి తదితరులు ఉన్నారు.

రక్షణ మంత్రి రాజ్నాథ్తో సీడీఎస్ బిపిన్ రావత్ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

జనరల్ రావతుకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం, కొత్త దశాబ్దం ప్రారంభమవుతున్న తరుణంలో భారత దేశానికి మొదటి సీడీఎస్ వచ్చారన్నారు. జనరల్ రావత్ భారత దేశానికి గొప్ప శక్తియుక్తులతో, ఉత్సాహంతో సేవలు చేశారని మోదీ ప్రశంసలు కురిపించారు.


నీట్ దరఖాస్తు గడువు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా అనేకమంది విద్యార్థులు సకాలంలో ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోలేకపోయారు. దీంతో అనేక విజ్ఞప్తుల మేరకు నీట్ దరఖాస్తు గడువును పొడిగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆన్లైన్ దరఖాస్తు సవరణలకు ఇప్పటికే ప్రకటించిన జనవరి 15 నుంచి 31 వరకు ఉంటుందని తెలిపారు. కశ్మీర్ లోయ, లేహ్, కార్గిల్ అభ్యర్థులు ఆఫ్లైన్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) సూచించిన నోడల్ సెంటర్లలో తమ దరఖాస్తులు సమర్పించాల్సిందిగా అధికారులు పేర్కొన్నారు. ఫీ చెల్లింపులో అదేవిధంగా ఆన్లైన్ అప్లికేషన్ సమర్పణలో ఏవైనా సమస్యలు తలెత్తితే ఎన్టీఏ హెల్ప్డెస్క్ 0120-6895200కు సంప్రదించాల్సిందిగా సూచించారు.

లంచం కేసులో పట్టుబడ్డ ఏడీజీ

(మొదటిపేజీ తరువాయి)



ఇద్దరు మధ్యవర్తులను కూడా సీబీఐ అరెస్టు చేసింది.

సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 2019 జూన్లో ఓ ప్రైవేటు ఏజెన్సీపై డీఆర్ఐ దాడి చేసింది. ఎగుమతిదారులకు ఈ సంస్థ సేవలు అందిస్తూ ఉంటుంది. ఈ సోదాల్లో ఓ ఎగుమతిదారుకు సంబంధించిన కొన్ని దస్తావేజులను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దస్తావేజుల ఆధారంగా డీఆర్ఐ కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.3 కోట్లు లంచం ఇవ్వాలని ఏడీజీ చంద్రశేఖర్ తరపున క్లియరింగ్ హౌస్ ఏజెంట్ అనూప్ జోషీ, చంద్రశేఖర్కు అత్యంత సన్నిహిత మిత్రుడు రాజేశ్ దండా అడిగారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఏడీజీ తరపున డిమాండ్ చేసిన లంచంలో మొదటి వాయిదా క్రింద రూ.25 లక్షలు స్వీకరిస్తుండగా జోషీ, దండాలను సీబీఐ అరెస్టు చేసింది. వీరిని ప్రశ్నించినపుడు తాము ఈ సొమ్మును ఏడీజీ తరపున తీసుకున్నట్లు తెలిపారని, దీంతో చంద్రశేఖర్ను అరెస్టు చేశామని సీబీఐ పేర్కొంది.

'నెట్' పాలసీ రివ్యూ చేయాల్సిందే!



- **సెల్యూలర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్**
- **షట్డౌన్ను వ్యతిరేకిస్తున్న టెలికం కంపెనీలు**
- **కోట్ల రూపాయల నష్టం**

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో ఆందోళనలు వెల్లువెత్తాయి. అసోంలో ఆందోళనలతో అట్టుడికిపోయింది. సీఏఏ, ఎన్ఆర్సీల అమలును నిరసిస్తూ రోడ్లపై ఆందోళనకారులు విధ్వంసం సృష్టించారు. కొన్ని ప్రాంతాల్లో ఆందోళనకారులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడంతో తీవ్ర ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. సోషల్ మీడియాలో కూడా సీఏఏ నిరసన సెగ తగిలింది.

ఆన్లైన్లో సీఏఏ చట్టాన్ని విమర్శిస్తూ ఆందోళనలు వెల్లువెత్తడంతో కేంద్ర ప్రభుత్వం ఇంటర్నెట్ షట్ డౌన్ పాలసీ తీసుకొచ్చింది. ఆందోళనలు జరిగే ప్రాంతాల్లో ఇంటర్నెట్ సర్వీసులను నిలిపివేసింది. దీంతో టెలికం కంపెనీలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మొబైల్ ఇంటర్నెట్ సేవలు కూడా నిలిచిపోవడంతో భారతీయ సెల్యూలర్ సర్వీసు ప్రొవైడర్లు గంటకు రూ.2.45 కోట్ల నష్టాన్ని భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటర్నెట్ షట్ డౌన్ పాలసీని టెలికం కంపెనీలు వ్యతిరేకిస్తున్నాయి.

ఇంటర్నెట్ షట్ డౌన్ సరికాదు

సెల్యూలర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ), భారతీయ టెలికం పరిశ్రమకు చెందిన అపెక్స్ విభాగం సైతం మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తోంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ది అసోసియేషన్ రాజన్ మాథ్యూస్ (రిలయన్స్ జియో, భారతీ ఎయిర్ టెల్, వోడాఫోన్ ఐడియా) మాట్లాడుతూ... ఇంటర్నెట్ షట్ డౌన్ పాలసీ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం.. టెలికం పరిశ్రమను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు.

ఇంటర్నెట్ షట్ డౌన్ పాలసీని ప్రభుత్వం వెంటనే రివ్యూ చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. 'ఇంటర్నెట్ షట్ డౌన్ చేయడం ఇది తొలిసారి కాదు.. దేశంలో ఆందోళనలు చెలరేగినప్పుడు లేదా అశాంతి నెలకొన్న సమయంలో వాటి తీవ్రతను అదుపు చేసేందుకు గతంలో కూడా ప్రభుత్వం ఎన్నోసార్లు ఇంటర్నెట్ సర్వీసులను నిలిపివేసింది. దీనిపై కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖను మేం సంప్రదించాం. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటర్నెట్ వాడకుండా షట్ డౌన్ చేయడం సరికాదు' అని మాథ్యూస్ చెప్పారు.

2014లో 6 సార్లు.. 2019లో 109 సార్లు...

ఈ పాలసీ విధానాన్ని అవలంభించరాదని పరిశ్రమలో ప్రధాన టెలికం కంపెనీలన్నీ ఏకాభిప్రాయంతో ఉన్నాయి. ఈ అంశాన్ని ప్రభుత్వంతో చర్చించేంత వరకు తీసుకెళ్తామన్నారు. 2014లో ప్రధాని నరేంద్ర మోదీ అయిన తొలి ఏడాది నుంచి ఇంటర్నెట్ షట్ డౌన్ చేయడం పెరిగిపోయింది. 2014తో పోలిస్తే ఇంటర్నెట్ 6 సార్లు మాత్రమే షట్ డౌన్ చేయగా.. 2019లో ప్రభుత్వం ఏకంగా 109 సార్లు ఇంటర్నెట్ షట్ డౌన్ చేసినట్టు ఇంటర్నెట్ షట్ డౌన్ ట్రాకర్ రిపోర్టు తెలిపింది. ఇంటర్నెట్ షట్ డౌన్ అయ్యే ప్రాంతాల్లో జమ్మూ కశ్మీర్ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రజాస్వామ్యంలో సుదీర్ఘకాలంగా ఇంటర్నెట్ షట్ డౌన్ అయినట్టు రికార్డు అయింది.

జమ్మూ కశ్మీర్ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సర్వీసులు నిలిచిపోయి జనవరితో ఐదో నెలలోకి ఎంటర్ అయింది. ఇటీవలే కశ్మీర్లో స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి ముందుగానే ఆగస్టు 5, 2019న ప్రభుత్వం ఇంటర్నెట్ షట్ డౌన్ మొదలైంది. అక్టోబర్ 14న లోయయ ప్రాంతాల్లో కొన్ని చోట్ల పోస్టు పెయిడ్ కనెక్షన్లను మాత్రం రీస్టోర్ చేసింది.

కానీ, అక్టోబర్ 20న దేశీయ టెలికం తరపున అపెక్స్ అడ్వైజరీ కౌన్సిల్ సీఓఏఐకు మద్దతుగా నిలిచింది. ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ హోం మంత్రిత్వ శాఖలోని హోం కార్యదర్శి అజయ్ కుమార్ భళ్లాకు లేఖను రాసింది. ప్రీపెయిడ్ కనెక్షన్లు నిలిచిపోయినా పోస్టు పెయిడ్ కనెక్షన్లను మాత్రం రీస్టోర్ చేసేలా నిర్ణయం తీసుకోవాలని కౌన్సిల్ పిలుపునిచ్చింది. ఆ తర్వాత ప్రీపెయిడ్, పోస్టు పెయిడ్ కనెక్షన్లపై ఆంక్షలను ఎత్తివేయాలని మంత్రిత్వశాఖకు కౌన్సిల్ అభ్యర్థించింది. కానీ, మంత్రిత్వ శాఖ స్పందించలేదు.

'ఆదేశాలకు కట్టుబడి ఉండటమే విధానం. మా లైసెన్సులు సార్వభౌమ ప్రభుత్వంలో ఉంటే మేము సార్వభౌమ ఉత్తర్వులను ధిక్కరించలేము. మేము ఒక ఉత్తర్వుతో ఏకీభవించకపోయినా, మేము దానిని పాటించాలి. ఈ విధానం వ్యయ-ప్రయోజన విశ్లేషణను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలి' అని మాథ్యూస్ అన్నారు. సాపే క్షంగా పేద రాష్ట్రాల్లో భద్రతా మౌలిక సదుపాయాలను అప్గ్రేడ్ చేయడం ద్వారా మెరుగైన ఇంటెలిజెన్స్ సేకరణలో ఎక్కువ పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. సామాన్య ప్రజలపై ఇంటర్నెట్ షట్ డౌన్ ప్రభావాన్ని తగ్గించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

మనం ముద్ర

గురువారం 2 జనవరి 2020

దారిదీపాలు



మార్పు అనివార్యం, అభివృద్ధి ఒక అవకాశం. ఆ అవకాశాన్ని అందుకోవాలంటే, దాన్ని అందరికీ పంచాలన్న సహృదయం కావాలి. సమాజం అంటే మానవ సందోహం. మనుషులంటే స్వాప్నికులు, తాత్వికులు, నిత్యవిద్యార్థులు, సృజనకారులు, నిత్యాన్వేషకులు, ప్రేమికులు, అవకాశాన్ని అందిపుచ్చుకునే వారు, సృష్టికి ప్రతిసృష్టి చేసేవారు, ఇంకా ఇంకా... తమ సంతోషాన్ని పదిమంది సంతోషంలో వెదుక్కునే వాళ్ళు! వీళ్ళు కూడా మీలాగా, నా లాగా సామాన్యులే, కానీ పట్టుదలలో, కార్యదీక్షలో, సేవాదృక్పథంలో అసామాన్యులు. ఇలాంటి నవీన మానవులతో నిండిన సమాజాన్ని ఆశిస్తూ, కొత్త ఏడాదిని ఆహ్వానిద్దాం! సమాజ హితం కోసం ప్రతిక్షణం సామాజిక మార్పును అంటిపెట్టుకుని ముందడుగు వేస్తున్న దారిదీపాల్లాంటి కొందరు 2019లో ప్రశంసలు అందుకున్నారు. అలాంటి వారిలో కొంతమందిని ఇవాళ్టి 'ముద్ర' మీకు పరిచయం చేస్తోంది.

అడవితల్లి



ఆమె వయసు 76 ఏళ్ళు. సాధారణంగా ఆ వయసులో ఇతరుల సహాయం కోసం ఎదురు చూడడమో, లేకపోతే అన్ని బాధ్యతల్ని పూర్తి చేసుకుని, ప్రశాంతంగా కాలం గడపడమో చేస్తాం. కానీ ఉత్తరాఖండ్‌కు చెందిన ప్రభాదేవి మాత్రం దీనికి భిన్నంగా నలుగురి మేలు కోసం జీవిస్తూ, వృద్ధాప్యాన్ని జయించింది. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలోని పలాషత్ అనే కుగ్రామంలో జన్మించిన ప్రభాదేవికి 16 ఏళ్ళకే పెళ్ళయ్యింది. ఆమె పెద్దగా చదువుకోలేదు. వ్యవసాయంలో కూడా ఆమెకు పెద్దగా అనుభవం లేదు. కానీ తన గ్రామంలోను, గ్రామ పరిసరాల్లోను చెట్లను ఇష్టం వచ్చినట్టు నరికేస్తూ, జనం ఇళ్ళు, మేడలు కట్టుకోవడం చూసి ప్రభాదేవి చలించి పోయారు. పచ్చని నీడ కరువైతే ఎంతటి ముప్పు ముంచు కొస్తుందో అర్థం చేసుకున్న ప్రభాదేవి తన గ్రామంలో ఏకంగా ఒక అడవిని పెంచి పెద్ద చేసింది. ఆమె పెంచిన అడవిలో కుంకుళ్ళు, దాల్చిన చెక్కల చెట్లతో పాటు దేవదారు వంటి పెద్దవృక్షాలు కూడా ఉన్నాయి. ఈ అడవిలో దాదాపు 500 రకాల వృక్షజాతులున్నాయంటే ప్రభాదేవి పట్టుదల అర్థం అవుతోంది. స్థానిక వాతావరణ పరిస్థితుల్ని అర్థం చేసుకుని, మొక్కలు పెంచడంలోని మెళుకువలు నేర్చుకుని ప్రభాదేవి ఆమె ఈ మహత్కార్యానికి శ్రీకారం చుట్టింది. 'మా గ్రామంలో అడవుల్ని నాశనం చేసే కార్యకలాపాలు ఎక్కువవుతుండడాన్ని గమనించాను. మా కుటుంబానికి కొద్దిగా పొలం ఉంది. ఆ పొలంలోను, మా ఇంటి చుట్టూ నేను మొక్కల్ని పెంచడం మొదలు పెట్టాను. ఇప్పుడది పెద్దఅడవిగా తయారైంది. అంతకు మునుపు బీడుభూమిగా ఉన్న నేల ఇప్పుడు పచ్చదనంతో కళకళలాడుతోంది' అని చెబుతోంది ప్రభాదేవి. కేవలం చెట్లు పెంచడంతోటే సరిపెట్టుకోలేదామె. నానాటికీ తన గ్రామంలో భూగర్భజలాలు అడుగంటి పోతున్న సమస్యను పరిష్కరించేందుకు కూడా ఆమె కృషి చేస్తోంది. ఇందుకోసం భూగర్భ జలాల్ని పరిరక్షించే మొక్కల్ని సేకరించి, వాటిని పెంచుతోంది. అందుకే ఆమెను ఆ గ్రామంలో అందరూ 'వృక్ష నేస్తం' అని ప్రేమగా పిలుచుకుంటారు. ●

వ్యర్థాలతో స్వావలంబన



ఆధునిక ప్రపంచంలో నానాటికీ నగరీకరణ, పారిశ్రామీకరణ పెరిగి పోతున్న నేపథ్యంలో వ్యర్థాల సమస్య కూడా తీవ్రంగా పెరుగుతోంది. ముఖ్యంగా జౌళి సంబంధిత వ్యర్థాల సమస్య చాలా ఎక్కువగా ఉంటోంది. ఈ సమస్యకు పరిష్కారంగా రీనా అంబానీ 'బిగ్ పా' అనే ఒక యాప్‌ను ప్రారంభించింది. మహారాష్ట్రలోని తారాపూర్ గ్రామంలో ఒకప్పుడు నిరుపేద మహిళలు నిస్సహాయంగా, నిస్సారంగా జీవితాల్ని గడుపుతున్న పరిస్థితి నుంచి బయట పడి 'బిగ్ పా' పుణ్యమాని, ఇప్పుడు గంటకు 60 రూపాయల్ని ఆర్జించగలుగుతున్నారు. జౌళి వ్యర్థాలను ఉపయోగించి మహిళలు తయారు చేస్తున్న వస్తువుల్ని 'అమెజాన్ సహేలీ' కార్యక్రమంలో భాగంగా బిగ్‌పా ఆన్‌లైన్‌లో అమ్ముతుంటారు. రీనా అంబానీ తండ్రికి ఒక జౌళి కర్మాగారం ఉంది. మహిళల సాధికారతే లక్ష్యంగా కృషి చేస్తున్న రీనా అంబానీ తారాపూర్ గ్రామంలో మహిళల దుర్భర పరిస్థితుల్ని అర్థం చేసుకుని, వారిని స్వావలంబన దిశగా నడిపించాలని సంకల్పించింది. ఈ పద్దెనిమిదేళ్ళ యువతి మనోనిశ్చయాన్ని అర్థం చేసుకున్న ఆమె తండ్రి కర్మాగారంలోనే ఒక చిన్నస్థలాన్ని ఆమెకు ఇచ్చాడు. ఆ స్థలంలో 12 మంది పార్ట్‌టైమ్ ఉద్యోగినులతో రీనా జౌళి వ్యర్థాలతో రకరకాల వస్తువుల్ని తయారు చేయడం, కుట్టుపని వంటి వాటిలో మహిళలకు శిక్షణనిప్పించడం వంటి కార్యక్రమాల్ని మొదలు పెట్టింది.

ఒకప్పుడు నిరక్షరాస్యులైన ఈ మహిళలు ఇప్పుడు ఇంటర్నెట్ ద్వారా తాము తయారు చేసిన వస్తువుల్ని అమ్ముతున్నారంటే రీనా కృషి ఎంతగా విజయం సాధించిందో అర్థమవుతుంది. ప్రస్తుతం రీనా బ్రిటన్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నప్పటికీ, ఆమె శిక్షణనిప్పించిన మహిళలు స్వయంగా తారాపూర్‌లో 'బిగ్ పా' కార్యక్రమాల్ని ధీమాగా నడిపిస్తుండడం విశేషం. ●

పెద్దపల్లికి పెద్దదిక్కు

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో 16 వేలకు పైగా ఇంకుడు గుంతలు నిర్మితమయ్యాయి. జిల్లాలోని 263 గ్రామాల్లో దాదాపు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి సౌకర్యం ఉంది. జిల్లాలోని 400 ఎకరాల్లో లక్షకు పైగా మొక్కల్ని నాటారు. జిల్లాలో ఎక్కడా ఓపెన్ డ్రైనేజి లేదు. ఓపెన్ మురుగునీటి కాలువలు లేకపోవడం అంటే డెంగ్యూ వంటి వ్యాధులు లేనట్టే! ఇన్ని విశేషాలు ఉండబట్టే 'జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే 2019'లో పెద్దపల్లి జిల్లా అత్యంత పరిశుభ్రమైన జిల్లాగా గుర్తింపును సాధించింది. ఈ గుర్తింపు వెనుక జిల్లా కలెక్టర్ ఎ.దేవసేన రాజీలేని నిబద్ధత ఉంది. ఎనిమిది లక్షల మందితో కూడిన పెద్దపల్లి జిల్లా 2016లో ఏర్పడిందన్న విషయం మనకు తెలిసిందే! పెద్దపల్లి జిల్లా నీటిసౌకర్యం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు మీదే ఆధారపడింది. ఒకప్పుడు జిల్లాలోని గ్రామాల పరిస్థితి దారుణంగా ఉండేది. ఇక్కడ వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగిపొరలుతుండేవి. దాంతో ప్రతియేటా జిల్లాలో డెంగ్యూ సమస్య తీవ్రంగా ఉండేది. చెట్లను విచక్షణారహితంగా నరికి వేయడంతో భూగర్భజలాలు కూడా అడుగంటాయి. జిల్లాలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి కనిపించేవి. అయితే ఇదంతా గతం. 'బహిరంగ మలమూత్ర విసర్జన' నుంచి జిల్లాకు పూర్తిస్థాయి విముక్తి కల్పించేందుకు కృషి చేశారు కలెక్టర్ దేవసేన. ప్రజల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అవగాహనను పెంచాల్సిన ఆవశ్యకతను ఆమె గుర్తించారు. జిల్లాలో 'స్వచ్ఛాగ్రహి' కార్యక్రమన్ని ప్రారంభించి, గ్రామాల్లో స్వయం సహాయక బందాల నుంచి దాదాపు వెయ్యిమంది మహిళల్ని ఎంపిక చేసి, గ్రామ పరిశుభ్రతను పర్యవేక్షించే బాధ్యతను అప్పగించారు. ఈ కార్యక్రమా లన్నింటినీ దేవసేన ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, పెద్దపల్లి జిల్లాను ఆదర్శనీయంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ అధికారులు క్రమశిక్షణతో, బాధ్యతతో, అంకిత భావంతో విధులను నిర్వహించినపుడు సమాజం ఎంతగా ముందడుగు వేస్తుందో తెలియాలంటే దేవసేనలాంటి అధికారులే అందుకు తగిన ఉదాహరణ. ●



ఆత్మరక్షణే అసలైన శిక్షణ



మనదేశంలో మహిళల రక్షణ అన్నది మాటలకే పరిమితమైన విషయం మనకందరికీ తెలిసిందే. ఎన్ని కఠిన చట్టాల్ని అమల్లోకి తెచ్చినా, మహిళల మీద దాడులు, అత్యాచారాలు నిత్యకృత్యమై పోయాయి. ఆడపిల్లలు జాగ్రత్తగా లేకపోతే, దాడులు తప్పవన్నట్టు ప్రవర్తిస్తున్నాయి ఆటవిక మూకలు. ఇలాంటి దురదృష్టకర పరిస్థితుల్లో అమ్మాయిల్లో ఆత్మస్థయిర్యాన్ని నింపడాన్నే లక్ష్యంగా చేసుకున్నాడు అభిషేక్ యాదవ్. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన అఖిలేష్ వయసు 27 ఏళ్ళు. అతనికి చిన్నతనం నుంచే మార్షల్ ఆర్ట్స్ పట్ల మక్కువ ఎక్కువ. అఖిలేష్ ఐకిడో, జిట్సు, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందారు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు 'మేరీ రక్షా మేరీ హాంథోమే' (నా రక్షణ నా చేతుల్లోనే) అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అఖిలేష్ దాదాపు రెండు లక్షల మంది అమ్మాయిలకు యుద్ధకళల్లో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో కరాటేతో పాటు పలు యుద్ధవిద్యల్లో కూడా మెళుకువలు నేర్పిస్తారు. దేశవ్యాప్తంగా ఆయన ఈ యుద్ధవిద్యల్ని ఆడపిల్లలకు నేర్పాలన్న లక్ష్యంతో ఉన్నారు. 'నిర్భయ సంఘటన జరిగినపుడు నేను చలించి పోయాను. నేను నేర్పుతున్న ఈ యుద్ధకళల వల్ల అమ్మాయిలకు, మహిళలకు తమను తాము రక్షించుకోవడమెలాగో తెలుస్తుంది. అవసర సమయాల్లో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ మెళుకువలు తెలిసి ఉండాలని నేను భావిస్తున్నాను' అని అంటున్నాడు అభిషేక్. ఆయన సమాజానికి చేస్తున్న ఈ సేవను గుర్తించి 2015లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 'యశ్ భర్తీ' అవార్డును బహూకరించింది. ●

ఉక్కుమహిళ

తమిళనాడులోని 'పుల్లుచెరి' అనే కుగ్రామం ఉంది. గూగుల్ మ్యాప్స్ వంటి ఆన్‌లైన్ మ్యాపుల్లో ఎక్కడా ఆ గ్రామం కనబడదు. ఈ గ్రామంలో అప్పులతో కునారిల్లిన రైతులు, నిరుపేదలే ఎక్కువగా ఉంటారు. వీరి



రెక్కల కష్టాన్ని దోచుకునే వారికి కొదవేమీ ఉండదు. గ్రామంలో నెలకొన్న ఈ శ్రమదోపిడీ విధానానికి ఎదురుతిరిగి, గట్టి సమాధానమిచ్చింది ఒక నిరక్షరాస్యురాలైన ఒక నిరుపేద మహిళ. ఆమె పేరు 'చిన్నపిళ్ళై'. ఆమెకు 12 ఏళ్ళ వయసులోనే వివాహం జరిగింది. మధురై జిల్లాలోని అళగర్ కోవిల్ గ్రామానికి కాపురానికి వచ్చింది చిన్నపిళ్ళై. ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చింది. భార్య, భర్త కలిసి పనిచేసినా నాలుగు వేళ్ళు నోట్లోకి వెళతాయన్న హామీ ఉండేది కాదు. తమ కష్టానికి తగిన కూలీని ఇవ్వాలంటూ చిన్నపిళ్ళై భూస్వాముల్ని గట్టిగా నిలదీసింది. తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి వలసవచ్చిన కూలీలు అనేక మంది అళగర్ కోవిల్‌లో నివసిస్తున్నారు. వీరిలో పుల్లుచెరి నుంచి వలస వచ్చిన వారు కూడా ఉన్నారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులెందరో గ్రామ భూస్వాముల శ్రమదోపిడికి గురయ్యేవాళ్ళు. వారిలో చిన్నపిళ్ళై, పెరుమాళ్ దంపతులు కూడా ఉన్నారు. దోపిడికి మౌనంగా బలైపోవడమే తప్ప ఎదురు తిరిగే శక్తి లేని వాళ్ళంతా ఆ గ్రామంలో దుర్భర జీవితాల్ని గడుపుతుండేవారు. అప్పుల వాళ్ళ దాష్టీకాలు కూడా వీరి జీవితాన్ని నరకప్రాయంగా చేసేవి. ఇచ్చిన అప్పుకు 300 శాతానికి పైగా వడ్డీల్ని వసూలు చేసే వాళ్ళు. అయితే చిన్నపిళ్ళై ఎంతో కాలం ఈ దుర్మార్గాల్ని సహించ లేక పోయింది.'నా భవిష్యత్తును వేరే ఎవరో నిర్ణయించడం సరికాదని నేను భావించాను. నా ఒక్కదానికే కాదు, నాతో పాటు పనిచేసే కూలీలందరికీ తగిన ప్రతిఫలాన్ని చెల్లించాలంటూ నేను భూస్వాముల్ని పదేపదే అడిగేదాన్ని. దాంతో కొందరు నా మీద పగబట్టారు. అందరినీ కూడగట్టుకుని పోరాటం మొదలు పెట్టాను' అని చెప్పింది చిన్నపిళ్ళై. ఆమె ప్రారంభించిన పోరాట ఫలితంగా పుల్లుచెరి ఇవాళ స్వావలంబనలో అగ్రస్థానంలో నిలిచింది. చిన్నపిళ్ళై పోరాట ఫలితంగా గ్రామం లో 'కళజియం'పేరిట స్వయం సహాయక వ్యవస్థ ప్రారంభమైంది. వందలాది పేద మహిళలకు స్వల్పకాలిక రుణాలు మంజూరయ్యాయి. గ్రామంలో గత 30ఏళ్ళుగా పేదలకు ఇలాంటి సహాయం నిరాటంకంగా అందుతూనే ఉంది. రోజుకూలీగా జీవించే తాను సాటి కూలీలతో కలిసి ఒక గ్రూపును ఏర్పరిచానని, అంత వరకు అసంఘటితంగా ఉండడం వల్ల తమకు పనులు దొరికేవి కావని ఆమె చెప్పింది. ఇలా కలిసికట్టుగా పోరాడడం వల్ల భూస్వాములు తమ న్యాయమైన కోరికల్ని అంగీకరించక తప్పని స్థితి వచ్చిందన్నది చిన్నపిళ్ళై. పేదలకు అనువుగా ఉండే పొదుపు పథకాలు కూడా ప్రారంభమయ్యాయి. గ్రామంలో 1990లో ప్రారంభించిన కళంజియమ్ ఉద్యమం అనతికాలంలోనే 13 రాష్ట్రాల్లోని 63 జిల్లాలకు వ్యాపించింది. ఈ ఉద్యమం వల్ల దాదాపు 1.2 మిలియన్ కుటుంబాలు ఆర్థిక స్వావలంబనను సాధించాయి. ఈ ఉద్యమానికి ధాన్ ఫౌండేషన్ అనే స్వచ్ఛందసంస్థకు చెందిన వాసిమామలై కూడా చేయూతనిచ్చారు. గ్రామంలో 'పుల్లు కళంజియం' పేరిట ఒక ధాన్యాగారాన్ని కూడా ఏర్పాటు చేసింది. తొలుత 15 మంది మహిళలు నెలకు 20 రూపాయలు చెల్లించడంతో ప్రారంభమైన పొదుపు ఉద్యమం ఇవాళ ఎంతో ఎత్తుకు ఎదిగింది. దీని ఫలితంగా అప్పుల వారి బారి నుంచి పేదలు సులభంగా బయటపడే మార్గం దొరికింది. చిన్నపిళ్ళైకి ఇప్పుడు 67 ఏళ్ళు. ఆమె చదువుకోలేదు. కానీ ప్రతి నిరుపేద గ్రామీణుడు విద్యావంతుడైనప్పుడే దేశం పేదరికం నుంచి, దోపిడీ నుంచి బయటపడుతుందని ఘంటాపథంగా చెబుతోంది. చిన్నపిళ్ళైలోని ఈ ప్రత్యేకతను గుర్తించినందు వల్లే సాక్షాత్తు వాజ్‌పేయి వంటి ప్రముఖుడు ఆమెకు పాదాభివందనం చేశారు. తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిపాలక బృందంలో చిన్నపిళ్ళై సభ్యురాలు కూడా! చిన్నపిళ్ళైకి 1999లో స్త్రీశక్తి పురస్కారం లభించింది, 2001లో జానకీ దేవి బజాజ్ పురస్కార్ అవార్డు, తమిళనాడు ప్రభుత్వం నుంచి 2008లో ప్రతిష్ఠాత్మక అవ్వయార్ అవార్డు, 2019లో పద్మశ్రీ అవార్డు లభించాయి. ఎన్ని అవార్డులు లభించినా, తాను ప్రారంభించిన ఉద్యమాన్ని మహిళలు మున్ముందుకు తీసుకు వెళ్లడమే తనకు నిజమైన పురస్కారం అంటుంది చిన్నపిళ్ళై. ●



సేకరణ: కల్కి

బట్టల బ్యాంకు



'నేను ఐదో తరగతి చదువుతున్నపుడు నా స్కూలు యూనిఫారమ్ పూర్తిగా పాతబడి, చిరిగిపోయింది. మరో కొత్త యూనిఫారమ్ కొనిచ్చే స్థోమత లేదు మా నాన్నకు. కేవలం యూనిఫారమ్ లేనందు వల్లే నేను ఐదో తరగతితో చదువు ను ఆపేశాను. ఆ పరిస్థితి మరెవ్వరికీ రాకూడదు' అంటూ తన బాల్యాన్ని గుర్తు చేసుకుంటాడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాజు తాలూక్దార్. ఒక సామాన్య డ్రైవర్‌గా జీవితాన్ని గడుపుతున్న సాజు ఇవాళ ఎందరికో వస్త్రదానం చేస్తున్నాడు. పేదలకు బట్టల్ని దాన మిచ్చేందుకు ఆయన ఒక బట్టల బ్యాంకును నెలకొల్పారు. దాని పేరు 'బీర్ బిర్సాముండా క్లాత్ బ్యాంక్'. సాజు పశ్చిమబెంగాల్‌లోని అలీపూర్ ద్వార్ జిల్లాకు చెందిన సిలిగురికి వందకి లోమీటర్ల దూరంలోని డిమ్‌డిమా టీ గార్డెన్‌లో ఈ బట్టల బ్యాంక్‌ను 2017లో స్థాపించాడు. దాదాపు పన్నెండేళ్ళుగా ఆయన పాత బట్టల్ని సేకరిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు సాజు తాలూక్దార్ స్థాపించిన బట్టల బ్యాంకులో దాదాపు 50 వేలకు పైచిలుకు బట్టలున్నాయి. ఆయన టీ తోటల్లోను, బస్టాపుల్లోను, రైల్వేస్టేషన్లలోను, మరెక్కడైనా కట్టుకోవడానికి బట్టలు లేకుండా ఇబ్బందులు పడుతున్న వారిని గమనించి ప్రతివారం మూడు వేల నుంచి నాలుగు వేల బట్టల వరకు ఉచితంగా పంచుతుంటాడు. రోజుకు 700 రూపాయలు సంపాదించే డ్రైవరు వృత్తిలో ఆయన ప్రతిరోజూ ఎందరో సరైన బట్టలు కూడా లేని పేదల్ని చూస్తుండే వాడు. అర్థనగ్నంగా తిరుగుతూ, తిండి కోసం చెత్తబుట్టల్లో వెదుక్కుంటూ ఉండే నిరుపేదల్ని చూసి సాజు తాలూక్దార్ చలించి పోయాడు. వారికి ఏదైనా సహాయం చేయాలన్న ఆలోచన తనకు చిన్నతనం నుంచే ఉండేదని అంటాడు 47 ఏళ్ళ సాజు. అందుకే ఆయన సిలిగురి, కొత్తజల్పాయిగురి పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి పాతబట్టల్ని సేకరించడం మొదలుపెట్టాడు. అలా సేకరించిన బట్టల్ని సైకిల్ మీద వేసుకుని, టీ తోటల్లోను, ఇతర మురికివాడల్లోనూ తిరుగుతూ, కనిపించిన పేదలకు వాటిని పంచేవాడు. సాజు చేస్తున్న ఈ పనిని మెచ్చుకున్న ఒక స్నేహితుడు జూన్ 2014లో ఒక స్మార్ట్‌ఫోన్‌ను కొనిచ్చి, సాజు తాలూక్దార్ పేరిట 'ఫేస్‌బుక్'లో అక్కౌంటును తెరిచాడు. దాంతో సాజు వితరణ పట్ల ఆకర్షితులైన నెటిజెన్లు ఆయనకు ఫోన్‌కాల్స్ చేయడంతో పాటు, తగిన తోడ్పాటును అందించడం మొదలు పెట్టారు. పాత బట్టల్ని కొనడానికి, వాటిని పేదల వద్దకు తరలించడానికి ఆయన 2015లో ఒక ఆటోను కూడా కొన్నారు. అలీపుర్దార్ జిల్లాలోని బందాపానీ, జల్పాయిగురి జిల్లాలోని కరోన్ గ్రామాన్ని సాజు దత్తతకు తీసుకున్నారు. సామాజిక హితానికి సంబంధించిన ఈ పనిలో సాజుకు తన కుటుంబం నుంచి పూర్తిస్థాయి అండదండలు లభిస్తున్నాయి. కేవలం పాతబట్టల్ని పంచడంతోనే ఆగకుండా సాజు ఒక అనాథా శ్రమాన్ని కూడా నిర్వహిస్తున్నాడు. స్నేహితుల సహాయంతో 28,800 చదరపు అడుగుల స్థలంలో ఆయన ఈ అనాథాశ్రమాన్ని నిర్మించి, రోడ్ల పక్కన అనాథలుగా, నిస్సహాయులుగా దుర్భర జీవనం సాగిస్తున్న వృద్ధులకు ఆయన ఆశ్రయం కల్పిస్తున్నాడు. ●

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

గురువారం, జనవరి 2


ఇక 'ఆర్థికం'పై దృష్టి

గత ఏడాదంతా భారతదేశ ఆర్థిక పరిస్థితి అధ్వానంగానే ఉంది. సుమారు ఆరు త్రైమాసికాలుగా జీడీపీది మందగమనమే. లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం నిరుడు నిరుద్యోగం రేటు కూడా 6.1 శాతం వరకూ ఉంది. గత నాలుగున్నర దశాబ్దాల కాలంతో పోల్చి చూస్తే ఇది చాలా ఎక్కువ కిందే లెక్క. కాగా, సగటు వినియోగం కూడా 2012లో పోలిస్తే నిరుడు చాలా దారుణంగా పడిపోయింది. వీటన్నిటినీ బట్టి ఆలోచిస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త సంవత్సరంలో ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా వ్యూహాలు రూపొందించాల్సి ఉంటుందని అర్థమవుతోంది. నిరుటి పరిస్థితే ఈ ఏడాది కూడా కొనసాగితే దేశ పురోగతి అనేక విధాలుగా కుదేలయిపోతుందనడంలో సందేహం లేదు. పెద్ద ఎత్తున డిమాండ్‌ను సృష్టించడమే కాక, నిరుద్యోగ సమస్య నిర్మూలనకు కూడా అనుకూలమైన విధానాలను ప్రభుత్వం ఇప్పటి నుంచే రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఆర్థికంగా, సామాజికంగా, సంక్షేమపరంగా, అభివృద్ధిపరంగా, భద్రతాపరంగా కూడా కేంద్రం అనేక పథకాలను రూపొందించాల్సిన సమయం ఇది. వీటన్నిటికీ ఆర్థిక విధానమే ఆలంబన అవుతుంది. అందువల్ల ముందుగా ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వక తప్పనిసరి.


ప్రస్తుతం దేశాన్ని చుట్టుముడుతున్న ప్రతి సమస్యకూ ఆర్థిక మాంద్యమే కారణం. ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటే ఆర్థిక విధానం విజయవంతమవుతుంది. ఆర్థిక స్థిరీకరణ అనేది సరైన ఆర్థిక విధానం లేనిదే సాధ్యం కాదు. ఆర్థికంగా కార్యకలాపాలు ఊపందుకోవడానికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాది కొన్ని చర్యలు చేపట్టింది. కానీ, అది ఆర్థిక సెంటిమెంట్‌ను ఆశించినంతగా పెంచలేకపోయింది. ఆర్థిక సెంటిమెంట్‌ను పునరుజ్జీవింపజేయాలి. దానివల్ల కొత్త పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. వినిమయం పెరుగుతుంది. ఆర్థిక సమస్యల మీద చిత్తశుద్ధితో శ్రద్ధ పెడితే అనేక ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఒక్కోసారి అసౌకర్యమైన, ఇబ్బందికరమైన సమాచారం లభించవచ్చు. అయినప్పటికీ ప్రభుత్వం సానుకూలత ఏర్పడే వరకూ ప్రయత్నించాల్సి ఉంటుంది. కేంద్ర ఆర్థిక మంత్రి, ఆర్థిక సలహాదార్లు, ఆర్థిక నిపుణులు రాత్రింబగళ్లు శ్రమిస్తే తప్ప దేశ ఆర్థిక సమస్యలకు పరిష్కారం దొరకదనిపిస్తోంది. ఈ ఏడాదంతా కేంద్రం ఆర్థిక సమస్యల పరిష్కారానికే వినియోగించడం అనివార్యంగా కనిపిస్తోంది.

వాస్తవానికి 2019 ఎన్నికలకు ముందే ఆర్థిక సూచీలు పతనం కావడం ప్రారంభించాయి. అయితే, దీని ప్రభావం ప్రభుత్వం మీద రాజకీయంగా పడకపోవడం అదృష్టంగా భావించాలి. పైగా భారతీయ ఓటర్లు బీజేపీకి ఊహించని సంఖ్యాబలం చేకూర్చారు. అయితే, ఆ తర్వాత వివిధ రాష్ట్రాలకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బలు తగలడం ప్రారంభమైంది. అంటే, దేశ రాజకీయ ఆర్థిక వ్యవస్థ ఒక విచిత్రమైన మలుపు తిరగడం మొదలైందన్న మాట. బీజేపీని కేంద్రంలో కాకుండా రాష్ట్రాలలో శిక్షించడానికి ఓటర్లు నిశ్చయించారని అనిపిస్తోంది. రాష్ట్రాలలో బీజేపీ దెబ్బ తినడాన్ని కొందరు ఒకే వ్యక్తి మీదకు, కుల మత కారణాల మీదకు మళ్లించడానికి ప్రయత్నిస్తే ప్రయత్నించవచ్చు. కానీ, ఇందులో ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయన్నది యథార్థం. భారతదేశం వంటి వైవిధ్య ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక సమస్యల ప్రభావం స్థానికంగానే వ్యక్తమవుతుంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థ ఉత్థాన పతనాల గురించి సామాన్యుడు ఆలోచించడం అనేది జరగదు. కాగా, జాతీయ స్థాయిలో స్థూల లక్ష్యాలతో ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కొత్త మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది. 2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడం వంటివి అన్నమాట. ఈ లక్ష్యం కోసం ప్రయత్నిస్తూనే కేంద్రం ప్రాంతీయ, వర్గీయ వైవిధ్యాల మీద కూడా దృష్టి పెట్టి, తక్షణ సానుకూల ఆర్థిక ప్రభావం గురించి ప్రయత్నించాల్సి ఉంటుంది.

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లో హామీపత్రాన్ని జతచేస్తూ పంపగలరు.
Manam Telugu Daily,
1-11-252/1A To 1D, ALLADIN MANSION
Ground Floor, Street No.3,
Begumpet, Hyderabad-500016
e-mail: manamlekhalu@gmail.com



మంచిమాట



చదివే చదువులో సంతోషం పొందితే, అదే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది

- మహాత్మాగాంధీ

గుణపాఠం నేర్వని పాక్!

నూతన సంవత్సరం వస్తూనే పొరుగు దాయాది దేశంతో పోరాటాన్ని తెచ్చిపెట్టింది. జమ్ము-కశ్మీర్‌లో నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమవుతున్న ప్రజలకు సరిహద్దు ప్రాంతమైన రాజౌరీ జిల్లాలో వాస్తవాధీన రేఖ వెంబడి చొరబాటుదారులకు, మన సైనికులకు మధ్య జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు సైనికులు మరణించడం నూతన వత్సరంలో జరిగిన తొలి కాల్పుల ఘటనగా చెప్పుకోవచ్చు. ఎన్ని చర్యలు తీసుకున్నా, ఎన్నిసార్లు పాక్ ప్రాంతంలోని టెర్రరిస్టు స్థావరాలు, శిక్షణ సంస్థలపై ఆకస్మిక దాడులు చేసి భారీ నష్టాలు కలిగే ఘటనలకు భారత్ పాల్పడినా టెర్రరిస్టుల ఆగడాలు ఆగడం లేదు. ఆకస్మిక దాడులకు దిగినప్పుడల్లా భారత్‌పై విరుచుకుపడే పాకిస్థాన్ తన బుద్ధిని మార్చుకునేందుకు మాత్రం ప్రయత్నించడం లేదు. అంతర్జాతీయంగా దాదాపు టెర్రరిస్టు కార్యకలాపాల శిక్షణకు పాక్ కేంద్రంగా మారిందని ఎన్ని విమర్శలు వచ్చినా పాక్‌లో మాత్రం మార్పు కనిపించడం లేదు. తన చర్యలతో సభ్య సమాజంలో దోషిగా నిలబడే పరిస్థితులు వచ్చినా సిగ్గుపడి తలదించుకోవలసినది పోయి మరింత పేట్రేగిపోయేందుకు సిద్ధపడుతోందేగానీ అంతర్జాతీయ సమాజం హెచ్చరికలను, హితోక్తులను పెడచెవిన పెట్టడం పాక్‌కు వెన్నతో పెట్టిన విద్యగా ఉన్నది. భారత్ నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన తన తొలి ప్రసంగంలోనే టెర్రరిజానికి స్వస్తి పలకాలంటూ జనరల్ మనోజ్ ముకుంద్ రణవణె చేసిన హెచ్చరికల్ని పాక్ ఖాతరు చేయలేదు. ఆయన చేసిన హితోపదేశాన్నిగానీ, హెచ్చరికలనుగానీ పట్టించుకునే శాంతికాముక దేశం పాకిస్థాన్ కాదు. అంత సుబుద్ధే ఉంటే మూడేళ్ల క్రితం అమెరికా చేసిన హెచ్చరికల్ని పట్టించుకునేది.

ఆర్థిక సంకెళ్లున్నా రంకెలు

పాకిస్థాన్ ప్రధానిగా మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ ఎన్నికైన తరువాత పాక్ వైఖరిలో మార్పు వస్తుందని అంతర్జాతీయ సమాజం భావించింది. రాజకీయ నాయకుడి కంటే ఒక క్రీడాకారుడి మనసు విశాలంగా ఉంటుందని, సున్నితమైనదని భావించడం పొరపాటని తరువాత తరువాత గ్రహించిన అంతర్జాతీయ సమాజం కఠిన ఆర్థిక ఆంక్షలు విధించింది. ఎన్ని ఆంక్షలు విధించినా 'వెనుకటి గుణమేల మానురా' అన్న రీతిలోనే పాక్ వ్యవహారశైలి ఉన్నది. ఆ దేశంలో వ్యవసాయం కుంటుపడింది, ఆర్థికరంగం తిరోగమనంలో ఉన్నది, ద్రవ్యోల్బణం కుంగిపోయి దేశం ఉపాధి లేక పేదరికంలో మగ్గిపోతున్నది. అదేం ఖర్మమోగానీ, పాకిస్థాన్ ఆవిర్భావం నుంచి అధికారంలో ఉన్న నేతలకు ఎంతసేపూ పొరుగుదేశంతో కయ్యంపైనే కాకుండా ఆ దేశ రాజకీయ, ఆర్థిక, సార్వభౌమాధికారాలను విచ్ఛిన్నం చేయడమే ధ్యేయంగా పెట్టుకుని పనిచేయడం విచారకరం. ఇందుకు కారణం పాక్‌లో ప్రజాస్వామ్య పవనాలు వీయడం చాలా అరుదు. అక్కడ ఒకవేళ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉన్నా మిలిటరీ చేతిలో బందీగా ఉండి సైనికాధికారుల అడుగులకు మడుగులొత్తే పరిస్థితులే ఉన్నాయి. నిలకడగా ప్రజాస్వామ్యం వర్ధిల్లి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసేప్రయత్నాలు జరిగివుంటే పాక్ నేడీ దుస్థితి పరిస్థితిని ఎదుర్కోవలసి ఉండేది కాదు. దేశంగా ఆవిర్భవించి ఏడు దశాబ్దాలు గడిచి ఎనిమిదో దశాబ్దం సమీపిస్తున్నా దేశంలో ఒక్క భారీ నీటి పారుదల ప్రాజక్టుగానీ, నీటి వనరునిగానీ ఏర్పాటు చేసుకోలేకపోయిందంటే ప్రజాప్రభుత్వం సైనిక అధికారుల చేతిలో ఎంతగా పావులుగా మారిందో అర్థమవుతుంది.



ప్రస్తుతం భారత్‌లోని నరేంద్ర మోదీ ప్రభు త్వం కూడా పాక్ దుష్టపన్నాగాలను తిప్పికొట్టడంలో కొంతవరకు విజయం సాధించగలిగింది. దౌత్య ప్రయ త్నాలతో పాక్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేయడం లో మోదీ విజయం సాధించారనడంలో సందేహం అక్కరలేదు. పుల్వామా, పఠాన్‌కోట్ దాడులతో (2016 జవవరి రెండున జరిగింది) భారత్‌పై పట్టు సాధించామని భావించిన పాక్ ప్రభుత్వాలకు మోదీ ప్రభుత్వం కళ్లెం వేయడంలో ఎంతో కఠినచర్యలతో ముందుకెళ్తోంది. అదే విషయాన్ని ఎన్నో సందర్భాల్లో మోదీ సహా ఆయన సహచరులు ప్రకటించిన విషయం విదితమే! పఠాన్‌కోట్‌లో ఆయుధగారంపై దాడికి సరిగ్గా నేటికి నాలుగో ఏడాది. పఠాన్‌కోట్, పుల్వామా ఘటనల్లో వీరమరణం పొందిన జవాన్లకు 'మనం' నివాళులర్పిస్తోంది.

గుణపాఠం నేర్వని పాక్

సహజంగా ఒక్కొక్క అపజయం మనిషిని గెలుపు దిశగా పయనింపజేస్తుంది. ఆ సహజ గుణం మాత్రం పాక్‌కు అబ్బలేదు. ఒక్కొక్క ఓటమిని ఎదుర్కొని గుణపాఠం నేర్చుకునేందుకు పాక్ ఎన్నడూ ప్రయత్నించిన దాఖలాలు లేవు. భారత్‌తో మూడు యుద్ధాల్లోనూ అపజయం పాలై పాలకులు మారేందుకు కారణమైనప్పటికీ వాటి నుంచి ఎదురైన విమర్శలను ఎదుర్కొగల వివేచన కొరవడిన పాలకులు ఉండడం పాక్ ప్రజల దురదృష్టంగా భావించాలి. ఒకే రాయితో ఏడుసార్లు ఎదురుదెబ్బలు తినేందుకు సైతం పాక్ పాలకులు సిద్ధపడతారుగానీ వాటి నుంచి గుణపాఠం మాత్రం నేర్చుకునే ప్రయత్నాలు చేయరు. ఒకపక్క బంగ్లాదేశ్ దూరమైంది, మరోపక్క ఆఫ్ఘనిస్థాన్ విడిపోయింది అయినా పాకిస్థాన్ పాలకుల విధ్వంసకర ఆలోచనల్లో మాత్రం మార్పు రాలేదు. పాక్‌నుంచి పొరుగుదేశాలకు ఎదురయ్యే ప్రతి ఘటన వెనుక ఉగ్రవాదుల హస్తం ఉన్నదని భారత్ ఎన్నోసార్లు సాక్ష్యాలతో సహా బోనులో నిలబెట్టింది.

ఐరాస తీర్మానం

పాక్‌ను ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశంగా ఐక్యరాజ్యసమితి కూడా ప్రకటించేందుకు సంసిద్ధమైన నేపథ్యంలో కనీసం ఇప్పటికైనా దారి తప్పి ప్రజలను ఎన్నో విషవలయాల్లోకి నెట్టేస్తున్న పాక్ పాలకుల్లో కనువిప్పు కలిగితే మంచిది. ఆ విధంగా ఊహించడం కూడా పొరపాటే. ఎందుకంటే భారత్‌తో నిత్యం కయ్యానికి కాలుదువ్వే సమయాన్ని ఆ దేశంలో అభివృద్ధిపై దృష్టిపెడితే పాక్ ఇప్పటికి ఎంతో అభివృద్ధిని సాధించగలిగేది. భారత్‌లో అస్థిరత సృష్టించడమే ధ్యేయంగా పనిచేసే ప్రభుత్వాలకు అటు ఉగ్రవాదులు, ఇటు సైనికాధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయనేది నిస్సందేహం. భారత్-పాకిస్థాన్‌లు రెండూ ఒకేసారి ఒకే క్షణంలో స్వాతంత్ర్యాన్ని పొందాయి. రెండూ స్వేచ్ఛ కోసం కలిసికట్టుగానే పోరాడి విజయం సాధించాయి. ఆ తరువాతే రెండుదేశాలు అభివృద్ధిలో కూడా చేతుల కలిపి కలిసిమెలిసి పనిచేసివుంటే ఆసియాలోనే కొత్త శక్తిగా ఉద్భవించగలిగేవి. కానీ, ఆవిర్భావమే విధ్వంసంతో ఆవిర్భవించిన దేశం ఆ ఆలోచనలను వదులుకోలేకపోయింది.

మేధావుల మౌనం

నిన్నటి వరకు భాయీభాయీ అని స్వేచ్ఛకోసం బ్రిటిష్ పాలకులతో పోరాడిన నేతలు కొత్తదేశంగా విడిపోయేందుకు అదీ మతప్రాతిపదికన వేరయ్యేందుకు దిగ్విజయంగా కృషిచేశారు. ఆ విజయం వారిని విధ్వంసకర ఆలోచలనకు ప్రేరేపించింది. భారత్ నుంచి విడిపోతే తామేదో అద్భుత అభివృద్ధి సాధించగలమని పాక్ ప్రజలను నమ్మించిన నాటి నుంచి నేటి పాలకుల వరకు అందుకు తగినకృషి చేయడం మానుకుని తిరోగమనాన్ని ఎంచుకున్నారు. అభివృద్ధి వైపు పయనింపకచేయకపోతే సరే... కనీసం అవినీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం వంటివి పెరిగి దేశాన్ని మరింత అథోగతి పాలుచేసింది. దేశం ఇలా భ్రష్టుపట్టే దిశలో పయినిస్తున్నా అక్కడి మేధావులు సైతం మౌనం పాటించడం ఆశ్చర్యకరం.

2019లో సరిహద్దుల్లో 160 మంది హతం

గతేడాది జమ్ము-కశ్మీర్ సరిహద్దుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 160 మంది మృతిచెందారు. పాక్ భూభాగంలో శిక్షణ పొంది భారత్‌లోకి అక్రమంగా చొరబడేందుకు వీరంతా ప్రయత్నించారు. భారత్ నుంచి పంజాబ్‌ను విచ్ఛిన్నం చేసేందుకు ఒకప్పుడు తీవ్రంగా ప్రయత్నించిన పాక్ కుట్రల వల్ల ఉగ్రవాదుల దాడులతో, హత్యలతో పంజాబ్ దాదాపు దశాబ్ద కాలం అట్టుడికింది. కానీ, భారత్ మొక్కవోని ధైర్యంతో ఆ దాడులను ఎదుర్కొని ఎట్టకేలకు పాక్ దురంతాలను రూపుమాపగలిగింది. ప్రస్తుతం భారత్‌లోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా పాక్ దుష్టపన్నాగాలను తిప్పికొట్టడంలో కొంతవరకు విజయం సాధించగలిగింది. దౌత్య ప్రయత్నాలతో పాక్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేయడంలో మోదీ విజయం సాధించారనడంలో సందేహం అక్కరలేదు. పుల్వామా, పఠాన్‌కోట్ దాడులతో (2016 జవవరి రెండున జరిగింది) భారత్‌పై పట్టు సాధించామని భావించిన పాక్ ప్రభుత్వాలకు మోదీ ప్రభుత్వం కళ్లెం వేయడంలో ఎంతో కఠినచర్యలతో ముందుకెళ్తోంది. అదే విషయాన్ని ఎన్నో సందర్భాల్లో మోదీ సహా ఆయన సహచరులు ప్రకటించిన విషయం విదితమే! పఠాన్‌కోట్‌లో ఆయుధగారంపై దాడికి సరిగ్గా నేటికి నాలుగో ఏడాది. పఠాన్‌కోట్, పుల్వామా ఘటనల్లో వీరమరణం పొందిన జవాన్లకు 'మనం' నివాళులర్పిస్తోంది.

◆ **గడిపూడి సదాశివరావు**
(పఠాన్‌కోట్ ఆయుధగారంపై టెర్రరిస్టుల దాడికి నేటికి నాలుగేళ్లు)

ఆత్మ పరిశీలనా సందర్భమిది

ఆనందం, సంతోషం-ఇవి మానవ స్వభావంలో ఉన్న సహజ గుణాలు. సంతోష సమయాల్లో మంచి వస్త్రాలు ధరించడం, రుచికరమైన పదార్థాలు ఆరగించడం, నిషిద్ధాలకు దూరంగా ఇతర పద్ధతుల్లో కూడా ఆనందానుభూతుల్ని వ్యక్తం చేయడం తప్పుకాదు. ప్రపంచంలో చలామణిలో ఉన్న మతధర్మాలన్నీ మానవుల సహజ అవసరాలను గుర్తించి, కొన్ని సక్రమమైన పద్ధతుల్లో వాటిని తీర్చుకునే విధంగా ప్రోత్సహిస్తున్నాయి.



కృత్రిమత్వాన్ని అవలంబించి లేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకొని ఆనందానికి దూరంగా ఉండమని ధర్మం చెప్పదు. అలా అని ఆనంద సమయాల్లో హద్దుల్ని అతిక్రమించి, అధర్మ, అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడడాన్నీ అది సమ్మతించదు. ఎందుకంటే ధర్మంలో ప్రతిదానికీ ఒక హద్దూ, పరిధి నిర్ణయమై ఉన్నాయి. సమయ సందర్భాలు ఏవైనప్పటికీ వాటిని అతిక్రమించడానికి మాత్రం వీల్లేదు.

ఉదాహరణకు, పండుగ ఒక సంతోష సమయం. ఆనందంలో తేలియాడుతూ సంబరం చేసుకునే సందర్భం. అయితే ఈ సంతోష సమయాన తాగి తందనాలాడతానంటే, జూదంలో మునిగి తేలతానంటే కుదరదు. ధర్మం దీన్ని అంగీకరించదు. ధార్మికంగానే కాకుండా నైతిక, సామాజికంగా కూడా ఇలాంటి చేష్టలు నేరం. దేవుని చట్టమే కాదు, ప్రపంచంలోని మానవ చట్టాలు కూడా దీన్ని హర్షించవు. అందుకని ధార్మిక, మానవీయ పరిధుల్ని అతిక్రమించకుండా ధర్మసమ్మతమైన మార్గాల్లో సంబరాలు జరుపుకోవడం సమ్మతమే. ఇస్లాం ధర్మం ఎప్పుడూ మానవుల్ని సంతోషంగా, నూతనోత్సాహంతో, ప్రఫుల్ల భావాలతో, హుషారుగా ఉంచాలని అభిలషిస్తుంది. అందుకే అది పరిధిమేర మానవులకు స్వేఛ్ఛను, స్వయం నిర్ణయాధికారాన్ని ప్రసాదించింది.

ఇదేవిధంగా నూతన సంవత్సర వేడుక. ఇదొక నిరంతర ప్రక్రియ. కాలప్రవాహంలో కొత్తసంవత్సరాలు వస్తూనే ఉంటాయి, పోతూనేఉంటాయి. కేలండర్లు మారుతూనే ఉంటాయి. అమూల్యమైన కాలం ఎవరి కోసమూ ఆగదు. దానివెంట పరిగెత్తలేని వారు మరుగున పడిపోతారు. సృష్టి ఆరంభం నుంచి నేటివరకు అందరూ కాలగర్భంలో కలిసిపోయినవారే, కలిసిపోయేవారే. కొత్తసంవత్సరానికి స్వాగతం పలికేటప్పుడు ఈ యదార్థాన్ని గుర్తుంచుకోవాలి.

యుగయుగాల ఈ కాల పరంపరలో మానవ జీవిత కాలం చాలా చిన్నది. దీన్ని సద్వినియోగం చేసుకోవడంలోనే మానవ ఔన్నత్యం దాగి ఉంది. సృష్టిలో ఉన్నటువంటి అసంఖ్యాక జీవరాసుల్లో ఏ ఒక్కదానికీ మానవుడికున్నన్ని తెలివితేటలు లేవు. బుద్ధికుశలత, విచక్షణ జ్ఞానం మనిషికి సొంతం. అంతటి అద్వితీయ విజ్ఞానసంపన్నుడు, సృష్టికే మకుటాయమానంగా వెలుగొందుతున్న విచక్షణా జ్ఞాన ఖని తనస్థాయిని కోల్పోయి కాల ప్రవాహంలో కొట్టుకుపోకూడదు.

నిస్సందేహంగా కొత్తసంవత్సరానికి సంతోషంగా స్వాగతం పలకవలసిందే. కాని ఆసంతోషంలో హద్దుల అతిక్రమణ జరగకూడదు. అవాంఛనీయ కార్యకలాపాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించడం ఎంతవరకు సబబు అని ఆలోచించాలి. నిజానికి గత సంవత్సరం ఏమేమి చేశామని ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సందర్భమిది. మంచిపనులు చేసి ఉంటే, సత్కార్యాలు ఆచరించి ఉంటే ఈసారి అవి ఇంకా అధికంగా, ఇబ్బడి ముబ్బడిగా చేయాలన్న దృఢసంకల్పం చెప్పుకోవాలి. ఒకవేళ ఏమైనా తప్పులు, పాపాలు జరిగి ఉంటే సిగ్గుతో పశ్చాత్తాప పడుతూ, ఇకముందు ఎట్టి పరిస్థితిలోనూ అలాంటి వాటి జోలికి పోమని ప్రతిజ్ఞ చేయాలి.

అందుకని ప్రతి ఒక్కరూ ఈ నూతన సంవత్సర ప్రారంభ వేళ, మందు, చిందు లాంటి అవాంఛనీయ, అసభ్య కార్యకలాపాలకు తావీయకుండా నైతిక విలువలను పాటిస్తూ మానవ ఔన్నత్యానికి భంగం కలగని విధంగా కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించాలి. ఈ నూతన సంవత్సరాన సృష్టికర్త అయిన దైవం సమస్తమానవాళికీ మంచి బుద్ధినీ, సమృద్ధిగా శుభాలను ప్రసాదించాలని మనసారా కోరుకుందాం. ముఖ్యంగా మన యువతరాన్ని అన్నిరకాల దుర్వ్యసనాల నుంచి కాపాడాలని ప్రార్థిద్దాం.

◆ **యండి. ఉస్మాన్ ఖాన్**
సీనియర్ జర్నలిస్టు

నిబంధనలు అమలవుతాయా?

జేఎన్టీయూహెచ్ ప్రతి సంవత్సరం నియమ నిబంధనలు బుక్ విడుదల చేస్తుంది. కానీ నిబంధనలు అధ్యాపకులకు వరమా! యజమాన్యాలకు వరమా! విద్యార్థులకు లాభమా! అని పరిశీలిస్తే పేజి నెంబర్ 6 క్లాజు 3.5 లో చూస్తే అధ్యాపకుల బయోమెట్రిక్ అటెండెన్స్ కచ్చితంగా ఉండాలని తెలియజేసింది కానీ అది అమలు కావడం లేదు. కావున బయోమెట్రిక్ అటెండెన్స్ కచ్చితంగా అమలు చేయాలి. పేజి నెంబర్ 11 క్లాజు 3.29 చూస్తే యూనివర్సిటీ నిబంధనల ప్రకారంగా అధ్యాపకులు లేకపోవడం, అర్హత కలిగిన అధ్యాపకులు లేక పోవడం మరికొన్ని విషయాలలో నిబంధనలను అతిక్రమిస్తే కచ్చితంగా కాలేజీ పరిమిషన్ రద్దు చేస్తామని తెలియజేశారు. ఇదే క్లాజులోని రెండవ పాయింట్ చూస్తే యూనివర్సిటీ విడుదల చేసిన సెలవుదినాలను కచ్చితంగా పాటించాలని పాటించకపోతే, ఇదే క్లాజులో 8 చూస్తే అధ్యాపకుల బయోమెట్రిక్ అటెండెన్స్‌ని మార్ఫింగ్ చేస్తే చర్యలు చేపడతామని చెప్పారు. కానీ యూనివర్సిటీ మాత్రం అమలు విషయంలో చాల జాప్యం చేస్తోంది. మరొక విషయం ఇదే క్లాజులో యూనివర్సిటీ గుర్తింపు ఇచ్చిన స్థలంలో క్లాస్ నడపకుండా ఇతర స్థలాలలో క్లాసులు నడిపితే తగిన చర్య తీసుకుంటామని ఉంది. ఇదే క్లాజులోని 13 చూస్తే అధ్యాపకులను ఒక కళాశాల నుంచి ఇంకొక కళాశాలకు చూపిస్తే, ఒక కళాశాల లాబరేటరీ పరికరాలను మరొక కళాశాలకు మార్చినట్టుయితే కళాశాల అనుమతి రద్దు చేస్తామని తెలియజేశారు. పేజి నెంబర్ 13, క్లాజు 3.30లో ఒక కళాశాలలో గత మూడు సంవత్సరాల కాలంలో చూస్తే 25 శాతం యూనివర్సిటీ విడుదల చేసినటువంటి అడ్మిషన్లు తగ్గితే ఆ బ్రాంచ్‌నీ రద్దు చేస్తామని కూడా చెప్పారు. ఆ విషయంలో ఏ మాత్రం పట్టించుకోకుండా కొన్ని కళాశాలల అనుమతులను మంజూరు చేస్తున్నారు. పేజి నెంబర్ 22 లోని క్లాజు 11 చూస్తే ఇందులో పాయింట్ జి పరిశీలిస్తే ప్రతి ఉద్యోగికి అపాయింట్మెంట్ లెటర్ని అందించాలని అందులో పే స్కేల్స్ పొందుపర్చాలని వారికి కళాశాల సర్వీస్ నిబంధనలు పొందుపరిచి అంద జేయాలని పేర్కొన్నారు. కానీ చాల కళాశాలలో అధ్యాపకులకు అది ఇవ్వడం లేదు. కళాశాల వెబ్సైట్లలో నూతన అధ్యాపకులను పొందుపరుస్తూ వెళ్లిపోయిన అధ్యాపకులను తొలగిస్తూ, నూతన అధ్యాపకులను అప్డేట్ చేయాలని ఉంది. అధ్యాపకుల జీతం బ్యాంకు ద్వారా చెల్లించాలని వారికి ఏజిపి,డిఎ,హెచ్ఆర్ఎ, సిసిఎ, పిటి,టిడిఎస్, పిఎఫ్ డిటెక్షన్ వాటి ఆధారంగా జీతాలు చెల్లించాలని తెలియజేసింది. ప్రతి సంవత్సరం ప్రతి ఉద్యోగికి ఫామ్ 16 కచ్చితంగా ఇవ్వాలని అని కూడా ఉన్నది.

మన లేఖలు

ప్రధానంగా క్లాజు12లో పాయింట్ 12.2 చూస్తే ప్రిన్సిపల్‌ను సరైన నిబంధనల ప్రకారంగా తీసుకోవాలని అధిగమిస్తే రద్దు చేస్తామని చెప్పారు. అదే క్లాజులోని 12.3లో చూస్తే అధ్యాపక విద్యార్థి నిష్పత్తి లేకపోతే కచ్చితంగా లేకపోతే చర్యలుండాలి. పేజి నెంబర్ 56లో చూస్తే అనెక్సిరి 8 పరి శీలిస్తే కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధికారులకు అఫిడవిట్ సబ్మిట్ చేయాలి. ఉద్యోగుల జీతాల విషయంలో చూస్తే పే స్కేల్ ప్రకారం జీతాలు ఇస్తున్నామని, ఉద్యోగులకు(టీచింగ్ నాన్-టీచింగ్) కల్పించాల్సినవి కల్పిస్తున్నామని తెలియజేశారు. తాము ఇచ్చిన సమాచారంలో ఏదైనా లోపం ఉంటే కళాశాలపై తగిన చర్య తీసుకోవాలని కూడా చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉద్యోగులకు జీతాలు చెల్లింపు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరుతున్నాం.

- ఏ.సంతోష్ కుమార్
తెలంగాణ స్కూల్స్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్
9618927732

ఒకటో తేదీ షాక్.. భారీగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర..!



న్యూఢిల్లీ: వామ్మో ఒకటో తారీఖు అనే సినిమా నా చిన్నప్పుడు చూశాను. ఈ మూవీ ప్రస్తావన ఇప్పుడు ఎందుకని అనుకుంటున్నారా? ఒకటో తేదీ వచ్చిందంటే చాలు ఈ సినిమా ఏదో ఒక సందర్భంలో గుర్తుకు వస్తూనే ఉంది. ఇప్పుడు వంట గ్యాస్ ధర మరోసారి పెరగడంతో ఈ సినిమా టైటిల్ గుర్తుకు వచ్చింది. మధ్యతరగతి ప్రజలకు ఒకటే తేదీ వచ్చిందటే చాలు గ్యాస్ షాక్ తగులుతూనే వస్తోంది. ఎల్‌పీజీ సిలిండర్ ధర పెరుగుదల జనవరి 1 నుంచే అమలులోకి వచ్చింది. సిలిండర్ ధర దాదాపు రూ.19 మేర పెరిగింది. దీంతో సిలిండర్ ధర ఐదు నెలల్లో ఏకంగా రూ.140 పైకి కదిలింది. దీంతో గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే వారిపై కొంత మేర ప్రతికూల ప్రభావం పడనుంది. ఇండియన్ ఆయిల్ లేటెస్ట్ ధరల జాబితా ప్రకారం.. ఇండేన్ గ్యాస్ 14.2 కేజీల నాన్ సబ్సిడీ ఎల్‌పీజీ సిలిండర్ ధర ఇప్పుడు రూ.714కు చేరింది. ఢిల్లీలో ఈ ధర వర్తిస్తుంది. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర కోల్‌కతాలో రూ.747కు, ముంబైలో రూ.684కు, చెన్నైలో రూ.734కు పెరిగింది. కాగా 19 కేజీల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర కూడా పెరిగింది. ఢిల్లీలో గ్యాస్ సిలిడర్ ధర రూ.1,241కు చేరింది. కోల్‌కతాలో ఈ సిలిండర్ ధర రూ.1,308గా ఉంది. ముంబైలో గ్యాస్ సిలిండర్ ధర రూ.1,190కు చేరింది. ఇక చెన్నైలో 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.1,363గా ఉంది. సిలిండర్ ధర పెరుగుతూ రావడం ఇది వరుసగా ఐదో నెల కావడం గమనార్హం. అక్టోబర్ నెలలో ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.15 మేర పెరిగింది. సెప్టెంబర్ నెలలోనూ ఎల్‌పీజీ ధర రూ.15.5 పైకి కదిలింది. నవంబర్‌లో గ్యాస్ సిలిండర్ ధర రూ.76 పెరిగింది. డిసెంబర్ నెలలో గ్యాస్ సిలిండర్ ధర పెరుగుదల రూ.14 మేర పైకి కదిలింది. ఇప్పుడు మళ్లీ గ్యాస్ ధర పెరిగింది. ఇకపోతే జూలై, ఆగస్ట్ నెలల్లో నాన్ సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర మొత్తంగా రూ.163 దిగొచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఒక కుటుంబానికి ఏడాదికి 12 సిలిండర్లను సబ్సిడీ కింద అందిస్తోంది. వీటిని అదనంగా సిలిండర్ కావాలంటే మార్కెట్ ధర చెల్లించాలి. ఇకపోతే గ్యాస్ కంపెనీలు ప్రతి నెలా ఎల్‌పీజీ సిలిండర్ రేట్లను సమీక్షిస్తూ ఉంటాయి. సంస్థలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్‌పీజీ రేట్లు, అమెరికా డాలర్-ఇండియన్ రూపాయి మారకపు విలువ వంటి అంశాలు ప్రాతిపదికన ధరను మారుస్తూ ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ధరలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు.

కేంద్రం సబ్సిడీ.. కానీ

అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా దేశీ మార్కెట్‌లో గ్యాస్ సిలిడర్ ధర పెరిగితే అప్పుడు మోదీ సర్కార్ వినియోగదారులకు అధిక సబ్సిడీ మొత్తాన్ని అందిస్తుంది. దీంతో ధర పెరిగిన ప్రభావం కనిపించదు. అయితే ఇది అందరికీ వర్తించదు. అయితే ఇక్కడ గ్యాస్ సిలిండర్‌పై చెల్లించే జీఎస్‌టీ మాత్రం ధరతో పాటు పెరుగుతుంది. మార్కెట్ ధర ప్రాతిపదికనే జీఎస్టీ నిర్ణయమౌతుంది. అందువల్ల గ్యాస్ సిలిండర్ ధర పెరిగితే.. అప్పుడు ఎక్కువ జీఎస్‌టీ చెల్లించాల్సి వస్తుంది.



జియోమార్ట్ సర్వీసులు లాంచ్..

రూ.3,000 డిస్కౌంట్‌తోపాటు అదిరిపోయే బెనిఫిట్స్!

ముంబై: దిగ్గజాలను ఢీ కొట్టేందుకు రెడీ అవుతున్నారు అపర కుబేరుడు ముకేశ్ అంబానీ. తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించడానికి వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, వాల్‌మార్ట్ వంటి దిగ్గజ సంస్థలకు ఝలక్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. టెలికం రంగంలో చౌక ధరలు, ఇతర ఉచిత సర్వీసుల వ్యూహంతో ప్రత్యర్థులకు షాకిచ్చిన అంబానీ ఇప్పుడు కూడా ఇదే స్ట్రాటజీతో ముందుకు వెళ్లొచ్చు.

ఈ-కామర్స్ వెంచర్

దేశీ అతిపెద్ద కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా జియోమార్ట్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ కంపెనీ ఇప్పుడు ఆన్‌లైన్ ఫుడ్ అండ్ గ్రాసరీ షాపింగ్ విభాగంలోకి ఎంట్రీ ఇచ్చినట్లు అయ్యింది. దీంతో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలకు పోటీ తప్పేలా లేదు. జియో సాంకేతికత, రిలయన్స్ రిటైల్ క్యాష్ అండ్ క్యారీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సాయంతో జియోమార్ట్ పనిచేయనుంది. ఇదొక యాప్. ఇది కస్టమర్లను దగ్గరిలోని రిటైల్ స్టోర్లతో అనుసంధానమై ఉండేలా చేస్తుంది. అంటే జియోమార్ట్ అనేది ఒక అగ్రిగేటర్ మాదిరి పనిచేస్తుంది. ఇద్దరి మధ్య వారధిగా వ్యవహరిస్తుంది. జియోమార్ట్ స్థానిక గ్రాసరీ షాపులు, రిటైల్ స్టోర్లకు తక్కువ వడ్డీకే మూలధనం అదించడం, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) సదుపాయం కల్పించడం, సరుకు నిర్వహణ నైపుణ్యాలు నేర్పించడం వంటివి చేస్తుంది. ముకేశ్ అంబానీ 2019 జనవరిలోనే రిటైల్ అండ్ టెలికం విభాగంతో ఈకామర్స్ విభాగంలోకి ఎంట్రీ ఇస్తామని ప్రకటించారు.

కొన్నిచోట్లే సేవలు

ప్రస్తుతం జియోమార్ట్ సేవలు అన్ని చోట్ల అందుబాటులో లేవు. కేవలం నవీ ముంబై, కల్యాణ్, థానే వంటి ప్రాంతాల్లోనే అందుబాటులో ఉన్నాయి. 'ఇండియా కి నయా దుకాన్' ట్యాగ్‌తో జియోమార్ట్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. జియోమార్ట్ వెబ్ పోర్టల్‌లో ప్రి రిజిస్ట్రేషన్స్ ప్రారంభమయ్యాయి. త్వరలోనే దేశవ్యాప్తంగా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఫ్రీరిజిస్ట్రేషన్ ఆఫర్లు

జియోమార్ట్ ద్వారా డిస్కౌంట్స్, ఉచిత మ్ డెలివరీ వంటి ప్రయోజనాలు పొందొచ్చు. అలాగే కస్టమరలకు 50,000కు పైగా గ్రాసరీ ప్రొడక్ట్స్ అందుబాటులో ఉంటాయని సంస్థ పేర్కొంది. మినిమమ్ ఆర్డర్ వ్యాల్యూ ఉండదని తెలిపింది. ఇంకా ఎక్స్‌ప్రెస్ డెలివరీ సదుపాయాలు కూడా ఉంటాయని పేర్కొంది. ప్రొడక్ట్స్‌ను రిటర్న్ చేసే సమయంలో ఎలాంటి ప్రశ్నలు ఉండవని కూడా తెలిపింది.





బోణి బాగుంది!

లాభాల్లో స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 50 పాయింట్లు అప్

- 12,200 దిగువునే నిఫ్టీ
- ఐటీ షేర్లలో కొనుగోళ్లు

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్ కొత్త సంవత్సరానికి లాభాలతో బోణి పలికింది. బెంచ్‌మార్క్ సూచీలు భారీ లాభాలు కాకుండా కూడా స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. బుధవారం మార్కెట్ ఆరంభంలోని దూకుడు చివరి వరకు కొనసాగలేదు. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్ల జోరు కొనసాగింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 190 పాయింట్ల మేర పరుగులు పెట్టింది. 41,443 పాయింట్లను తాకింది. నిఫ్టీ 12,222 పాయింట్ల గరిష్టానికి చేరింది. ఆటోమొబైల్ సహా పలు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు మార్కెట్ లాభాలను హరించాయి. చివరకు సెన్సెక్స్ 52 పాయింట్ల లాభంతో 41,306 పాయింట్ల వద్ద, నిఫ్టీ 21 పాయింట్ల లాభంతో 12,190 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి.

మార్కెట్స్ హైలెట్స్..

- నిఫ్టీ 50లో అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, వేదాంత, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 3 శాతానికి పైగా పెరిగింది.
- అదేసమయంలో టైటాన్, ఐషర్ మోటార్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఓఎన్‌జీసీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు నష్టపోయాయి. టైటాన్ దాదాపు 3 శాతం పడిపోయింది.
- నిఫ్టీ సెక్టోరల్ ఇండెక్స్‌లన్నీ మిశ్రమంగా క్లోజయ్యాయి. నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫార్మా, ఫార్మా పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్‌లు మినహా మిగతావన్నీ నష్టపోయాయి. నిఫ్టీ మీడియా ఇండెక్స్ దాదాపు 1 శాతం పడిపోయింది.
- అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ (ముడి చమురు) ధరలు తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 0.96 శాతం తగ్గుదలతో 66.03 డాలర్లకు క్షీణించింది. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర బ్యారెల్‌కు 0.78 శాతం క్షీణతతో 61.20 డాలర్లకు తగ్గింది.
- అమెరికా డాలర్‌తో పోలిస్తే ఇండియన్ రూపాయి స్వల్ప లాభాల్లో ట్రేడవుతోంది. 71.31 వద్ద కదలాడుతోంది.

సైరస్ మిస్త్రీ వివాదంపై సుప్రీం కోర్టుకు టాటా సన్స్, ఇండక్ట్ తప్పదా?



ముంబై: టాటా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా సైరస్ మిస్త్రీని తిరిగి నియమించాలన్న నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) తీర్పుపై టాటా సన్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. ఎన్‌సీఎల్‌టీ తీర్పును సవాల్ చేస్తూ మధ్యంతర స్టే ఇవ్వాలని టాటా సన్స్ కోరుతోంది. మరి?కొన్ని రోజుల్లో టీసీఎస్ బోర్డు సమావేశంజరగనున్న నేపథ్యంలోదీనిపై తక్షణమే స్టే తెచ్చుకోవాలని సంస్థ భావిస్తోంది. అయితే ఇటీవలి సెలవుల తర్వాత సుప్రీంకోర్టు ఈ కేసుకు సంబంధించి జనవరి 6న వాదనలు విననుందని అంచనా. మరోవైపు జనవరి 9న బోర్డు సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా టీసీఎస్ కూ3 ఫలితాలను కూడా విడుదల చేయనున్నారు. టాటా సన్స్ అప్పీల్‌ను సైరస్ మిస్త్రీ, అతని కుటుంబం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని..ఎన్‌సీఎల్‌ఏటీ నిర్ణయాన్ని అమలు చేయాలని సైరస్ కుటుంబం డిమాండ్ చేయవచ్చని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రతి క్వార్టర్ ఫలితాలు విడుదల చేయడానికి కంపెనీలకు 45 రోజుల సమయముంటుందని, టాటా సన్స్‌కు ఫిబ్రవరి వరకు సుప్రీం నిర్ణయం కొరకు వేచి చూసే అవకాశం ఉందని ఎస్అండ్ఆర్ అసోసియేట్స్ ప్రతినిథి మహాపత్ర పేర్కొన్నారు. టాటా సన్స్ 2016 లో మిస్త్రీని ఛైర్మన్‌గా తొలగించి, కొన్ని నెలల తరువాత ఎన్ చంద్రశేఖరన్‌ను నియమించింది. ప్రస్తుతం టాటా గ్రూప్ ఛైర్మన్‌గా నటరాజన్ చంద్రశేఖరన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

కొత్త ఏడాదిలో బంగారం ధర పరిగెడుతుందా? పడిపోతుందా?

న్యూఢిల్లీ: బంగారంపై మనకు మక్కువ ఎక్కువ. దీనికి ఎన్నో కారణాలున్నాయి. భారతీయులు బంగారం ఎక్కువగా కొనుగులు చేస్తుంటారు. పండుగలు, పెళ్లిళ్ల, ప్రత్యేకమైన సందర్భాలు వచ్చినప్పుడు బంగారం కొనుగోళ్లు జోరందుకుంటాయి. ధర పెరిగిందంటే.. డిమాండ్ పెరిగిందని అర్థం. బంగారానికి కూడా దీన్ని అన్వయించుకోవచ్చు. అయితే పూర్తిగా మాత్రం కాదు. బంగారానికి డిమాండ్ ఎప్పటికీ ఉంటుంది. పెళ్లిళ్ల జరుగుతానే ఉంటాయి. పండుగలు ప్రత్యేక సందర్భాలు వస్తూనే ఉంటాయి. మరి బంగారం ధర పెరుగుదలకు ఏయే అంశాలు దోహదపడతాయి? బంగారం ధరపై కేవలం డిమాండ్ అంశం మాత్రమే కాకుండా ఇతర విషయాలు కూడా ప్రభావం చూపుతాయి. ద్రవ్యోల్బణం, గ్లోబల్ మార్కెట్ పసిడి ధరల్లో మార్పు, కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారం నిల్వలు, వడ్డీ రేట్లు, జువెలరీ మార్కెట్, భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు వంటి పలు అంశాలు పసిడి ధరపై ప్రభావితం చేస్తాయి. 2019లో బంగారం ధర పరుగులు పెట్టింది. ఏకంగా 22 శాతానికి పైగా ర్యాలీ చేసింది. దీనికి ప్రధాన కారణం గ్లోబల్ కేంద్ర బ్యాంకులు. అవి వడ్డీ రేట్లను తగ్గిస్తూ వచ్చాయి. దీంతో వ్యవస్థలో లిక్విడిటీ పెరిగింది.



దీంతో ఇన్వెస్టర్లు బంగారాన్ని కొనేశారు. ఇదేకాకుండా అమెరికా, చైనా మధ్య నడిచిన వాణిజ్య ఉద్రిక్తతలు కూడా పసిడి జోరుకు దోహదపడ్డాయి. ఇన్వెస్టర్లు సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ సాధనంగా భావించే గోల్డ్‌లో ఇన్వెస్ట్ చేసేశారు. లాభం లేదా డబ్బు సంపాదించడం అంటే ఏంటి? తక్కువ ధరలో కొని ఎక్కువ ధరలో అమ్మేకోవాలి. అప్పుడు డబ్బు సంపాదించగలం. ఇక్కడ బంగారం విషయానికి వస్తే.. పసిడి ఇప్పటికే బాగా ర్యాలీ చేసింది. అంతేకాకుండా కొత్త ఏడాది కూడా కొంత కాలం పరుగులు పెట్టొచ్చు. కానీ ఇదే జోరు చివరి వరకు కొనసాగుతుందా? లేదా? అని అంచనాకు రావడం కష్టమే.

నిపుణులు ఏమంటున్నారు?

మార్కెట్ నిపుణులు బంగారం ధరపై మిశ్ర మంగా స్పందిస్తున్నారు. కొందరేమో ర్యాలీ చే స్తుందని చెబితే.. మరికొందరేమో పరుగు ఉండక పోవచ్చని అంచనా వేస్తున్నారు. ధర తక్కువలో ఉన్నప్పుడు కొంటే.. పెరిగినప్పుడు విక్రయించుకొని లాభం పొందొచ్చు. ఇప్పుడు బంగారానికి దీన్ని అన్వయించుకుటే.. బంగారం ధర ఇప్పటికే గరిష్ట స్థాయిల్లో ఉంది. బంగారం ధర ఇటీవలనే ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరింది. అక్కడి నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చింది. అయితే గత రెండు వారాల్లో బంగారం ధర మళ్లీ పుంజుకుంది. పసిడి ధర ఇప్పటికే గరిష్ట స్థాయిలో ఉండటం వల్ల ఇప్పుడు కొనుగోలు చేయడం వల్ల పెద్దగా లాభం రాకపోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అంటే ఈ ఏడాది బంగారం అదిరిపోయే రాబడి అందించకపోవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

ఈరోజు ధరలు ఇలా..

హైదరాబాద్ మార్కెట్‌లో బుధవారం బంగారం ధర తగ్గింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.50 దిగొచ్చింది. దీంతో బంగారం ధర రూ.37,220కు తగ్గింది. అదేసమయంలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.10 తగ్గుదలతో రూ.40,660కు క్షీణించింది.



జనవరిలో బ్యాంకులకు 16 రోజులు సెలవులు..

న్యూఢిల్లీ: బ్యాంక్‌లో అకౌంట్ ఉందా? అయితే మీకు ఒక అలర్ట్. పాత ఏడాది చివరకు వచ్చేశాం. రేపటితో కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టబోతున్నాం. అందుకే కొత్త ఏడాది తొలి నెల జనవరిలో బ్యాంకులకు ఎన్ని రోజులు సెలవులు ఉన్నాయో ఇప్పుడే తెలుసుకోవడం మంచిది. బ్యాంకులకు జనవరి నెలలో 16 రోజులు సెలవులు ఉన్నాయి. పబ్లిక్ హాలిడేస్ అన్ని కలుపుకొని ఈ సెలవులు ఇచ్చాం. రిజర్వు బ్యాంక్ రాష్ట్రాల ప్రాతిపదికన బ్యాంక్ సెలవులను ప్రకటించింది. ఇక్కడ బ్యాంక్ సెలవులు రాష్ట్రాల ప్రాతిపదికన, బ్యాంక్ ప్రాదిపదికన మారుతూ ఉంటాయి. ఒక రాష్ట్రంలో బ్యాంకుల సెలవు ఉంటే.. మరో రాష్ట్రంలో ఆ రోజున బ్యాంకులకు సెలవు ఉండకపోవచ్చు. ఇకపోతే బ్యాంకులు ఆదివారాలు ఉండవు. అలాగే రెండు, నాలుగో శనివారాల్లోనూ పనిచేయవు. మొత్తంగా జనవరి నెలలో ఎక్కువ బ్యాంకులకు దాదాపు 10 రోజులకు పైగా సెలవు రోజులు ఉన్నాయి.

దేశవ్యాప్తంగా జనవరి నెలలో బ్యాంక్ సెలవులు ఇవే..

- జనవరి 1 - కొత్త సంవత్సరం (చాలా ప్రాంతాల్లో బ్యాంకులకు సెలవు)
- జనవరి 2 - గురుగోవింద్ సింగ్ జయంతి (చాలా రాష్ట్రాల్లో హాలిడే ఉంది)
- జనవరి 5 - ఆదివారం
- జనవరి 7 - ఇమోయిను ఇరత్పా (ఇంఫాల్)
- జనవరి 8 - గాన్‌ఘాయి (ఇంఫాల్‌లో సెలవు)
- జనవరి 11 - రెండో శనివారం
- జనవరి 12 - ఆదివారం
- జనవరి 14 - మకర సంక్రాంతి (అహ్మదాబాద్‌లో సెలవు)
- జనవరి 15 - ఉత్తరాయణ మకర సంక్రాంతి, పొంగల్, (చెన్నై, గౌహతి, హైదరాబాద్, అమరావతి తదితర ప్రాంతాల్లో సెలవు)
- జనవరి 16 - తిరువల్లూర్ డే (చెన్నై)
- జనవరి 17 - ఉజావర్ తిరునాల్ సెలబ్రేషన్స్ (చెన్నై)
- జనవరి 19 - ఆదివారం
- జనవరి 23 - నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి (కోల్‌కతా, అగర్తాల)
- జనవరి 25 - నాలుగో శనివారం
- జనవరి 26 - ఆదివారం
- జనవరి 30 - సరస్వతి పూజ, వసంత పంచమి

నేటి నుంచి 3 కొత్త నిర్ణయాలు అమలులోకి..

న్యూఢిల్లీ: దేశీ అతి పెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ బ్యాంక్ తన కస్టమర్లకు ఎన్నో రకాల సర్వీసులు అందిస్తోంది. డిపాజిట్లు, క్యాష్ విత్‌డ్రా, లోన్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇలా ఎన్నో సేవలు ఆఫర్ చేస్తోంది. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంక్ ఎప్పటికప్పుడు కొత్త సర్వీసులు తీసుకువస్తూ ఉంటుంది. ఇందులో భాగంగానే బ్యాంక్ 3 కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇవి నేటి నుంచి అమలులోకి వచ్చేశాయి. దీంతో బ్యాంక్ కస్టమర్లకుపై కచ్చితంగా ఎఫెక్ట్ పడుతుంది. నేటి నుంచి మారిన ఆ మూడు అంశాలు ఏంటివో ఒకసారి చూద్దాం. స్టేట్ బ్యాంక్ తన ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత రుణ రేటు (ఈబీఆర్)ను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీంతో ఈ రేటు ఇప్పుడు 8.05 శాతం నుంచి 7.8 శాతానికి దిగొచ్చింది. ఈ నిర్ణయం ఈ రోజు నుంచే అమలులోకి వచ్చింది. ఆర్‌బీఐ డిసెంబర్ మానిటరీ పాలసీ తర్వాత ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేటు తగ్గించిన



ఒకే ఒక బ్యాంక్‌గా ఎస్‌బీఐ నిలిచింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు తగ్గింపుతో ప్రస్తుత తెమ్ లోన్ కస్టమర్లకు వడ్డీ రేటు తగ్గుతుందని బ్యాంక్ తెలిపింది. ఎంఎస్‌ఎంఈ రుణాలకు కూడా ఇది వర్తిస్తుందని పేర్కొంది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేటుతో అనుసంధానమైన రుణాలపై వడ్డీ రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని బ్యాంక్ తెలిపింది. కొత్తగా మ్ లోన్ తీసుకునే వారు 7.9 శాతం వడ్డీ రేటుకే రుణాలు పొందొచ్చని పేర్కొంది.

కొత్త ఏటీఎం సర్వీసులు

స్టేట్ బ్యాంక్ వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ఆధారిత క్యాష్ విత్‌డ్రా సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏటీఎం మోసాలను అరికట్టేందుకు బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాదారులకు ప్రయోజనం కలుగనుంది. ఏటీఎంలో లావాదేవీలు సురక్షితం కానున్నాయి. ఈ రోజు నుంచే ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

విత్‌డ్రా 10,000 దాటితే..

ఎస్‌బీఐ ఓటీపీ ఆధారిత క్యాష్ విత్‌డ్రా సేవలు అన్ని ఏటీఎం లావాదేవీలకు వర్తించదు. కేవలం రూ.10,000కు పైన వ్యాల్యూ ఉన్న ట్రాన్సాక్షన్లకు ఇది వర్తిస్తుంది. ఎస్‌బీఐ ఏటీఎం నెట్‌వర్క్‌కు అంతటికీ ఓటీపీ విధానం అమలులోకి వస్తుంది. బ్యాంక్ ఖాతాదారులు ఏటీఎం నుంచి డబ్బు తీసుకోవాలని ప్రయత్నిస్తే.. అప్పుడు బ్యాంక్ అకౌంట్‌తో రిజిస్టర్ అయిన మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే డబ్బులు తీసుకోవడం వీలవుతుంది. దీంతో మోసపూరిత లావాదేవీలకు చెక్ పెట్టొచ్చని బ్యాంక్ భావిస్తోంది.

ఆ డెబిట్ కార్డులు పనిచేయవు

పాత ఎస్‌బీఐ డెబిట్ కార్డ్స్ ఉపయోగిస్తున్న వారు ఈ విషయం తెలుసుకోవాలి. స్టేట్ బ్యాంక్ ఎప్పటి నుంచో పాత డెబిట్ కార్డులను కొత్త కార్డ్స్‌తో మార్చుకోవాలని కస్టమర్లను కోరుతూనే వస్తోంది. పాత మ్యాగ్నటిక్ స్ట్రిప్ డెబిట్ కార్డుల స్థానంలో కొత్త ఈఎంవీ చిప్ డెబిట్ కార్డులు తీసుకోవాలని ఖాతాదారులకు అలర్ట్స్ పంపుతూనే ఉంది. దీనికి డిసెంబర్ 31తోనే గడువు పూర్తియ్యింది. దీంతో పాత డెబిట్ కార్డ్స్ ఈ రోజు నుంచి పనిచేయవు.

సచివాలయాలకు అమ్మఒడి జాబితాలు

- జిల్లాలో అందిన దరఖాస్తులు 3.7 లక్షలు
- తొలి విడతగా అర్హులైన విద్యార్థుల సంఖ్య: 3.1లక్షలు
- రీ వెరిఫికేషన్ చేసుకోవాల్సిన వారు: 21,885 మంది
- సాధికార సర్వే అనుసంధానతో అనర్హులు: 31,486 మంది



విజయనగరం, జనవరి 1 : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న 'అమ్మ ఒడి' పథకం చివరి అంకానికి చేరింది. అర్హులు, అనర్హులు, అభ్యంతరాల జాబితాలు సిద్ధమయ్యాయి. మరోసారి పరిశీలనకు సచివాలయాలకు చేరాయి. సాధికార సర్వే అనుసంధానంలో జరిగిన తప్పిదాలను నిరూపించే ధ్రువపత్రాలను రెండురోజుల్లోక్షేత్రస్థాయిలోని సచివాలయాలకు అందజేసి పథకం లబ్ధి పొందాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. తొలిజాబితా అర్హులు 3.1 లక్షల మంది..

ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'అమ్మ ఒడి' పథకం తొలి జాబితాలో జిల్లా నుంచి 3,17,294 మంది విద్యార్థులు, వారి తల్లులను అర్హులుగా ప్రకటించారు. జిల్లాలోని పథకం కోసం ఒకటి నుంచి 10వ తరగతి పాఠశాల, రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ విద్యార్థులు 3,70,565 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటి నుంచి క్షేత్రస్థాయి సచివాలయాలకు వెళ్లిన మూడు జాబితాలను పంపారు. అన్ని అర్హతలను నిర్ధారించుకొని అనుమతి పొందిన తల్లులు 3,17,294 మంది ఉన్నారు. మరోసారి విచారణ చేయాల్సిన జాబితాలో 21,886 మంది ఉండగా, సాధికార సర్వే అనుసంధానంతో సరిచేసిన కారణంగా అర్హతను కోల్పోయిన వారు 31,385 మంది విద్యార్థులు ఉన్నారు. సాధికార సర్వే అనుసంధానంతో అనర్హులుగా మిగిలిన సంఖ్యలో అధికులు జిల్లాలోని పట్టణ ప్రాంతీయులే ఉన్నారు. సాధికార సర్వే అనుసంధానంతో అనర్హులుగా చూపిన జాబితాలో అత్యధికంగా జిల్లాలోని విజయనగరం అర్బన్ ప్రాంతంలో 9,051 మంది ఉండగా అత్యల్పంగా నెల్లిమర్ల నగర పంచాయతీలో 287 మంది ఉన్నారు. రీ ఎంక్వైరీ జాబితాలో కూడా విజయనగరం అర్బన్లో అధికంగా 3,892 మంది ఉండగా అత్యల్పంగా నెల్లిమర్ల నగర పంచాయతీలో 134 మంది ఉన్నారు. ్రావిజయనగరం అర్బన్లో నమోదు చేసిన విద్యార్థుల తల్లులు 41,600 ఉండగా వారిలో 28,657 మంది మాత్రమే తొలి విడత అర్హులయ్యారు. అలాగే, జిల్లాలోని 34 మండలాల్లో అత్యధికంగా 13,478 మందిలో తొలి జాబితాల్లో 12,242 మంది అర్హులై పూసపాటిరేగ మండలం మొదటి స్థానంలో ఉంది. తరువాత వరుసలో ఎస్.కోట మండలం 11,245 మంది నమోదులో 9,578 మంది అర్హులయ్యారు.



కేజీహెచ్‌లో ఉచితంగా కీళ్ల మార్పిడి

- ఏడాదిలో 151 ఆపరేషన్ల నిర్వహణ
- శస్త్ర చికిత్సలకు రూ. 70 లక్షల నిధి

విశాఖపట్నం, జనవరి 1 : కేజీహెచ్‌లో ఉచితంగా కీళ్లమార్పిడి శస్త్ర చికి త్సలు నిర్వహిస్తున్నామని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుధాకర్ తెలిపారు. ఆర్థోపెడిక్ వార్డులోని సమావేశ మందిరంలో కీళ్ల మార్పిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున, రాష్ట్ర ప్రభుత్వ ఇల్నెస్ ఫండ్ను వినియోగించి ఈ ఏడాదిలో 151 కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహించామన్నారు. కీళ్ల మార్పిడి చేయించుకున్న రోగులు కేజీహెచ్లో ఉచితంగా ఈ శస్త్ర చికిత్సలు చేస్తున్నట్టు ప్రచారం చేయాలని కోరారు. వైద్య విద్యా సంచాలకుడు గత ఏడాది రూ.70 లక్షల నిధిని కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలకు కేటాయించారని చెప్పారు. ఆర్థోపెడిక్ విభాగం హెడ్ డాక్టర్ పి.అశోక్కుమార్ మాట్లాడుతూ ఉచిత కీళ్ల మార్పిడి చికిత్సకు రూ.2 కోట్ల నిధులను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సకు కార్పొరేట్ ఆస్పత్రులు రూ.5 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయన్నారు. అవగాహన సదస్సులో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఇందిరాదేవి, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్లు డాక్టర్ శివానంద, డాక్టర్ లోక్నాథ్, ఏఆర్ఎంవో డాక్టర్ సిహెచ్.సాధన, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులు పాల్గొన్నారు.

కెనడాలో ఘోర రైలు ప్రమాదం..13మంది మృతి



ఒట్టావా, జనవరి 1 : కెనడా దేశంలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రైలు పట్టాలు తప్పడంతో ఐదుగురు రైల్వే సిబ్బందితో పాటు 8 మంది ప్రయాణీకులు మరణించారు. అక్కడి కాలమానం ప్రకారం తెల్లవారుజామున 6.30 గంటల సమయంలో ఈ ఘోరప్రమాదం చోటుచేసుకుంది. కెనడా దేశంలోని మనీటోబా ప్రావిన్సులోని పోర్టిగాలా ప్రైరీ ప్రాంతంలో ఈ రైలు ప్రమాదం జరిగింది. ప్రమాద ఘటనలో ఇప్పటి దాకా 13మంది మరణించినట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. రైలు ప్రమాదం ఘటనపై కెనడా రవాణ భద్రతా బోర్డు దర్యాప్తునకు ఆదేశించింది.

విద్యుత్ రంగంలో 'కొత్త' వెలుగులు

- వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తాం
- చౌక విద్యుత్ కొనుగోలుకే అధిక ప్రాధాన్యం



అమరావతి, జనవరి 1 : 2020 మార్చి నాటికి వంద శాతం ఫీడర్లలో నాణ్యమైన విద్యుత్ ప్రభుత్వ ఆశయాల సాధనలో భాగంగా 2020 సంవత్సరంలో విద్యుత్ రంగంలో సరికొత్త వెలుగులు నింపుతామని ఇంధన శాఖ కార్యదర్శి శ్రీకాంత్ నాగులపల్లి చెప్పారు. ప్రజలు మెచ్చేలా, వారికి నచ్చేలా సేవలందిస్తామని అన్నారు. 'వినియోగదారులపై చార్జీల భారం మోపకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహ నరెడ్డి సంకల్పం. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కంలు) అత్యంత చౌకగా లభించే విద్యుత్ కొనుగోలుకే ప్రాధాన్యం ఇస్తాయి. ఈ దిశగా రూపొందించిన ప్రణాళికలు 2020లో మంచి ఫలితాలివ్వబోతున్నాయి. మార్కెట్లో చౌకగా లభించే విద్యుత్ తీసుకుంటూనే, థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో బొగ్గు నిల్వలు పెంచుతున్నాం. బహిరంగ మార్కెట్లో విద్యుత్ ధర పెరిగితే, థర్మల్ విద్యుత్ను ఉత్పత్తి చేస్తాం. తద్వారా డిస్కంలపై ఆర్థిక భారం పడే ప్రసక్తే ఉండదు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సాధ్యమైనంత వరకూ చెక్ పెట్టాలని నిర్ణయించాం. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశాం. ఇది 2020లో ఫలితాలు ఇవ్వనుంది

గ్రామస్థాయి నుంచి గ్రీవెన్స్ సెల్స్ పటిష్టం

పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని మరింత బలోపేతం చేస్తున్నాం. 2020 మార్చి నాటికి వంద శాతం ఫీడర్లలో నాణ్యమైన విద్యుత్ అందిస్తాం. వ్యవసాయ అవసరాల కోసమే 10,000 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

2020లో ఇది కార్యరూపం దాల్చే వీలుంది. విద్యుత్ శాఖలో అవినీతిని అరికడతాం. అవినీతికి దూరంగా ఉండాలని ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. 2020 జనవరి నుంచే గ్రామస్థాయి నుంచి గ్రీవెన్స్ సెల్స్ను పటిష్టం చేస్తాం. ప్రతి ఫి ర్యాదును నిశితం గా పరిశీలిస్తాం. అవినీతికి పాల్ప డిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రజల చెంతకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో భాగంగా ఉన్నతాధికారులు సైతం ప్రజల్లోకి వెళ్లి, వారి సమస్యలు తెలుసుకుంటారు. ప్రజలకు సేవలందించేందుకే విద్యుత్ సిబ్బంది సర్వసన్నద్ధంగా ఉన్నారనే విషయాన్ని 2020లో కార్యాచరణ ద్వారా నిరూపిస్తాం'' అని శ్రీకాంత్ నాగులపల్లి పేర్కొన్నారు.



చిక్కటి పాలతో ఊబకాయం రాదు

- కెనడా అధ్యయనంలో వెల్లడి

టోరంటో, జనవరి 1 : చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి చిక్కటి పాలకు మించినది మరేది లేదని మరోసారి రుజువైంది. ఈ మధ్య కాలంలో వెన్న, కొవ్వు తీసేసిన పాలు అమ్ముతూ, అదే ఆరోగ్యానికి మంచిదని, ఊబకాయం రాదని ఊదరగొడుతూ ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని కెనడాలో జరిగిన పరిశోధనల్లో వెల్లడైంది. కొవ్వు తీసేసిన పాలు తాగిన వారి కంటే హోల్ మిల్క్ తాగిన పిల్లల్లో ఊబకాయం ప్రమాదం 40 శాతం తక్కువగా ఉన్నట్టుగా తేలింది. కెనడాలో సెయింట్ మైకేల్ ఆస్పత్రి పరిశోధకులు మొత్తం 28 అధ్యయనాలను విశ్లేషించి నివేదిక రూపొందించారు. ఈ వివరాలను అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్లో ప్రచురించారు. కెనడా పరిశోధకులు విశ్లేషించిన 28 అధ్యయనాల్లో కూడా వెన్న తీసేసిన పాలు తాగినంత మాత్రాన ఊబకాయం, అధిక బరువు ప్రమాదం ఉండదని రుజువు కాలేదు. అంతేకాదు, వాటిలో 18 అధ్యయనాలు చిక్కటి పాలు తాగిన వారిలో ఊబకాయం ప్రమాదం తక్కువగా ఉందని తేలింది. రెండేళ్ల వయసు దాటాక తక్కువ కొవ్వున్న పాలు తాగితే పిల్లల్లో ఊబకాయం సమస్యలు ఉండవన్న అంతర్జాతీయ మార్గదర్శకాలను ఈ పరిశోధన సవాల్ చేసినట్టయింది.

ఇరాక్‌లో యూఎస్ ఎంబసీపై దాడి



బాగ్దాద్, జనవరి 1 : ఇరాన్ మద్దతున్న హిజ్బుల్ బ్రిగేడ్ తీవ్రవాద సంస్థ మద్దతుదారులు మంగళవారం ఇరాక్లోని బాగ్దాద్లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. కార్యాలయం ప్రధాన ద్వారాన్ని ధ్వంసం చేసి, రిసెప్షన్ ప్రాంతాన్ని తగలబెట్టారు. ఇరాన్ మద్దతున్న తీవ్రవాద సంస్థ హషెద్ అల్ షాబికి హిజ్బుల్ బ్రిగేడ్ సాయుధ విభాగం. దానికి ఇరాక్లో, సిరియాలో ఉన్న కీలక స్థావరాలపై అమెరికా ఆదివారం వైమానిక దాడులు జరిపిన విషయం తెలిసిందే.

సమరం కాదు.. శాంతి కావాలి: ట్రంప్



వాషింగ్టన్, జనవరి 1 : తాను శాంతి కాముకుడినని, తనకు యుద్ధం అంటే ఇష్టం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ అన్నారు. ఇర్వా ప్రతీకారం తీర్చుకోబోమని, యుద్ధం చేసే ఆలోచన లేదని తెలిపారు. ఇరాన్ మద్దతున్న హిజ్బుల్ బ్రిగేడ్ తీవ్రవాద సంస్థ మద్దతుదారులు ఇరాక్లోని బాగ్దాద్లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇరాన్లోని పరిస్థితిని చాలా బాగా చక్కదిద్దామని చెప్పారు.

ఇరాన్‌తో యుద్ధం చేసే ఆలోచన ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. 'యుద్ధం చేయాలన్న ఆలోచన ఇరానుకు మంచిదని నేను అనుకోవడం లేదు. నేను శాంతి కోరుకుంటున్నాను. యుద్ధం రావాలని అనుకోవడం లేద'ని ట్రంప్ సమాధానం ఇచ్చారు. బాగ్దాద్లో తమ రాయబార కార్యాలయంపై దాడికి ఇరాన్దే పూర్తి బాధ్యత అని, దీనికి ఇరాన్ భారీగా మూల్యం చెల్లించుకుంటుందని అంతకుముందు ట్రంప్ హెచ్చరించారు. 'ఇది హెచ్చరిక కాదు, ఇది ముప్పు' అంటూ ట్వీట్ చేశారు. తమ కార్యాలయంపై దాడిని భద్రత బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని తెలిపారు.

తమ విజ్ఞప్తి మేరకు వెంటనే స్పందించిన ఇరాక్ ప్రధాని, అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. కాగా, దాడి జరిగిన వెంటనే బాగ్దాద్లోని అమెరికా రాయబార కార్యాలయానికి అదనపు బలగాలను తరలించినట్టు పెంటగాన్ ప్రకటించింది. మంగళవారం ఇరాక్ ప్రధాని ఆదిల్ అబ్దుల్ ఆల్-మహదితో ఫోన్ మాట్లాడినట్టు వెల్లడించింది.

ప్రైవేటు కార్లను నిషేధిస్తున్న తొలి సిటీ



న్యూయార్క్, జనవరి 1 : డీజిల్, పెట్రోల్తో సంబంధం లేకుండా ప్రపంచంలో ప్రైవేటు కార్లను పూర్తిగా నిషేధిస్తున్న తొలి నగరం బ్రిటన్లోని యార్క్ సిటీ. పబ్లిక్ రవాణా బస్సులు, దివ్యాంగులను తీసుకెళ్లే వాహనాలు మినహా మిగతా ప్రయాణికులను తీసుకెళ్లే ప్రైవేటు వాహనాలన్నింటిని నిషేధించాలని నగర మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ నిషేధం సిటీవాల్స్ వరకు, నగరం చుట్టూ నిర్మించిన గోడల పరిధి వరకు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. నగరం చుట్టూ రోమన్ కాలంలో నిర్మించిన గోడలు ఇప్పటికీ అక్కడ బలంగానే ఉన్నాయి.

పబ్లిక్ రవాణాను ప్రోత్సహించడంలో భాగంగా పెట్రోలు, డీజిల్ కార్లే కాకుండా ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లను కూడా నిషేధించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఏటా 70 లక్షల మంది పర్యాటకులు వచ్చే ఈ నగరంలో కాలుష్యం ఎక్కువగా ఉంది. కాలుష్యానికి కారణం పర్యాటకులంటూ స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ విమర్శలను పర్యాటకుల మీదకు నెట్టింది. నగరంలోని 12 ప్రాంతాల్లో కాలుష్య ప్రమాణాలు భారీగా పడిపోయిన నేపథ్యంలో 2030 నాటికల్లా నగరంలో కర్బన ఉద్గారాలను జీరోస్థాయికి తీసుకరావాలని నగర మున్సిపల్ కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకొంది. అందులో భాగంగా 2023 నాటికి నగరంలో సంపూర్ణ కార్ల నిషేధాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇదే నేపథ్యంలోనే 2021 సంవత్సరం నాటికి డీజిల్ కార్లను సంపూర్ణంగా నిషేధించాలని బ్రిటన్లోని బ్రిస్టల్ నగరం నిర్ణయం తీసుకుంది.




ఆస్ట్రేలియాలో అగ్నిప్రమాదం

- బీచ్‌లలో చిక్కుకున్నవేల మంది

సిడ్నీ, జనవరి 1 : ఆగ్నేయ ఆస్ట్రేలియాలో అడవులను అంటుకున్న మంటల తాకిడికి వేలాది మంది పర్యాటకులు, స్థానికులు సమీపంలోని బీచ్లకు పారిపోవాల్సి వచ్చింది. మల్లకూట పట్టణం సమీపంలోని బీచ్లకు దాదాపు 4 వేల మంది పారిపోయి వచ్చారు. అడవులను అంటుకున్న మంటలు వాపిస్తున్న నేపథ్యంలో చాలామంది నివాసితులు ఇళ్లను విడిచి బీచ్లకు పరుగులు తీశారు. ఇటు బీచ్లోని పర్యాటకులు అక్కడే చిక్కుకుపోవాల్సి వచ్చింది. ఆస్ట్రేలియాలో కొన్ని నెలలుగా అడవులు అగ్నికి ఆహుతవుతున్న విషయం తెలిసిందే. సోమవారం రాత్రి న్యూ సౌత్వేల్స్, విక్టోరియా రాష్ట్రాలకు మంటలు వ్యాపించడంతో అక్కడ ఏడుగురి జాడ కనిపించడం లేదు. అధిక జనాభా కలిగిన బాట్మన్స్ బే పట్టణానికీ మంటలు చేరాయి. 'కొన్ని ప్రాంతాల్లో మంటలు చాలా తీవ్రంగా ఉన్నాయి. పొగ దట్టంగా వ్యాపిస్తోంది. దీంతో విమానాల ద్వారా నిఘా, వాటర్ బాంబ్లను నిలిపేయాల్సి వచ్చింది'అని న్యూసౌత్ వేల్స్ గ్రామీణ అగ్నిమాపక యంత్రాంగం తెలిపింది. విక్టోరియా అత్యవసర నిర్వహణ విభాగం కమిషనర్ ఆండ్రూ క్రిస్ప్ మాట్లాడుతూ.. మల్లకూటపై అగ్ని ప్రమాద ప్రభావం పడిందని చెప్పారు. ఇక్కడున్న ప్రజలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చాలా రోజులుగా హెచ్చరిస్తూనే ఉన్నామన్నారు.

మాంద్యంలోనూ నిధుల వరద

- 9 నెలల్లో సాగునీటిపై రూ.17,285 కోట్ల ఖర్చు
- ప్రధాన ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా జాగ్రత్తలు
- రుణాల రూపేణా రూ.9,851 కోట్ల సేకరణ, ఖర్చు




హైదరాబాద్, జనవరి 1 : రాష్ట్రంలో ఆర్థిక మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉన్నా.. ప్రభుత్వం ప్రాధాన్యత రంగంగా తీసుకున్న నీటి పారుదలకు మాత్రం నిధుల కొరత రానివ్వడం లేదు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎత్తిపోతల పథకాలన్నింటినీ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసే లక్ష్యంగా ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు సమకూరుస్తూనే రుణాల రూపేణా సేకరించిన వాటినీ ఖర్చు చేస్తోంది. తొమ్మిది నెలల వ్యవధిలో ప్రాజెక్టులపై ప్రభుత్వం ఏకంగా రూ.17,285 కోట్ల నిధులు ఖర్చు చేయగా, మరో మూడు నెలల వ్యవధిలో ఐదారు వేల కోట్ల మేర వ్యయం చేయనుంది.

2019-20 ఆర్థిక ఏడాదిలో తొలి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిస్తూ వచ్చింది. ఎక్కడా నిధుల కొరత లేకుండా చూస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో 9 నెలల వ్యవధిలో రూ.8,586 కోట్ల మేర ఖర్చు చేసింది. ఇందులో రుణాల ద్వారా రూ.5,945 కోట్ల మేర ఖర్చు చేయగా, ప్రభుత్వ ఖజానా నుంచి రూ.2,641 కోట్లు ఖర్చు చేశారు. దీంతో మిడ్మానేరు వరకు గోదావరి నీటి ఎత్తిపోతల సాధ్యమైంది. మిడ్మానేరు దిగువన కొండపోచమ్మసాగర్ వరకు నీటిని తరలించే వ్యవస్థ ప్రస్తుతం సిద్ధంగా ఉంది. దీంతోపాటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సైతం రూ.2,021 కోట్లు మేర ఖర్చు చేశారు. ఇందులో మెజార్టీ నిధులు భూసేకరణ, సహాయ పునరావాస పనులకు వెచ్చించారు. సీతారామ ఎత్తిపోతల పథకం కింద ఈ ఏడాది జూన్ నాటికి గరిష్ట ఆయకట్టుకు నీరివ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి నాటికి తొలి పంప్హౌస్, మార్చి నాటికి రెండో పంప్హౌస్, మే చివరికి మూడో పంప్హౌస్ నిర్మాణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా నిర్ణయించారు. దీనికి సైతం రుణాల రూపేణా రూ.1,500 కోట్ల మేర ఖర్చు జరిగింది. వీటితో పాటే దేవాదులకు రూ.800 కోట్ల మేర, వరద కాల్వ ప్రాజెక్టుకు రూ.వెయ్యి కోట్ల మేర ఖర్చు చేశారు. చిన్న నీటి పారుదల రంగానికి సైతం పెండింగ్లో ఉన్న బిల్లుల చెల్లింపులకు రూ.873 కోట్లు ఖర్చు చేశారు? మొత్తంగా రాష్ట్రం తన బడ్జెట్ నుంచి రూ.7,434 కోట్లు ఖర్చు చేయగా, రుణాల ద్వారా రూ.9,851 కోట్లు ఖర్చు చేసింది. నెలకు రూ.1,920 కోట్లకు తగ్గకుండా 9 నెలల్లో 17,825 కోట్లు ఖర్చు చేసినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. అయినా ప్రాజెక్టుల పరిధిలో నిర్మాణ పనులు.. పూర్తయిన పనులకు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలు మరో రూ.10,000 కోట్ల మేర ఉండటం విశేషం. ఆర్థిక ఏడాది ముగిసే నాటికి మూడు నెలల వ్యవధిలో మరో రూ.5 వేల నుంచి రూ.6 వేల కోట్ల మేర ఖర్చు చేసే అవకాశం ఉందని నీటి పారుదల వర్గాలు చెబుతున్నాయి.

బీజేపీలో సరికొత్త లాబీయింగ్

- డిప్యూటీ సీఎం వద్దు..
- ఎమ్మెల్యేలతో సంతకాల సేకరణ
- సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ
- నేడు ప్రధాని మోదీతో చర్చించాక నిర్ణయం



బెంగళూరు: ఉప ముఖ్యమంత్రి పదవిని రద్దు చేయాలని బీజేపీలో సరికొత్త లాబీ ప్రారంభమైంది. ఉప ముఖ్యమంత్రి పదవి కోసం తాజాగా మంత్రి శ్రీరాములుతో పాటు నూతన ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళి కూడా పట్టుబడుతుండడంతో పార్టీ ఎమ్మెల్యేలు కొందరు వ్యూహాత్మకంగా సంతకాల సేకరణ చేపట్టినట్టు తెలుస్తోంది. యడియూరప్ప కేబినెట్లో ఇప్పటికే ముగ్గురు ఉప ముఖ్యమంత్రులు ఉన్నారు. డాక్టర్ సి.ఎన్.అశ్వర్థనారాయణ, లక్ష్మణ సవది, గోవింద కారజోళకు ఉప ముఖ్యమంత్రి పదవులు కట్టబెట్టారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఒకప్పటి కాంగ్రెస్ అసమ్మతి నేత, మాజీ మంత్రి రమేశ్ జార్కిహోళికి తప్పనిసరిగా ఉప ముఖ్యమంత్రి పదవి కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే నేపథ్యంలో వాల్మీకి కులానికి చెందిన మంత్రి శ్రీరాములు కూడా ఉప ముఖ్యమంత్రి పదవి కోసం భారీగా లాబీయింగ్ చేస్తున్నారు.

కేబినెట్లోకి మరో ఇద్దరు డీసీఎంలను తీసుకొంటే అది మరిన్ని అధికార కేంద్రాలకు దారితీస్తుందని పార్టీ ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉప ముఖ్యమంత్రి పదవులను రద్దు చేయాలని అంతకైతే ప్రభుత్వ ఏర్పాటులో సహకరించిన వారికి కీలక శాఖలు అప్పగించాలని కోరుతూ పార్టీ ఎమ్మెల్యేలు సంతకాల సేకరణ చేపట్టారు. ఇంతవరకు 30 మందికి పైగా బీజేపీ ఎమ్మెల్యేలు లేఖ పై సంతకాలు చేసినట్లు సమాచారం. త్వరలోనే ఈ లేఖను బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు అందజేయ నున్నారు. ఈ తాజా పరిణామాలు ఎటు దారితీస్తాయోనని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇప్పుడిప్పుడే చెంతన పడుతున్న యడ్డీ ప్రభుత్వా నికి అసమ్మతి చర్యలు ఎక్కడికి దారి తీస్తాయోనని గుసగుసలు వినిపిస్తున్నాయి. యడ్డీ ప్రభుత్వంలో ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే.

సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ!

ఉప ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం పట్టుబట్టుతుండడంతో ముఖ్యమంత్రి యడియూరప్ప పరిస్థితి ఇరకాటంలో పడింది. సంక్రాంతి అనంతరం విస్తరణ జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. శాసనసభ సమావేశాలకు ముందే మంత్రి పదవులు ఇవ్వాల్సిందేనని కొందరు ఎమ్మెల్యేలు నేరుగా ముఖ్యమంత్రి యడియూరప్పను డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. దీంతో ముఖ్యమంత్రి ఏం చేయాలో పాలుపోక అధిష్ఠానం పెద్దలకు మొర పెట్టుకున్నారు. డిసెంబరు 9న ఫలితాలు వెలువడి 15 నియోజకవర్గాలకుగాను 12 చోట్ల బీజేపీ అభ్యర్థులు జయకేతనం ఎగురవేసిన సంగతి తెలిసిందే. వీరిలో 11 మందికి మంత్రి పదవులు ఇస్తామని సీఎం ఇప్పటికే హామీ ఇచ్చారు. రోజులు గడుస్తున్నా మంత్రివర్గ విస్తరణ జాడ లేకపోవడంతో నూతన ఎమ్మెల్యేల్లో నిరాశ ఆవహించింది.

కాంగ్రెస్, జేడీఎస్ నేతల ముందు తాము తలెత్తుకుని తిరగాలంటే తమకు మంత్రి పదవులతో పాటు కీలక శాఖలు అప్పగించాలని నూతన ఎమ్మెల్యేలు ముక్తకంఠంతో కోరుతున్నారు. కొత్త ఎమ్మెల్యేలతో పాటు పాత వారిలో కొందరు సీనియర్లకు అవకాశం కల్పించాల్సి ఉన్నందున విస్తరణలో జాప్యం జరుగుతోంది. బెళగావికి చెందిన సీనియర్ నేత ఉమేశ్ కత్తి, మాజీ మంత్రి ఆర్.శంకర్ కూడా మంత్రి పదవుల కోసం పట్టుబడుతున్నారు. నూతన ఎమ్మెల్యేల ఒత్తిడి నేపథ్యంలో యడియూరప్ప తాజా పరిస్థితిని అధిష్ఠానం పెద్దలకు సమగ్రంగా వివరించినట్టు తెలుస్తోంది. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాలు బిజీగా ఉండడం వల్ల ఇంతవరకు మంత్రివర్గ విస్తరణ కసరత్తు సాధ్యం కాలేదు. నేడు ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నారు. ఆయనతో చర్చించిన పిమ్మట మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు చేయాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది.

ఇదేనా నూతన సంవత్సర కానుక..

- రైల్వే, ఎల్పీజీ సిలిండర్ ధరల పెంపుపై విపక్షాల ఫైర్

న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం కానుకగా మోదీ సర్కార్ రైల్వే టికెట్ ధరలు, ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి సామాన్యుడికి అందించిందని విమర్శలు గుప్పించింది కాంగ్రెస్. ఇప్పటికే ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నంగా ఉన్న పరిస్థితుల్లో ధరల పెంపు ఏంటని ప్రశ్నించారు కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుష్మితా దేవి. పేద ప్రజలకు ఈ పెంపు కచ్చితంగా భారంగా మారుతుందని అన్నారు. ఈ సమస్య ఎప్పుడు ముగుస్తుందని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో పాటు ధరల పెంపుపై మండి పడింది సీపీఐఎం. ప్రజల జీవితాలతో మోదీ సర్కార్ పరాచకాలాడుతోందని సీతారాం ఏచూరి మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం కొత్త ఏడాదిలో ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకుందని చెప్పిన సీతారాం ఏచూరి... ఇప్పటికే ఉద్యోగాల కల్పనలో విఫలమైందని, నిత్యావసర ధరలు పెరిగాయని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సంపాదన లేకుండా ఈ సర్కార్ చేసిందని దుయ్యబట్టారు. రైల్వే టికెట్ ధరల పెంపు మోదీ ప్రభుత్వం ఇచ్చిన న్యూఇయర్ గిఫ్ట్ అంటూ మరో ట్వీట్ చేశారు సీతారాం ఏచూరి.

ఇకపై అన్ని రైళ్లలో సీసీ కెమెరాలు..!

- రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్



న్యూఢిల్లీ: ప్రయాణికుల ప్రయాణం ఇకపై మరింత సురక్షితంగా, సుఖవంతం చేసే క్రమంలో భారతీయ రైల్వే సేవలను మరింత విస్తృత పరచనుంది. 2022 మార్చి కల్లా ప్రతి రైల్వే స్టేషన్లోనూ, రైలులోని ప్రతి బోగీలోనూ సీసీ కెమెరాలను అమరుస్తామని రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 530 రైల్వే స్టేషన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెల్వేబోర్డు చైర్మన్ వీకే యాదవ్ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్, రైళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే టెండర్లను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే స్టేషన్ల పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.500 కోట్ల నిర్భయ ఫండ్ నిధులు వచ్చాయన్నారు. 6,100 స్టేషన్లు, 58 వేలకు పైగా రైల్వే బోగీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు రైల్వేశాఖ రూ.2,000 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఫేసియల్ రికగ్నేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో నిందితులను గుర్తిస్తాం. ప్యాసింజర్ల ప్రైవసీకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కెమెరాలను కామన్ ఏరియాల్లో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రైళ్లను కూడా ఆన్‌టైమ్‌కు నడిచేలా చేయడానికి, ఆటోమేటిక్ చార్ట్ ప్రిపరేషన్ వంటి వాటి కోసం ఇస్రోతో కలిసి పనిచేస్తున్నట్లు వీకే యాదవ్ తెలిపారు.

రైల్వే బోర్డు చైర్మన్ పదవీకాలం పెంపు

రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్ పదవీ కాలం మరో ఏడాది పొడిగించారు. కేబినెట్ నియామకాల కమిటీ ఆయన పదవీకాలం పొడిగింపును ఆమోదించింది. తాజా నిర్ణయంతో 2020 జనవరి 1 నుంచి 2020 డిసెంబర్ 31 వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. 2019 జనవరి 1న వీకే యాదవ్ రైల్వే బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

దేశానికి చరిత్రాత్మక ఘట్టం

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ : చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)ను నియమించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందని, దీనిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నెరవేర్చారని, ఇది అత్యంత మహత్తరమైన, చరిత్రాత్మకమైన రోజు అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. బుధవారం ఆయన ఇచ్చిన ట్వీట్లలో త్రివిధ దళాలు సమష్టిగా పనిచేస్తాయని, భారత దేశాన్ని దృఢంగా కాపాడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సీడీఎస్ నియామకం నవ భారత ఆకాంక్షలను నెరవేర్చడానికి దోహదపడుతుందన్నారు. ''పీఎం నరేంద్ర మోదీ గారు మరొక దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చారు, భారత దేశానికి మొట్టమొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ వచ్చారు, ఇది భారత దేశానికి అత్యంత మహత్తరమైన, చరిత్రాత్మక రోజు. ప్రపంచంలో అత్యుత్తమ రక్షణ దళాల్లో ఒకటిగా ఉండాలన్న భారత దేశపు దృఢ నిశ్చయాన్ని ఈ నిర్ణయం మరింత బలోపేతం చేస్తుందన్న నమ్మకం నాకు ఉంది'' అని అమిత్ షా పేర్కొన్నారు. ''భారత దేశపు మొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ బిపిన్ రావత్‌ను అభినందిస్తున్నాను. ఆయన నాయకత్వంలో త్రివిధ దళాలు సమష్టిగా ఓ జట్టుగా పని చేస్తాయని, అన్ని వైపరీత్యాల నుంచి మన దేశాన్ని కాపాడటానికి ఏ అవకాశాన్నీ వదిలిపెట్టవని విశ్వసిస్తున్నాను'' అని మరొక ట్వీట్లో పేర్కొన్నారు. ''భారత సాయుధ దళాలలోని మూడు విభాగాల సిబ్బంది సంక్షేమం, మన సైన్యం ఆధునికీకరణ, నవభారతం పట్ల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ మరింత ముందుకు తీసుకెళ్తారు'' అని మూడో ట్వీట్లో అమిత్ షా పేర్కొన్నారు.

చీఫ్ ఆఫ్ డిఫెన్స్ పోస్టు ఓ గొప్ప సంస్కరణ

- ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్



న్యూఢిల్లీ: భారత దేశ భద్రత దృష్ట్యా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ పోస్టును సృష్టించడం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్‌గా బాధ్యతలు చేపట్టిన మేజర్ జనరల్ బిపిన్ రావత్‌కు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. రక్షణ వ్యవస్థలో ఇలాంటి సంస్కరణలు తీసుకురావడం ఎంతో గొప్ప విషయమని ప్రధాని మోదీ చెప్పారు. దేశ భద్రత పట్ల తమ ప్రభుత్వం ఎక్కడా రాజీపడదని స్పష్టం చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. భద్రత విషయంలో భారత్ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పిన ప్రధాని వాటన్నిటినీ విజయవంతంగా ఎదుర్కొనేందుకే ఇలాంటి కీలక పోస్టు ఒకటి ప్రభుత్వం సృష్టించాల్సి వచ్చిందని ట్వీట్ చేశారు. మిలటరీ వ్యవహారాల కోసం కొత్త శాఖను సృష్టించినట్లు గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీనిపేరును సైన్యకర్త విభాగ్‌గా ఖరారు చేసింది. దీనికి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అధిపతిగా వ్యవహరిస్తారని పేర్కొంది. ఇక దీని కింద రక్షణ శాఖ, రక్షణ ఉత్పత్తి, డిఫెన్స్ రీసెర్చ్ మరియు డెవలప్మెంట్, ఎక్స్ సర్వీస్ సంక్షేమ శాఖలు ఉంటాయని పేర్కొంది. ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో భారత్‌కు చీఫ్ ఆఫ్ డిఫెన్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పినట్లు గుర్తు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ ఆ మేరకు మాటను నిలబెట్టుకున్నామని మరో ట్వీట్ చేశారు. మొత్తం భారత మిలటరీ వ్యవస్థను ఆధునీకరిస్తామని చెప్పారు. 130 కోట్ల భారతీయుల కలలను ఆకాంక్షలను సాకారం చేస్తామని ప్రధాని చెప్పారు.

ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలి

కొత్త ఏడాది ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, నవీన భారతం, ప్రజా సాధికారతకు ఈ ఏడాది సంకేతం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. '2019 ఇండియాకు అద్భుతమైన సంవత్సరం. అసాధ్యాలను సుసాధ్యం చేశాం. దీనిని మీరంతా కూడా స్వాగతించారని ఆశిస్తున్నా' అని మోదీ ట్వీట్ చేశారు. 130 కోట్ల మంది పౌరుల సాధికారితకు జరుగుతున్న ప్రయత్నాలు 2020 లోనూ మంచి ఫలితాలిస్తాయని ఆశిస్తున్నట్టు మోదీ పేర్కొన్నారు. కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, సౌభాగ్యం నింపాలని, ఆరోగ్యవంతమైన జీవితంతో పాటు ప్రతి ఒక్కరి ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటున్నట్టు ప్రధాని తన ట్విట్టర్ సందేశంలో పేర్కొన్నారు.

విజయ్ మాల్యాకు కోర్టు షాక్

- ఆస్తుల విక్రయానికి బ్యాంకులకు కోర్టు గ్రీన్ సిగ్నల్
- వడ్డీతో సహా రాబట్టేందుకు బ్యాంకుల యత్నం



ముంబై: బ్యాంకులకు వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టి లండన్లో తలదాచుకున్న ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యాకు ప్రత్యేక కోర్టు గట్టి షాకిచ్చింది. విజయ్ మాల్యా ఆస్తులను విక్రయించడానికి బ్యాంకులకు అనుమతి ఇచ్చింది. రుణాలను ఇచ్చి నష్టపోయిన బ్యాంకులు, జప్తులో ఉన్న ఆయన ఆస్తులను అమ్మి తమ సొమ్మును రికవరీ చేసుకోవడానికి అనుమ తించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వర్గాలు వెల్లడించాయి. మనీ లాండరింగ్ కేసులను విచారించే ముంబైలోని ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండ రింగ్ యాక్ట్ న్యాయస్థానం ఈ విధంగా ఆదేశించింది. ఈ కేసుకు సంబం ధించిన బ్యాంకులు బాంబే హైకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా తమ తీర్పును జనవరి 18 వరకు వాయిదా వేసినట్లు కోర్టు స్పష్టం చేసింది.

వడ్డీతో సహా రాబట్టేందుకు..

కాగా, తమకు రావాల్సిన రూ.6203.35 కోట్ల మొత్తాన్ని 2013 నుంచి 11.5శాతం వడ్డీతో సహా రాబట్టేందుకు విజయ్ మాల్యా ఆస్తులను విక్రయించడానికి అనుమతించాల్సిందిగా బ్యాంకులు ఇప్పటికే కోర్టును కోరాయి. అయితే, జప్తు చేసిన మాల్యా ఆస్తులను ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం విక్రయించుకోవడానికి తమకేమీ అభ్యంతరం లేదని గత ఫిబ్రవరిలో సంబంధిత న్యాయస్థానానికి తెలిపింది. ఈ నేపథ్యంలో బ్యాంకుల అభ్యర్థనలను పరిగణలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయస్థానం.. తాజాగా ఈ మేరకు తీర్పు వెల్లడించింది.

పరారీలో ఉన్న నేరస్థుడిగా..

జప్తు చేసిన ఆస్తులు ముఖ్యంగా షేర్ల వంటి సెక్యూరిటీల రూపంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మాల్యా తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అమిత్ దేశాయ్ మాట్లాడుతూ.. యూబీహెచ్‌ఎల్ ఆస్తులకు సంబంధించి షేర్ల అటాచ్‌మెంట్ ఎత్తివేయాలని కోర్టు ఆదేశించినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల కాపీ వచ్చిన తర్వాత ఈ విషయంపై స్పష్టత వస్తుందని చెప్పారు. గత ఏడాది జనవరి 5న విజయ్ మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ప్రత్యేక న్యాయస్థానం ప్రకటించిన విషయం తెలిసిందే. మాల్యా ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవాలని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది.

సిమి, పీఎఫ్ఐలపై నిషేధం..?

- అమిత్ షాదే తుది నిర్ణయం
- యోగి డిమాండ్ పట్ల సానుకూలం..!
- కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్



న్యూఢిల్లీ: స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్ మెంట్ ఆఫ్ ఇండియా (సిమి), పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)లపై నిషేధం విధించే విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖదే తుది నిర్ణయమని కేంద్ర న్యాయ వ్యవహారాల శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఈ రెండు సంస్థలను నిషేధించాలని కోరుతూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి విజ్ఞప్తులు అందాయని, దీనిపై తమ ప్రభుత్వం సానుకూల నిర్ణయాన్ని తీసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. పౌరసత్వ సరవణ చట్టానికి వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో చోటు చేసుకున్న అల్లర్లు, హింసాత్మక పరిస్థితుల వెనుక సిమి, పీఎఫ్ఐ కార్యకర్తల ప్రమేయం ఉందని, స్థానికులను రెచ్చగొట్టి మరీ.. వారు ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేయించినట్లు ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ రెండింటిపైనా నిషేధం విధించాలని కోరుతూ రూపొందించిన ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర హోంశాఖకు పంపించింది. దీనిపై రవిశంకర్ ప్రసాద్ బుధవారం నాడు స్పందించారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా రాజధాని లక్నో సహా బులంద్ షహర్, బహ్రాయిచ్, ఘజియాబాద్, సంభాల్, మొరాదాబాద్, గోరఖ్ పూర్ వంటి జిల్లాల్లో చోటు చేసుకున్న హింసాత్మక పరిస్థితుల వెనుక సిమి, పీఎఫ్ఐల హస్తం ఉన్నట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సాక్ష్యాధారాలతో కూడిన ప్రతిపాదనలను పంపించిందని ఆయన అన్నారు. నిరసన ప్రదర్శనల ముసుగులో ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి కుట్ర పన్నిన వారిపై కఠిన చర్యలు తీసుకోక తప్పదని చెప్పారు. సిమిపై కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే నిషేధం ఉందని, దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోనూ అమలు చేయడానికి అవసరమైన చర్యలను తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర హోం మంత్రిత్వ శాఖపై ఉందని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే సిమి, పీఎఫ్ఐ వంటి సంస్థలను నిషేధిత జాబితాలో చేర్చాలని తాను కోరుకుంటున్నానని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. అల్లర్లను ప్రోత్సహించే ఏ సంస్థనైనా నిషేధం వేటు వేయాల్సిన ఉంటుందని అన్నారు.

జాతీయ గీతంతో న్యూ ఇయర్‌కు స్వాగతం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళలు చెలరేగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పరిస్థితుల్లో నిరసనకారులు న్యూఇయర్‌కు వినూత్నరీతిలో స్వాగతం పలికారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి యువత ఎక్కువగా పబ్‌లు, పార్టీలకు సమయం కేటాయిస్తారు.. కానీ అందుకు విరుద్ధంగా దేశ రాజధానిలో సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. తమ నిరసనల్లో భాగంగా ఢిల్లీలో పలు ప్రాంతాల్లో జాతీయ గీతం పాడుతూ.. కొత్త ఏడాదిని ఆహ్వానించారు. ఇప్పటికే ఢిల్లీలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయినప్పటికీ.. నిరసనకారులు చలిని ఏ మాత్రం లెక్కచేయకుండా రోడ్లపైకి చేరకున్నారు. వారిలో అధిక సంఖ్యలో మహిళలు ఉండటం గమనార్హం. కొందరు జాతీయ జెండాలు చేతపట్టుకుంటే.. మరి కొందరు సీఏఏకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఆజాదీ.. ఆజాదీ అంటూ నినాదాలు చేశారు. అలాగే నిరసనకారులు ఒకరికొక్కరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జాతీయ గీతం పాడటం పూర్తయిన తర్వాత.. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ముగించారు. ఈ సందర్భంగా పలువరు మహిళలు మాట్లాడుతూ.. సీఏఏ వల్ల తమ పిల్లలకు భవిష్యత్తు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మేము రాజకీయాలకు దూరం..

- ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తాం
- సీడీఎస్ బిపిన్ రావత్
- బుధవారం నాడు బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ: రాజకీయాలకు దూరంగా ఉంటూ దేశ భద్రత కోసమే పాటు పడుతామని ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను పాటించి అమలు చేస్తామని అన్నారు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ తొలి అధిపతి జనరల్ బిపిన్ రావత్. రాజకీయాలకు జనరల్ బిపిన్ రావత్ తలొగ్గుతున్నారన్న ఆరోపణలు రావడంపై ఆయన పై విధంగా స్పందించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆదేశాల మేరకే తాము పనిచేయాల్సి ఉంటుందని చెప్పిన బిపిన్ రావత్ ఇందులో రాజకీయాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. త్రివిధ దళాల సమగ్ర సేవలను వినియోగించుకుని ఒక జట్టుగా పనిచేస్తామని సీడీఎస్ బిపిన్ రావత్ చెప్పారు. దీనిపైనే ప్రధానంగా దృష్టి సారిస్తామని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టంపై జరుగుతున్న ఆందోళనలపై చోటుచేసుకున్న హింసపై మాట్లాడి విమర్శల పాలయ్యారు జనరల్ బిపిన్ రావత్. ఓ కార్యక్రమంలో మాట్లాడిన రావత్.. ప్రజలను తప్పుదోవలో నడిపించే వారు నాయకులు కారని, యూనివర్శిటీ, కాలేజీ విద్యార్థులను రెచ్చగొట్టి హింసకు ప్రేరేపిస్తున్నారనే వ్యాఖ్యలను చేశారు. జనరల్ బిపిన్ రావత్ వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ. ఇదిలా ఉంటే జనవరి 1న జనరల్ బిపిన్ రావత్ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అధిపతిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం త్రివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

నిర్భయ కేసులో కీలక పరిణామం

- నలుగురికి ఒకేసారి ఉరి

న్యూఢిల్లీ: నిర్భయ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నలుగురు దోషులను అధికారులు ఒకేసారి ఉరితీయనున్నారు. ఈ నేపథ్యంలో తీహార్ జైలులో నాలుగు ఉరికంబాలు, నాలుగు సొరంగాలను అధికారులు ఏర్పాటు చేశారు. పవన్, ముఖేష్ సింగ్, అక్షయ్ ఠాకూర్, వినయ్‌లకు ఒకేసారి ఉరిశిక్ష అమలు చేసే అవకాశం ఉంది. ఈ నెల 7న నలుగురు దోషుల డెత్ వారెంట్లపై ఢిల్లీ పటియాల హౌస్ కోర్టు తీర్పు వెల్లడించనుండగా.. ఆ వెంటనే వారికి ఉరి శిక్ష అమలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. కాగా మైనర్లు గీతా, సంజయ్ చోప్రా కిడ్నాప్ కేసులో దోషులైన బిల్లా-రంగాలను 1982లో ఒకేసారి ఉరి తీశారు. ఇక ఆ తరువాత ఈ నలుగురిని ఇలా ఒకేసారి ఉరి తీయబోతుండటం దేశ చరిత్రలోనే ఇదే తొలిసారి.

యూపీని వణికిస్తున్న చలి..

- 120 ఏళ్లలో అతి తక్కువ టెంపరేచర్

లక్నో: ఉత్తరప్రదేశ్‌ను చలి వణికిస్తోంది. 120 ఏళ్ల రికార్డ్‌ను బ్రేక్ చేస్తూ అతి తక్కువ టెంపరేచర్‌ను నమోదు చేసింది. కాన్పూర్‌లో టెంపరేచర్ సున్నా డిగ్రీని తాకినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. యూపీ రాజధాని లక్నో కూడా సున్నాకు చేరువగా.. 0.7 డిగ్రీలు నమోదైనట్లు చెప్పారు. అలాగే రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో టెంపరేచర్ 10 డిగ్రీలు దాటడం లేదు. అలాగే ఉత్తర భారతాన్ని చలి వణికిస్తోంది. ఢిల్లీలో 4.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది నిన్న, మొన్న నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతల కంటే మరీ తక్కువ. పొగమంచు కారణంగా ఢిల్లీ మీదుగా రాకపోకలు సాగించే 34 రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఇక ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని పలుచోట్ల ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయాయి. దీంతో ప్రజలు చలికి వణుకుతున్నారు. బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

'జిహాదీ'కి గల్ఫ్ నుంచి నిధులు

- కేరళ జిహాదీ గ్రూప్‌పై ఇంటలిజెన్స్ నివేదిక...
- టర్కీ, దుబాయ్‌ల నుంచి నిధులు

న్యూఢిల్లీ: కేరళ రాష్ట్రంలోని జిహాదీ గ్రూప్ సభ్యులకు టర్కీ, దుబాయ్ తదితర గల్ఫ్ దేశాల నుంచి నిధులు అందాయని కేంద్ర ఇంటలిజెన్స్ తేల్చిచెప్పింది. గల్ఫ్ దేశాల నుంచి కేరళ రాష్ట్రంలోని జిహాదీ గ్రూప్ సభ్యులకు అందిన నిధుల గురించి రహస్య నివేదికను సమర్పించాలని కేంద్ర హోంమంత్రిత్వశాఖ కేంద్ర ఇంటలిజెన్స్ అధికారులను ఆదేశించింది. గత కొన్ని నెలలుగా గల్ఫ్ దేశాల నుంచి జిహాదీలకు ఎవరెవరికి ఎంత మొత్తం నిధులు వచ్చాయో వారి పేర్లతో ఇంటలిజెన్స్ నివేదికను రూపొందించింది. జిహాది సంస్థకు చెందిన ఓ సభ్యుడు గత ఏడాది సెప్టెంబరు 9వ తేదీన దుబాయ్ సందర్శించి రూ.40 లక్షల విరాళాలు తీసుకున్నాడని వెల్లడైంది. గత ఏడాది అక్టోబరు 1వ తేదీన జిహాదీ సంస్థ సభ్యులు టర్కీ, ఖతార్ దేశాల నుంచి విరాళాలు పొందేందుకు హామీ పొందారని తేలింది. కేరళ రాష్ట్రానికి చెందిన పలువురు యువకులు గత కొంతకాలం క్రితం అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అయిన ఐఎస్ఐఎస్ లో చేరారు. పాకిస్థాన్ జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి నిధులు, ఆయుధాలు అందిస్తుందని వెల్లడైంది. పాకిస్థాన్ పంజాబ్ రాష్ట్రంలోని ఖలిస్థాన్ ఉగ్రవాద సంస్థలకు కూడా నిధులు అందజేస్తుందని ఇంటలిజెన్స్ వర్గాలు తన నివేదికలో కేంద్ర హోంమంత్రిత్వశాఖకు తెలిపారు.

అన్ని మతాలను గౌరవిద్దాం: మాయావతి

లక్నో: దేశ ప్రజలకు బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షురాలు మాయావతి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో శాంతి, సుస్థిరతలు పాదుకొనాలని అభిలషించారు. 'కొన్ని పార్టీలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాలు చేస్తున్నాయి. భారతదేశం లౌకిక దేశమని, దేశంలో శాంతి, భద్రతలు పాదుకొలపాలనే విషయాన్ని వారు విస్మరించరాదు' అని మాయావతి పేర్కొన్నారు. 2019లో ఎక్కువ భాగం 'విభజన' దిశగా సాగిందని, బీజేపీ, ఆ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాల మతతత్వ, సంకుచిత ఆలోచనా ధోరణే ఇందుకు కారణమని ఆమె అన్నారు. అన్ని మాతాలను మనం గౌరవించాలని, సర్వమత సామరస్యం పాటించాలని మాయావతి తన నూతన సంవత్సర సందేశంలో ప్రజలకు పిలుపునిచ్చారు.

ఠాక్రేపై పోస్ట్.. ఇంక్ చల్లిన మహిళ

ముంబై: మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రేను విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వ్యక్తిపై శివసేన మహిళా కార్యకర్త ఇంక్ చల్లిన ఘటన బీడ్ జిల్లాలో వెలుగుచూసింది. ఉద్ధవ్ ఠాక్రేను ఉద్దేశించి ఆ వ్యక్తి పనికిరాని, విధ్వంసకారుడు అనే పదాలను ఫేస్‌బుక్‌లో వాడారు. కాగా ఫేస్‌బుక్‌లో ఠాక్రేపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గత వారం ఓ ముంబై వ్యక్తిపై కొందరు శివసేన కార్యకర్తలు భౌతిక దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. శివసేన-ఎన్సీపీ-కాంగ్రెస్ కూటమి ప్రభుత్వ సారథిగా ఉద్ధవ్ ఠాక్రే నవంబర్ 28న మహారాష్ట్ర సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే.



వ్యాపారవేత్త కుటుంబం విషాదాంతం..



లక్నో, జనవరి 1: నూతన సంవత్సరం తొలి రోజే విషాదం చోటు చేసుకుంది. మధుర హైవేలో బుధవారం ఓ కారులో వ్యాపారవేత్త కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు విగతజీవులుగా పడిఉండటం గుర్తిం చారు. ఘటనా స్థలంలో పిస్టల్ లభించడంతో మృతులు తుపాకితో కాల్చు కుని మరణించినట్టు భావిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి తుపాకిని స్వా.దీనం చేసుకున్న పోలీసులు మ తులను నీరజ్ అగర్వాల్, నేహ అగర్వాల్, ధన్య అగర్వాల్‌లుగా గుర్తించారు. వ్యాపారవేత్త ఆయన భార్య, కుమార్తె ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలంలోనే తీవ్ర గాయాలతో బాధపడుతున్న శౌర్య అగర్వాల్ అనే బాలుడిని గుర్తించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తదుపరి దర్యాప్తును ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు.



కల్తీ కేకులు

అనంతపురం, జనవరి 1: నగరంలోని అరవిందనగర్‌లో ఓ బేకరీ నిర్వాహకుడు కల్తీ కేకులు విక్రయిస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలో తేలింది. మంగళవారం ఫుడ్ సేఫ్టీ, తూనికలు, కొలతల శాఖ అధికారులు నగరంలోని వివిధ బేకరీలపై ఆకస్మిక దాడులు చేశారు. అరవిందనగర్ మసీదు వెనుక ఓ షెడ్డులో ప్రసాద్ అనే వ్యాపారి కల్తీ కేకులు తయారు చేసి విక్రయిస్తున్నట్లు అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, తూనికలు, కొలతల శాఖ సీఐ మహ్మద్‌గౌస్‌కు సమాచారం వచ్చింది. కేకులకు వాడే మైదా పురుగులు పట్టి ఉండడంతో అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. కేకుల్లో కలర్లు అధికంగా కలపడంతో పాటు చాక్లెట్ ఫ్లేవర్ కోసం వాడే పౌడర్‌కు తయారీ తేదీ లేదు. ఇప్పటికే వేలాది కేకులు బేకరీలకు సరఫరా అయ్యాయి.

8 బేకరీలకు నోటీసులు

అనంతరం అధికారులు నగరంలోని ఎనిమిది బేకరీలు, హెళ్లపై దాడులు నిర్వహించారు. క్లాక్‌టవర్, సప్తగిరి తదితర ప్రాంతాల్లో ఉన్న బేకరీలకు నోటీసులు జారీ చేశారు. స్వగృహ స్వీట్స్, న్యూ బెంగళూరు బేకరీ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలనందజేశారు. కార్యక్రమంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా, వినియోగదారుల సంఘం నాయకులు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకల్లో కత్తులతో దాడి... ఒకరి మృతి



కర్నూలు, జనవరి 1: కర్నూలు జిల్లా మహానందిలో దారుణం చోటు చేసుకుంది. ఈశ్వర్ నగర్‌లో నూతన సంవత్సరం వేడుకల్లో కత్తులతో స్వైరవిహారం చేశారు. న్యూ ఇయర్ వేడుకల్లో రెండు గ్రూపులు కత్తులతో దాడులు చేసుకున్నాయి. ఈ దాడిలో ఉపేంద్ర అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాత కక్షలతో ఉపేంద్ర, రాజశేఖర్, నాగార్జునపై దుండగులు దాడికి పాల్ప డ్డారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిలాబాద్‌లో...

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకల్లో కత్తులతో దాడి కలకలం రేపింది. ఉట్నూర్ మండల కేంద్రంలోని బోయవాడలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న యువ కులపై కత్తులతో దాడిచేశారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కత్తుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆది లాబాద్ రిమ్స్‌కి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. వేడుకల్లో మాటామాటా పెరిగి కత్తులతో దాడి చేశారా...? లేక పాత గొడవలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

వేధింపులు తాళలేక భర్తను హతమార్చిన భార్య

హైదరాబాద్, జనవరి 1: ప్రతిరోజు తాగి వచ్చి హింసిస్తున్న భర్తను హత్య చేసింది ఓ భార్య. నిత్యం భర్త పెట్టే వేధింపులను భరించలేక హత్య చేసింది. భర్త గుండె పోటుతో మృతి చెందాడని నమ్మించాలనుకుంది. చివరికి పోస్టుమార్టం రిపోర్టులో హత్యేనని తేలింది. దీంతో తుకారంగేటు పోలీసులు మృతుడి భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీకి చెందిన బండారు రవికుమార్ (50)కు భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుం బం కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే నిత్యం మద్యం సేవించి రవికుమార్.. భార్య, పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తు న్నాడు. భార్యను వేధిస్తూ కొడుతున్నాడు.

ఈ క్రమంలో డిసెంబర్ 26న మద్యం సేవించి ఇంటికొచ్చిన రవికుమార్.. భార్య పద్మావతితో గొడవకు దిగిల ఆమెపై దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన పద్మావతి.. నైలాన్ తాడుతో భర్త గొంతుకు బిగించడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే తన భర్త గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబాన్ని, చుట్టుపక్కల వారిని నమ్మించింది పద్మావతి. కుమారుడికి అనుమానం వచ్చి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టులో రవికుమార్ గుండెపోటుతో కాదు.. గొంతు నులిమి చంపబడినట్లుగా వైద్యులు నిర్ధారించారు. దీంతో పోలీసులు మృతుడి భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా.. భర్త చిత్రహింసలు భరించలేకనే చంపినట్లు ఒప్పుకుంది. పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

టీపీఓపై దాడి.. స్పందించిన మంత్రి బొత్స!

- **వేణుగోపాల్‌నగర్‌లో ఉద్రిక్తత**
- **దాడిలో 30 మందికి పైగా పాల్గొన్నవైనం**
- **సెంట్రల్ పార్క్ స్థలం సర్వే ఘటనపై వివాదం**



అనంతపురం, జనవరి 1: నగరంలో ఆక్రమణ దారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రూ.వందల కోట్ల విలువైన నగరపాలక సంస్థ స్థలాలను ఆక్రమించుకోవడమే కాక, ప్రశ్నించిన వారిపై దాడికి తెగబడుతున్నారు. మంగళవారం అనంతపురం నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వినయ్ ప్రసాద్‌పై వేణుగోపాల్‌నగర్‌లో ఆక్రమణదారులు దాడికి పాల్పడ్డారు. దీంతో నగరంలో ఉద్రిక్తత నెలకొంది.

అసలేం జరిగిందంటే..

అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో 173/6, 175/2, 175/3, 153/1బీ, 154/2, 176/1, 176/5, 177/1, 174, 176, 171/సీ, 172/పీ తదితర సర్వే నంబర్లలో నగరపాలక సంస్థకు చెందిన ఆరు ఎకరాల స్థలం ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇందులో నుంచి 1.5 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. నగర పాలక సంస్థ పరిధిలో విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వైనంపై ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి తీసుకెళ్లారు. అదే సమయంలో సెంట్రల్ పార్క్ స్థలాలను ఎవరికీ ఇవ్వరాదని, వాటిని పరిరక్షించాలంటూ నగర పాలక సంస్థ అధికారులకు సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఈ క్రమంలో టీపీఓ వినయ్‌ప్రసాద్ సర్వే చేసేందుకు మంగళవారం వేణుగోపాలనగర్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఆక్రమణదారులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. తాము సర్వే చేసేందుకు వచ్చామని, పార్క్ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని వివరించినా.. వినకుండా 30 మందికి పైగా టీపీఓపై దాడి చేసి చితకబాదారు. గాయాలపాలైన టీపీఓ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స కోసం చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బోయ క ష్ణమూర్తి, బోయ నరసింహ, బోయ గిరిజమ్మపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భగ్గుమన్న ఉద్యోగ సంఘాలు

టీపీఓ వినయ్‌ప్రసాద్‌పై జరిగిన ఘటనపై నగర పాలక సంస్థ ఉద్యోగులతో పాటు పలు ఉద్యోగ సంఘాల భగ్గుమన్నాయి. మంగళవారం నగరపాలక సంస్థ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. అంతకు ముందు గేట్‌కు తాళం వేసి ధర్నా చేశారు. టీపీఓపై దాడిని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సంగం శ్రీనివాసులు, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు అతావుల్లా ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ ఆర్‌డీకి ఫిర్యాదు చేశారు.

స్పందించిన మంత్రి బొత్స

టీపీఓ వినయ్‌ప్రసాద్‌పై జరిగిన దాడిని పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఖండించారు. దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆక్రమణదారుల నుంచి నగరపాలక సంస్థ ఆస్తులను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు.

మాకెలాంటి సంబంధం లేదు

ఈ ఘటనపై తమకెలాంటి సంబంధం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అనంతపురం పార్లమెంట్ అధ్యక్షురాలు బోయ గిరిజమ్మ స్పష్టం చేశారు.

మంగళవారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేణు గోపాల్ నగర్‌లో చేపట్టిన ఓ కట్టడం విషయంగా స్థానికులు టీపీఓపై దాడి చేశారన్నారు.

చనిపోయి మరో 9 మందిని బతికించింది

- **రోడ్డు ప్రమాదంలో మరణించిన చరితారెడ్డి అవయవదానం**



హైదరాబాద్, జనవరి 1: అమెరికా రోడ్డు ప్రమాదంలో చనిపోయిన చరితారెడ్డి.. మరో 9 మందిని బతికించింది. కారు యాక్సిడెంట్‌లో బ్రెయిన్ డెడ్ అయిన ఆమె అవయవాలు చావు బతుకుల్లో ఉన్న మరో 9 మందికి ప్రాణం పోశాయి. చరితా రెడ్డి చనిపోయినా.. ఆ 9 మందికి బతుకునిచ్చిన తమ బిడ్డను చూసి గర్వపడుతోంది ఆమె ఫ్యామిలీ. వారిలో తమ బిడ్డ బతికే ఉందంటూ చరితా తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చరితారెడ్డి అవయవదానం

హైదరాబాద్‌కు చెందిన చరితారెడ్డి.. రెండ్రోజుల కిందట మిచిగాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఆమె ప్రయాణిస్తున్న కారును.. వెనక నుంచి మరో కారు వేగంగా ఢీకొట్టడంతో చరితారెడ్డి బ్రెయిన్ డెడ్‌కు గురైంది. ఆమెతో పాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానిక ముస్కేగాన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే చరితారెడ్డి బ్రెయిన్ డెడ్ అయి మ తి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు.

కొందరి జీవితాల్లో వెలుగు నింపిన చరితారెడ్డి


సోమవారం ఆమె కుటుంబ సభ్యుల పర్మిషన్‌తో చరితారెడ్డి అవయవాలను డాక్టర్లు దానం చేశారు. మంగళవారం స్థానిక గిఫ్ట్ లైఫ్ ఆస్పత్రిలో ఆమె అవయవదానం చేశారు. మొత్తం తొమ్మిది మందికి ఆమె అవయవాలు అమర్చి ప్రాణ దానం చేశారు. తాను చనిపోయి 9 మందిని బ్రతికించిన గొప్ప వనిత చరితారెడ్డి అంటూ అమెరికా సమాజం ఆమెను కీర్తిస్తోంది. అంత విషాధంలోనూ ఆమె ఫ్యామిలీ అంత గొప్ప నిర్ణయం తీసుకుని.. విషాధంగా ముగియాల్సిన మరికొందరి జీవితాల్లో వెలుగు నింపారని అక్కడి వైద్యులు వారి త్యాగాన్ని కొనియాడారు.

ఎమ్ఎస్ చదవడానికి అమెరికాకు

ప్రాథమిక విద్యాభ్యాసమంతా హైదరాబాద్ నేరేడ్ మెట్‌లో చదివినా చరితారెడ్డి.. గీతం కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేసింది. అనంతరం ఎమ్ ఎస్ చదవడానికి 2015 లో ఆమె అమెరికాకు వెళ్లింది. అక్కడ ఎమ్ ఎస్ పూర్తి చేసిన చరితారెడ్డి ఇండియాకి తిరిగి వచ్చింది. ఆ తర్వాత డెలాయిట్ కంపెనీలో ఉద్యోగం రావడంతో తిరిగి ఆమె అమెరికాకు వెళ్లింది. మూడేళ్లుగా ఆమె అక్కడే ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందింది.

అవ్వ చనిపోయిందని నమ్మించి వివాహితపై లైంగికదాడి

- **ముగ్గురిపై కేసు నమోదు**



చిత్తూరు, జనవరి 1: నిమ్మనపల్లె మండలంలో ఓ వివాహిత లైంగిక దాడికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.. ముష్టూరు పంచాయతీకి చెందిన ఓ వివాహిత ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పొలాల వద్ద పారక ఊసలు సేకరించేందుకు వెళ్లింది. రెడ్డివారిపల్లె పంచాయతీ, పిట్టావాండ్లపల్లె వడ్డిపల్లెకు చెందిన ఉప్పుతోళ్ల మహేష్ అతని స్నేహితులు విజయ్, శివ ద్విచక్ర వాహనాల్లో అక్కడికి వెళ్లారు.

మహేష్ ఆమెతో 'మీ అవ్వ చనిపోయింది.. నిన్ను తీసుకుని రమ్మన్నారు' అని నమ్మ బలికాడు. ఆ మహిళ బాధపడుతూ అతని మోటార్ సైకిల్ ఎక్కింది. మహేష్ బైక్‌ను ఓ కొండవైపు తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం బాధితురాలిని బోయకొండ ఆర్చి వద్ద వదలి పారిపోయారు. ఆమె సోమవారం ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు జరిగిన విషయం తెలిపింది. వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు నిమ్మనపల్లె ఎస్ఐ సహదేవి విచారణ జరిపి, నిందితుడు మహేష్, అతనికి సహకరించిన విజయ్, శివపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబుల కిక్కు దిగింది



- **తెలంగాణలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు**

హైదరాబాద్, జనవరి 1: న్యూ ఇయర్ సందర్భంగా మందు బాబులపై తెలంగాణ రాష్ట్ర పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. కొత్త సంవత్సర సంబురాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాష్ట్ర వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. పోలీసుల ఆంక్షలు పట్టించుకోని మందుబాబులు వాహనాలు నడుపుతూ అడ్డంగా బుక్కాయ్యారు. తెలంగాణలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి.

పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా 3148 కేసులు నమోదు చేశారు. 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల వారిపై 1030 కేసులు నమోదు అయ్యాయి. న్యూఇయర్ సందర్భంగా పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ.. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మందుబాబులు పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. అయితే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం మంగళవారం (డిసెంబర్ 31, 2019) ఒక్కరోజే న్యూఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.

స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో 3148 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిదితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన కమిషనరేట్లు, ముఖ్య కూడళ్లలో పోలీసులు స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా 951, రాచకొండ పరిధిలో 281, సైబరాబాద్ పరిదిలో 873 కేసులు నమోదైనట్లు తెలిపారు. నల్గొండలో 141, కరీంనగర్ లో 148, వరంగల్ లో 116, సిద్ధిపేటలో 99 కేసులు నమోదు చేశారు.

కాగా యుక్తవయస్సు ఉన్న వారిపైనే ఎక్కువ కేసులు నమోదు అయ్యాయి. వీరితో పాటు 60 సంవత్సరాల వయస్సు గల వారు కూడా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడటం పోలీసులకు ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత పోలీసులు కోర్టులో ప్రవేశపెడతారు. పట్టుబడ్డ వారిపై గతంలో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్నట్లైతే లైసెన్స్‌ను రద్దు చేయనున్నారు. వారందరినీ జైలుకు పంపించాలనే వాద నను పోలీసులు కోర్టులో వినిపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

'చిత్తూరు'లో ట్రాక్టర్ బోల్తా..

- **ముగ్గురి మృతి, పదుల్లో క్షతగాత్రులు**



చిత్తూరు, జనవరి 1: నూతన సంవత్సరం వేళ రాష్ట్రంలోని రహదారులపై రక్తపుటేరులు పారాయి. చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం కంపల్లెలో విషాదం చోటుచేసుకుంది. సిద్ధేశ్వరస్వామి కొండ వద్ద ట్రాక్టర్ బోల్తాపడింది. ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు దుర్మరణం చెందగా.. 10 మందికి పైగా గాయపడ్డారు. జిల్లాలోని మెదలపల్లి, బొడ్డుపల్లి గ్రామాలకు చెందిన 'ఓం శక్తి' మాల వేసుకున్న భక్తులు నూతన సంవత్సరం సందర్భంగా సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

అనంతరం ట్రాక్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ట్రాక్టర్‌లో ఎక్కువ మంది ఎక్కడంతో ఒక్కసారిగా బ్రేక్ ఫెయిలయింది. దీంతో కొండ వద్ద ట్రాక్టర్ బోల్తా పడగా.. ఒకరిపై మరొకరు కుప్పలుగా పడ్డారు. ఈ నేపథ్యంలో ఊపిరి ఆడక ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, 10 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి ఉన్నట్లు తెలిసింది.

సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న భక్తులు ట్రాక్టర్ బోల్తా పడటాన్ని గమనించి.. వెంటనే 108కి సమాచారం అందించారు. అలాగే సహాయక చర్యలు చేపట్టి గాయపడ్డవారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, గాయపడ్డ వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న బైకులు.. ఒకరు మృతి

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 1: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు వేగంగా వచ్చి ఒకటినొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. వివరాల్లోకెళ్తే.. జిల్లాలోని చర్లరూరల్ మండల పరిధిలోని సత్యనారాయణపురంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాలు నుజ్జుజ్జవగా, సోమరాజు అనే వ్యక్తి మరణించాడు. మిగితా వారికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయలైన వారికి ప్రథమ చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

న్యూఇయర్ వేడుకల్లో విషాదం

- **కేక్ కట్ చేసిన అనంతరం ఈతకు వెళ్లి ముగ్గురు మృతి**

నెల్లూరు, జనవరి 1: కొత్త సంవత్సరాన నెల్లూరు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. వాకాడు మండలం తూపిలిపాలెం సముద్రంలో ఈతకు వెళ్లి ముగ్గురు మృతి చెందారు. న్యూ ఇయర్ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం ముగ్గురు సరదాగా ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ఓ యువతి అలల తాకిడికి కొట్టుకుపోతుండగా.. మిగిలిన ఇద్దరూ ఆమెను కాపాడేందుకు సముద్రంలోనికి వెళ్లారు.

వీరి కేకలు విని చుట్టుపక్కల వారు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆ ముగ్గురు నీటిలో పూర్తిగా మునిగిపోయారు. మృతుల్లో ఇద్దరు యువతులు, యువకుడు ఉన్నాడు. మృతదేహాలను బయటకు తీసి నాయుడు పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతులు తిరుపతి జీవకోనకు చెందిన వారిగా గుర్తించారు.

మృతుల కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒకేసారి ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలులో ఘోర రోడ్డు ప్రమాదం

- **ఆస్పత్రిలో ఆర్తనాదాలు**

కర్నూలు, జనవరి 1: నూతన సంవత్సరం వేళ ఆంధ్రప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదాలు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. చిత్తూరు రోడ్డు ప్రమాదం కళ్ల ముందు మెదులుతుండగానే కర్నూలులో సైతం ఘోర విపత్తు చోటుచేసుకుంది. కర్నూలు నగరంలోని కృష్ణానగర్‌లో ఓ లారీ బీభత్సం సృష్టించింది. స్థానిక ఐటీసీ కంపెనీ కూడలి వద్ద మద్యం సేవించిన లారీ డ్రైవర్ వేగంగా వచ్చి కారును ఢీకొట్టాడు. తర్వాత ఆటోను, రెండు బైక్‌లను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే ఒకరు దుర్మరణం చెందగా, కనీసం 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. దీంతో క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగం గంభీరంగా మారిపోయింది. బాధితుల కుటుంబ సభ్యులు కూడా ఆస్పత్రికి చేరుకుంటున్నారు.

ప్రమాదం జరిగిన తీరు చాలా భయానకంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈ ప్రదేశంలో ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి. ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్ కట్టాలని ఎప్పటి నుంచో ప్రజలు డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదు. అలాగే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహణ కూడా ఇక్కడ దారుణంగా ఉన్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఈ రోడ్డు నిర్వహణ అత్యంత నాసిరకంగా ఉందని, రోడ్లన్నీ గుంతలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే సిగ్నల్స్ కూడా సరిగా లేవన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా


కర్నూలు, జనవరి 1: ఇసుక, మద్యం అక్రమ రవాణాను నిరోధించడానికి పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాటి వద్ద సీసీ కెమెరాలు కూడా అమర్చుతున్నారు. అక్కడ గార్డులుగా విధులు నిర్వర్తించేందుకు మాజీ సైనికులు (మిలటరీ, పారామిలటరీ) 60 మందిని ఎంపిక చేశారు. వీరికి నెలసరి వేతనం రూ.15 వేల చొప్పున చెల్లించనున్నారు. 60 గార్డుల పోస్టుల భర్తీకి మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు అహ్వానించగా మొత్తం 108 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిని మంగళవారం పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియానికి పిలిపించారు. ధ్రువ పత్రాలు పరిశీలించిన తర్వాత లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు.

ఇవీ చెక్‌పోస్టులు..

మాధవరం (మాధవరం పోలీసుస్టేషన్ పరిధి), క్షేత్రగుడి (హాలహర్వి పీఎస్), బాపురం (కౌతాళం పీఎస్), పంచలింగాల, ఈ తాండ్రపాడు, మునగాలపాడు, దేవమడ (కర్నూలు తాలూకా పీఎస్), సుంకేసుల (గూడూరు పీఎస్), మార్లమడికి (ళగుంద పీఎస్), పెద్దహరివనం (ఇస్వీ పీఎస్).

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలని మాజీ సైనిక ఉద్యోగులకు ఎస్పీ ఫక్కీరప్ప సూచించారు. ప్రస్తుతం ఎంపిక కాని 48 మందిని కూడా చిత్తూరు, అనంతపురం జిల్లాలకు పంపించి అక్కడ సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. భవిష్యత్తులో వేతనాలు పెరుగుతాయని, వారానికి రెండు రోజుల ఆఫ్‌లు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రమణమూర్తి, సీఐ లక్ష్మయ్య, ఎస్ఐ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

తుమ్మినా..దగ్గినా..



యాంటీబయోటిక్స్ రాస్తున్న డాక్టర్లు

నాలుగేళ్లలోపు పిల్లలపైనా ప్రిస్క్రిప్షన్ ప్రయోగం

హైదరాబాద్, జనవరి 1 (మనం న్యూస్) : తుమ్మినా, దగ్గినా యాంటీబయోటిక్స్ మందులు రాయడం చాలామంది డాక్టర్లకు పరిపాటైంది. 'ప్లస్ వన్'అనే మెడికల్ జర్నల్ ఇటీవల జరిపిన అధ్యయనం ప్రకారం.. దేశంలో నాలుగేళ్లలోపు పిల్లల్లో ప్రతి వెయ్యిలో 636 మందికి యాంటీబయోటిక్స్ రాస్తున్నారని తేలింది. 10-19 ఏళ్ల వయసు వారికి అతి తక్కువగా వెయ్యిలో 280 మందికి ప్రిస్క్రిప్షన్లు రాస్తున్నారు. మొత్తంగా దేశంలో యాంటీబయోటిక్ దుర్వినియోగం అధికంగా ఉందని తేల్చింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. యాంటీబయోటిక్ ప్రిస్క్రిప్షన్లలో 33.2 శాతం శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు రాయడం గమనార్హం. భారతదేశంలో రిటైల్ రంగంలో తలసరి యాంటీబయోటిక్ వినియోగం 22 శాతం పెరిగిందని అధ్యయనంలో తేలింది.భారతదేశంలో అధిక యాంటీబయోటిక్ వాడకానికి ప్రధాన కారణం అంటు వ్యాధులు ఎక్కువగా ప్రబలడమేనని తెలిపింది. వివిధ కారణాలతో చనిపోయే ఐదేళ్లలోపు పిల్లల్లో 50 శాతం మంది న్యుమోనియా, విరేచనాలు వంటి అంటువ్యాధుల కారణంగానే చనిపోతున్నారని తేల్చింది. అయితే ఈ యాంటీ బయాటిక్స్ కేవలం తీవ్రమైన అంటువ్యాధుల చికిత్సకు ఉద్దేశించినవి కావని తేలింది. యాంటీ బయాటిక్స్ మందుల దుర్వినియోగం ప్రధానంగా చిన్న పట్టణాలు, గ్రామాల్లోని ఆసుపత్రులు, క్లినిక్లలో అధికంగా జరుగుతోందని అధ్యయనం తెలిపింది. పెద్ద నగరాల్లోని ఆసుపత్రుల్లో అంతగా ఉండట్లేదని పేర్కొంది. కాబట్టి కిందిస్థాయిలో నిఘా అవసరమని తేల్చింది.

ఇతర దేశాల కంటే తక్కువే అయినా..

వివిధ యూరోపియన్ దేశాల కంటే తక్కువగానే మన దేశంలో యాంటీబయోటిక్ ప్రిస్క్రిప్షన్లు రాస్తున్నారని అధ్యయనం తెలిపింది. భారత్లో యాంటీబయోటిక్ ప్రిస్క్రిప్షన్ రేటు వెయ్యి మందికి 412 ప్రిస్క్రిప్షన్లుగా ఉంది. ఇటలీలో యాంటీబయోటిక్ ప్రిస్క్రిప్షన్ రేటు వెయ్యి మందికి 957 ప్రిస్క్రిప్షన్లు, జర్మనీలో 561 ప్రిస్క్రిప్షన్లు, యూకేలో 555 ప్రిస్క్రిప్షన్లు, డెన్మార్క్లో 481 ప్రిస్క్రిప్షన్లుగా ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే కొన్ని యాంటీబయోటిక్ ప్రిస్క్రిప్షన్ల రేటు మన దేశంలో ఎక్కువ ఉందని తెలిపింది.

యాంటీబయాటిక్స్ అనుచిత వాడకానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి, మన కేంద్రం పలు చర్యలు చేపట్టింది. యాంటీబయోటిక్స్ డిమాండ్ తగ్గించడానికి, సార్వత్రిక రోగనిరోధకత కోసం కొత్త టీకాలు ప్రవేశపెట్టింది. కానీ లక్ష్యాలను సాధించే విషయంలో పురోగతి అంతగా లేదని అధ్యయనం తెలిపింది.



పని చేయని స్థితికి..

1928లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ పెన్సిలిన్ కనుగొన్న తర్వాత క్రమంగా యాంటీబయోటిక్స్ అభివృద్ధి పెరిగింది. రకరకాల బాక్టీరియాను మట్టుబెట్టడం సులువైంది. ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవడం సులభతరమైంది. కానీ మన అలవాట్లు, నిర్లక్ష్యం వల్ల ఈ యాంటీబయోటిక్స్కు బాక్టీరియా తలొగ్గే పరిస్థితి లేకుండా పోతుంది. ఆయా మందులకు లొంగట్లేదు. దీంతో ప్రపంచవ్యాప్తంగా యాంటీబయోటిక్ రెసిస్టెన్స్ ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. న్యుమోనియా, టీబీ, రక్తంలో ఇన్ఫెక్షన్లు, గనేరియా లాంటి వ్యాధుల విషయంలో చికిత్స అనేది సవాలుగా మారింది. శక్తిమంతమైన యాంటీబయోటిక్ మందులు కూడా పనిచేయడం మానేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అతి సాధారణ ఇన్ఫెక్షన్లు సైతం ప్రాణాంతకంగా మారే ప్రమాదం పొంచి ఉంది. మొదటి దశ యాంటీబయోటిక్స్ చికిత్స వల్ల ఫలితం లేనప్పుడు మరింత ఖర్చుతో కూడుకున్న సమర్థమైన యాంటీబయోటిక్స్ వాడాల్సి ఉంటుంది. యాంటీబయోటిక్స్ పనిచేయకపోవడం వల్ల చికిత్సా కాలం పెరుగుతుంది. అనారోగ్య బాధ పెరుగుతుంది. ఆసుపత్రుల్లో ఉండే కాలం పెరుగుతుంది. వైద్యం ఖర్చు పెరిగి కుటుంబాలు, సమాజాలపై ఆర్థిక భారం పెరుగుతుంది. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు ఇప్పుడు పెద్ద సవాలుగా నిలిచిన సమస్య యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ అని నిపుణులు అంటున్నారు.



ఎన్నెన్నో అనుకుంటాం..

- న్యూ ఇయర్లో తీసుకునే నిర్ణయాలు ఎలా ఉంటాయంటే..

హైదరాబాద్, జనవరి 1 (మనం న్యూస్) : కొత్త సంవత్సరం వస్తుందంటే చాలు ఓ నెల ముందునుంచే తెగ హైరానా పడిపోతుంటాం. ఈ సంవత్సరం నుంచి ఇవి మానేయాలి, అవి నేర్చుకోవాలి, కొన్ని అలవాటు చేసుకోవాలి, మరికొన్ని మానుకోవాలి.. ఇలా బోలెడు లిస్టు రెడీగా ఉంటుంది. కానీ సూర్యుడు పడమరన ఉదయించడం, చంద్రుడు పట్టపగలు కనిపించడం ఎంత అసాధ్యమో మనం రాసుకున్న లిస్టు ఫాలో అవడం కూడా జరగని పని అని చాలామంది ముందే డిసైడ్ అయిపోతారు.

ఆ లిస్టులో మీరు కూడా ఉండే ఉంటారు. కొంతమంది మాత్రం పూర్తిగా కాకపోయినా అనుకున్నదాంట్లో ఒక్కటి పూర్తి చేసినా చాలు ఆస్కార్ గెలిచినంత సంబరపడిపోతారు. మరికొందరు ఏదో మొక్కుబడిగా కొత్త సంవత్సరం తొలినాడు మాత్రమే ఆచరించి తర్వాత మమ అని వదిలేస్తారు. కొందరు అపసోపాలు పడీ ఆచరిస్తారు. కానీ ఏడాది మొత్తం ముందు అనుకున్న మాటపై నిలబడేవారు చాలా తక్కువ మందే ఉంటారు. ఇంతకీ అసలు కొత్త సంవత్సరం అనగానే మనకొచ్చే కొత్త ఆలోచనలు, కొత్త నిర్ణయాలేంటో చూద్దాం..

- మద్యపానం, ధూమపానం, మాంసాహారం మానేయడం
- క్రమశిక్షణ, సమయపాలన పాటించడం
- డైరీ రాయడం
- పెళ్లి చేసుకోవడం
- ఇల్లు కట్టుకోవడం
- ఉద్యోగం సంపాదించడం
- ఏదైనా టూర్కి వెళ్లడం
- ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవడం
- సెల్ఫోన్లో గడిపే సమయాన్ని తగ్గించడం
- వాహనాలు కొనుగోలు చేయడం
- బంగారం, ప్లాట్లు కొనుగోలు చేయడం
- పిల్లల భవిష్యత్తుపై ప్రణాళిక వేసుకోవడం
- డబ్బు పొదుపు చేయడం
- సెల్ఫీలు, టిక్టాక్లు, పబ్జీలకు దూరంగా ఉండాలనుకోవడం
- ఆలయాలు సందర్శించటం
- వ్యాయామం చేయడం
- కొత్త వ్యాపకాలు పెంచుకోవడం..

ఇలా ఎన్నో అనుకుంటూ ఉంటారు. సో, మీరు ఊహల్లోనే గడిపేయకుండా నిజజీవితంలోనూ వాటిని సాధించేందుకు ప్రయత్నం చేయండి. కొన్నింటినైనా జయించండి.



దొంగ దెబ్బతీయడం తెలియదు

- మంత్రి ఈటల ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి1 (మనం న్యూస్): తాజా రాజకీయ పరిణామాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గం పరిధిలో టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి మంత్రి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. పార్టీలో తనకు వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలపై ఆవేదన వ్యక్తం చేశారు. తనకు కొట్లాడటం తెలుసు కానీ.. దొంగ దెబ్బతీయడం తెలియదని వ్యాఖ్యానించారు. కోట్లు ఖర్చయినా తాను ఎవరి దగ్గర చేయి చాచలేదన్నారు. నమ్మినవారే మోసం చేస్తే బాధ కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ధర్మం తప్పరని, అందువల్లే తాను గత ఎన్నికల్లో గెలిచానన్నారు. ప్రజలు కూడా ధర్మం తప్పిఉంటే తాను గెలిచేవాడిని కాదని పేర్కొన్నారు. నమ్మకద్రోహం చేసేవారు ఎవరుకూడా బాగుపడరని ఈటెల వ్యాఖ్యానించారు. కాగా, హుజూరాబాద్ నియోజకవర్గం టీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న వర్గపోరు నేపథ్యంలోనే మంత్రి ఈటల రాజేందర్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలోని ఓ వర్గం ఈటల రాజేందర్ ఓటమి కోసం పనిచేసిందనే ప్రచారం నియోజకవర్గం పరిధిలో జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే కొంత మంది పార్టీలో ఉండి వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని, తన ఓటమి కోసం పనిచేస్తున్నారని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా, గతంలో గులాబీ ఓనర్లం తామే అంటూ ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు టీఆర్ఎస్ పార్టీలోనే కాక.. తెలంగాణ రాజకీయాల్లోనూ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే.

టీఆర్ఎస్ నిర్ణయం సంతోషకరం




- సీపీఐ నేత నారాయణ

హైదరాబాద్, జనవరి 1 (మనం న్యూస్): పార్లమెంట్లో ఎన్నార్సీకి వ్యతిరేకంగా టీఆర్ఎస్ పార్టీ ఓటేయడం సంతోషకరం అని సీపీఐ నేత నారాయణ అన్నారు. బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. కేంద్రం వైఖరికి నిరసనగా ఈనెల 8వ తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమ్మెకు కేసీఆర్ మద్దతు ఇచ్చి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. తెలంగాణలో ఇంకా ఆత్మబలిదానాలు జరగడం బాధాకరం అని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి, యాగాల ముసుగులో కేసీఆర్ చేసిన పాపాల విముక్తి కోసం ప్రయత్నిస్తున్నారని నారాయణ వ్యాఖ్యానించారు.

పల్లెల్లో ఎల్ఈడీ వెలుగులు!

ఈఈఎస్ఎల్ సంస్థతో పంచాయతీరాజ్ శాఖ ఒప్పందం

ఏడేళ్లపాటు వీధి దీపాల నిర్వహణ ఆ సంస్థదే



హైదరాబాద్, జనవరి 1 (మనం న్యూస్) : కరెంటు బిల్లుల భారం తగ్గించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇప్పటికే పట్టణాల్లో ఎల్ఈడీ లైట్లను ప్రవేశపెట్టిన ప్రభుత్వం..పల్లెల్లోనూ ఈ దీపాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మామూలు వీధి దీపాలను వినియోగిస్తున్న గ్రామ పంచాయతీలు.. ఇకపై తక్కువ విద్యుత్, ఎక్కువ కాంతులు వెదజల్లే ఎల్ఈడీ లైట్లతో వెలిగిపోనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ఆదాలో మంచి గుర్తింపు ఉన్న ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈ ఎస్ఎల్)తో ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 12,753 గ్రామ పంచాయతీల్లో ఏడేళ్లపాటు వీధి దీపాల సరఫరా, ఏర్పాటు, నిర్వహణ వ్యవహారాలను ఈ సంస్థ చూడనుంది. ఈఈఎస్ఎల్తో త్రైపాక్షిక ఒప్పందం చేసుకోవాలని భావించిన పంచాయతీరాజ్శాఖ.. ఈ అగ్రిమెంట్లో జిల్లా పంచాయ తీ అధికారి, గ్రామ పంచాయతీ, ఈఈఎస్ఎల్లకు భాగస్వామ్యం కల్పిస్తోంది.


నిధుల్లేకుంటే డీపీవోల ద్వారా సర్దుబాటు

గ్రామాల్లో ఉపయోగిస్తున్న వీధి దీపాలతో కరెంట్ బిల్లులు భారీగా రావడమేగాకుండా.. నిర్వహణ కూడా కష్టసాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో విద్యుత్ పొదుపు, నిర్వహణ వ్యయం తగ్గేలా దీపాల వ్యవస్థను అమలు చేస్తామని ఈఈఎస్ఎల్ సంస్థ ముందుకు రావడంతో పంచాయతీ రాజ్శాఖ అటువైపు మొగ్గు చూపింది. ఒప్పందకాలంలో ఎల్ఈడీ లైట్ల నిర్వహణ బాధ్యత పూర్తిగా సంస్థదే. దీపాల బిగింపు, నిర్వహణ, ఇంధన పొదుపు సాంకేతికతలో భాగంగా టైమర్ల ఏర్పాటు వ్యవస్థను కూడా సంస్థనే చూసుకోవాల్సి ఉంటోంది. నెలవారీ విద్యుత్ బిల్లులను స్థానిక పంచాయతీ చెల్లించాల్సి ఉంటుంది.

ఒకవేళ నిధుల కటకటతో చెల్లించలేని పరిస్థితుల్లో జీపీ ఉంటే జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) బిల్లులను సర్దుబాటు చేయాలని పీఆర్ శాఖ నిర్దేశించింది. టెండర్లతో సంబంధం లేకుండా.. సంస్థతో అగ్రి మెంటు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈఈ ఎస్ఎల్ సంస్థ పనితీరును మదింపు చేయాలని జీపీలను ఆదేశించింది. నేషనల్ లైట్స్ కోడ్ ప్రమాణాలకు అనుగుణంగా దీపాలను ఏర్పాటు చేశారా? లేదా పరిశీలించాలని నిర్దేశించింది. ఇదిలావుండగా, రాష్ట్రవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ పరిశీలనకు పంచాయతీరాజ్ కమిషనరేట్లో కమాండ్ సెంటర్ను ఏర్పాటు చేయనుంది. త్రైపాక్షిక ఒప్పంద పత్రాల నమూనాను జిల్లా కలెక్టర్లకు పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.రఘునందన్రావు పంపారు.

పద్దెనిమిదేళ్లు పైబడిన నిరక్షరాస్యుల జాబితాను సిద్ధం చేయండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్కుమార్
- జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్



హైదరాబాద్, జనవరి 1 (మనం న్యూస్): తెలంగాణలో గురువారం నుంచి ప్రారంభమవుతున్న పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యుల జాబితాను ఈనెల 10వ తేదీ లోగా నమోదు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వయోజనుల అక్షరాస్యతను పెంచేందుకు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచేందుకు అన్ని గ్రామ పంచాయితీలలో 'ఈచ్ వన్ టీచ్ వన్' చేపట్టాలని నిర్ణయించారని అన్నారు. రెండో విడత పల్లె ప్రగతి సందర్భగా ప్రతి గ్రామ పంచాయితీలలో చదవడం రాయడం రాని వారి వివరాలను సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రామానికి సంబంధించిన ఈ జాబితాలో 18 సంవత్సరాలు పైబడి నిరక్షరాస్యుల అందరి వివరాలు ఉండాలని, 10వ తేదీ వరకు వేచిచూడకుండా ఏరోజుకారోజు అప్డేట్ చేయాలని ఆదేశించారు. నిరక్షరాస్యుల వివరాలు సేకరించడానికి సంబంధిత ప్రొఫార్మాను జిల్లా కలెక్టర్లకు పంపించామని తెలిపారు. ఈకార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు విజయవంతం చేయాలని సోమేశ్కుమార్ కోరారు. ఈ సమావేశంలో పంచాయితీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్రాజ్, సెన్సెస్ డైరెక్టర్ ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి కొత్తరూపు

ప్రయాణికుల ఆదరణ కోసం ప్రయత్నాలు

మహిళా కండక్టర్లకు కొత్త యూనిఫాం



హైదరాబాద్, జనవరి 1 (మనం న్యూస్): ఆర్టీసీకి కొత్త రూపు ఇస్తున్న ప్రభుత్వం, సిబ్బంది వ్యవహారశైలిపై కూడా దృష్టి సారించింది. 2020 కొత్త సంవత్సరం ఆరంభం నుంచే సిబ్బంది ప్రయాణికులను చిరునవ్వుతో పలకరిస్తూ, వారిపట్ల మర్యాదగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో వారికి శిక్షణ తరహాలో సూచనలు కూడా అందజేయాలని నిర్ణయించారు.

సీఎం ఆదేశం మేరకు మహిళా కండక్టర్లకు కొత్త యూనిఫామ్ ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో.. తాజాగా మరో నిర్ణయం తీసుకున్నారు. మహిళా సిబ్బంది ధరించే మెరూన్ రంగు అప్రాన్ జేబుపై పెద్ద సైజులో స్మైలీ ఎమోజీ ముద్రించాలని నిర్ణయించారు. ఆ అప్రాన్ జేబుపై చిరునవ్వు చిందించే ఎమోజీలు సాక్షాత్కరించనున్నాయి.

'క్యాపిటల్ ప్యాసింజర్'తిరిగి రావాలి..

'ఆర్టీసీ అనగానే ప్రయాణికులకు ఓ నమ్మకం. కానీ కొన్ని కారణాలతో కొందరు ప్రయాణికులు సంస్థకు దూరమయ్యారు. సిబ్బంది వ్యవహారం కూడా దీనికి ఓ కారణం. సిబ్బంది వ్యవహారశైలిలో మంచి మార్పు అవసరం. కొత్త సంవత్సరంలో వారిలో ఆ మార్పు కనిపిస్తుంది, ప్రయాణికులు దాన్ని గుర్తిస్తారని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు.

ఆర్టీసీ' లో 46 రిఫరల్ ఆస్పత్రులు

తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి అనుబంధంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 46 ఆస్పత్రులను రిఫరల్ ఆస్పత్రులుగా గుర్తిస్తూ ఆర్టీసీ ఉత్తర్వులు జారీచేసింది. అలాగే వైద్య పరీక్షలకు 3 డయాగ్నస్టిక్ సెంటర్లను కూడా గుర్తించింది. ఈ ఆస్పత్రుల్లో 28 హైదరాబాద్లో ఉండగా.. వరంగల్లో 6, కరీంనగర్లో 5, నిజామాబాద్ లో 2, జగిత్యాల, ఖమ్మం, మహబూబ్నగర్, సిద్దిపేట, నార్కెట్పల్లిల్లో 1 చొప్పున ఉన్నాయి.



అలా అన్న ప్రతి రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చాం

- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హెదరాబాద్, జనవరి 1 (మనం న్యూస్): కాంగ్రెస్ బలహీనపడిందన్న ప్రతి రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చామని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మీడియాతో చిట్ చాట్లో పాల్గొన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల గురించి మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో స్థానికనేతలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలపై ఇన్నిరోజులు సైలెంట్గా ఉన్న ప్రభుత్వం.. ఇప్పుడే ఎందుకు హడావుడి చేస్తోందని ప్రశ్నించారు. అభ్యర్థుల ప్రొసీజర్ కోసం వారం రోజుల సమయం ఇస్తే బాగుంటుందని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. పార్టీ ఆవిర్భావ దినోతవ్సం రోజున గాంధీభవన్కు వెళ్తుంటే కార్యకర్తలను అరెస్ట్ చేశారని పోలీసుల తీరుపై ఉత్తమ్ మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఒక్కో వ్యవస్థ నిర్వీర్యమవుతోందన్నారు.

2020 new looks 2020 స్పెషల్




'సరిలేరు నీకెవ్వరూ'

సూపర్ స్టార్ మహేష్ కథా నాయకుడిగా నటించిన 'సరిలేరు నీకెవ్వరు' సంక్రాంతి కానుకగా రిలీజవుతోంది. పోటీలో నాలుగు సినిమాలు ఉన్నా సరిలేరు యూనిక్ స్టైల్లో రిలీజ్ కాబోతోంది. ఇప్పటికే భారీగా థియేటర్లను లాక్ చేస్తోంది చిత్రబృందం. పనిలో పనిగా ప్రతి సోమవారం మాస్ ఎంబీ పాటలతో పాటు రకరకాల మార్గాల్లో బోలెడంత ప్రచారం చేశారు. సోషల్ మీడియా ల్లో సరిలేరు పోస్టర్లు.. టీజర్లు జెట్ స్పీడ్‌తో దూసుకెళుతున్నాయి. ఇటీవల న్యూ ఇయర్ సందర్భంగా ఓ న్యూలుక్ ని రిలీజ్ చేశారు 'సరిలేరు నీకెవ్వరూ' టీం. జనవరి 5న ప్రీరిలీజ్ ఈవెంట్ జరగనుంది. చిరంజీవి అతిథిగా ఘనంగా జరగనున్న ఈ వేడుక ఘట్టమనేని ఫ్యాన్స్ కి స్పెషల్ ట్రీట్ కానుంది. ప్రీరిలీజ్ ముందే ఒక కొత్త పోస్టర్ ని జనవరి 1 కానుకగా రిలీజ్ చేయడం ఆసక్తికరం. తాజా పోస్టర్ మహేష్ ఫ్యాన్స్ లో వైరల్ గా మారింది. ఇందులో మహేష్-రష్మిక మందన- విజయశాంతి- రాజేంద్ర ప్రసాద్- రావుర మేష్- సంగీత తదితరులు ఈ ఫోటోలో ఉన్నారు. వీళ్లంతా ఒకే ఫ్యామిలీ. ఆర్మీ మేజర్ కృష్ణ మనోహర్ కుటుంబ చిత్రమిది. హ్యాపీ న్యూఇయర్ 2020 అంటూ పోస్టర్ పై వేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అవస్థల పాలైన నేటి జనరేషన్ లో ఇలాంటి పోస్టర్లు కాస్త కన్నుల పండుగే మరి.



'అల వైకుంఠపురములో'

అల్లు అర్జున్ కొత్త సినిమా 'అల వైకుంఠపురములో' ఈ సంక్రాంతికి రిలీజ్ కానుంది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ విషయంలో ముందంజలో ఉంది. తాజాగా ఈ సినిమాలోని బుట్టబొమ్మ సాంగ్ నుండి ఒక పోస్టర్‌ను విడుదల చేస్తూ ప్రేక్షకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈమధ్యే రిలీజ్ అయిన 'బుట్టబొమ్మ' సాంగ్ సంగీత ప్రియులను మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ పోస్టర్ కూడా ఆకట్టుకునేలా ఉంది. ఈ పోస్టర్‌లో పూజ ఒక మోడరన్ గౌన్ ధరించి బార్బీ బొమ్మ తరహాలో నిలుచుంది. అల్లు అర్జున్ పూజ భుజం మీద తన మోచేతిని ఆన్చి మరో చేతితో అతన బెల్టును పట్టుకుని సూపర్ స్టైలిష్ పోజిచ్చాడు. బన్నీ డ్రెస్ అయితే అదిరిపోయింది. ప్రింటెడ్ డిజైన్ ఉండే తెలుపు రంగు చొక్కా.. క్రీం కలర్ ప్యాంట్ కాంబినేషన్లో టక్ చేసుకొని నిలుచున్నాడు. ప్యాంట్ పొట్టిగా ఉండడంతో కొత్తగా న్యూ స్టైల్ అన్నట్టుగా ఉంది.




'క్రాక్'

మాస్ మహారాజా రవితేజ, బ్లాక్బస్టర్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్లో రూపొందుతోన్నచిత్రం 'క్రాక్'. డాన్శీను, బలుపు చిత్రాల తర్వాత వీరిద్దరి కాంబినేషన్లో తెరకెక్కుతోన్నహ్యాట్రిక్ చిత్రమిది. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతుంది. ఇప్పటికే రెండు షెడ్యూల్ పూర్తయ్యాయి. ఇది వరకు విడుదలైన టైటిల్ పోస్టర్లో రవితేజ మాస్ లుక్కు ట్రిమెండస్ రెస్పాన్స్ వచ్చింది. మాస్ మహారాజా రవితేజ ఈ చిత్రంలో పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ఖాకీ యూనిఫామ్ వేసుకుని ఇన్టెన్స్ లుక్, చేతిలో గోలీసోడాను పట్టుకున్న రవితేజ 'క్రాక్' సినిమా ఫస్టలుక్‌ను నూతన సంవత్సరం సందర్భంగా మూవీ మేకర్స్ విడుదల చేశారు. ఈ లుక్లో రవితేజ బ్యాక్‌సైడ్ ఖైదీలు నిలబడి ఉండటాన్ని చూడొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన యధార్థ ఘటనలను ఆధారంగా చేసుకుని అన్నీ వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా అన్ని ఎలిమెంట్స్‌తో డైరెక్టర్ గోపీచంద్ మలినేని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ ఏడాది సమ్మర్లో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.



'నిశ్శబ్ధం'

అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'నిశ్శబ్ధం'. మాధవన్- షాలిని- అంజలి లాంటి టాప్ స్టార్లు ఈ చిత్రంలో నటిస్తున్నారు. హేమంత్ మధుకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్స్ మీడియా- కోన ఫిలింకార్పొరేషన్ సంయుక్తం గా నిర్మిస్తున్నాయి. ఇంతకు ముందు రిలీజ్ చేసిన పోస్టర్లు.. ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. తాజా పోస్టర్ లో స్వీటీ ఎంతో అందంగా కనిపిస్తోంది. ఇక షార్ట్ హెయిర్ తన అందాన్ని పదింతల పెంచింది. హారర్ థ్రిల్లర్ జోనర్ అయినా సినిమా ఆద్యంతం స్వీటీ కళ్ల తోనే కోటి భావాలు పలికించడం ఖాయంగా కనిపిస్తోంది. త్వరలోనే నిశ్శబ్ధం సినిమా రిలీజ్ కి రానుంది. ఈ సందర్భంగా స్వీటీ ప్రమోషన్స్ కి రెడీ అవుతోందని సమాచారం.



'డిస్కో రాజా'

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డిస్కో రాజా'. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' ఫేమ్ వి. ఐ. ఆనంద్ ఈ చిత్రానికి దర్శకుడు. రవితేజ కెరీర్‌లోనే యూనిక్ కాన్సెప్టుతో ప్రయోగాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రమిది. మాస్ రాజా రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారు. 1990 నాటి పాత్రకు.. నేటి జనరేషన్ పాత్రకు కనెక్షన్ ఏమిటి? అన్నది తెరపై సర్ ప్రైజ్ చేస్తుందట. ఇంతకు ముందు చిత్రబృందం విడుదల చేసిన రెట్రో లుక్ టైటిల్ సహా ప్రతిదీ ఆకట్టుకున్నాయి. మాస్ రాజాని డిఫరెంట్ గా ప్రెజెంట్ చేయనున్నారని ఫ్యాన్స్ కి అర్థమైంది. తాజాగా మరో కొత్త లుక్ ని రిలీజ్ చేశారు. 'హ్యాపీ న్యూ ఇయర్ 2020' అంటూ మాస్ మహారాజా ఫ్యాన్స్‌కి శుభాకాంక్షలు చెబుతూ ఈ పోస్టర్‌ని విడుదల చేశారు. రాజా ఈ పోస్టర్‌లో మునుపటి కంటే ఎంతో యంగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. అదే పక్క పాపిడి.. తీక్షణమైన చూపులు.. పైగా మజిల్ పవర్ చూపిస్తున్నాడు. ఇక ఆ షర్ట్ డిజైన్ చూడగానే ఇది రెట్రో లుక్ అని అర్థమవుతోంది.



'భీష్మ'



'ఎంత మంచివాడవురా'

సతీష్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందుతోన్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఎంతమంచివాడవురా'. ఈ చిత్రంలో కల్యాణ్‌రామ్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో కల్యాణ్ రామ్ సరసన మెహరీన్ నటిస్తుంది. జనవరి 1 న్యూ ఇయర్ సందర్భంగా ఈ చిత్రం నుండి ఓ లుక్ విడుదల చేశారు. ఈ చిత్రంలో హీరో హీరోయిన్ సంతోషంగా సంబురాలు చేసుకుంటున్నట్లు కనిపిస్తుంది.



'సత్యాగ్రహి'

గతంలో పవన్ కళ్యాణ్ 'సత్యా గ్రహి' అనే టైటిల్‌తో ఒక సినిమాను డైరెక్ట్ చేయాలనుకున్న సంగతి తెలిసిందే. కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. అయితే ఆ టైటిల్‌తో పవన్ కళ్యాణ్ సిద్ధాంతాల స్ఫూర్తితో 'సత్యాగ్రహి' చిత్రాన్ని శ్రీ భవిత క్రియేషన్స్ పతాకం పై గంగారెడ్డి నిర్మిస్తుండగా కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ నూతన సంవత్సరం సందర్భంగా ఈ రోజు రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్‌లో పవన్ కళ్యాణ్ పిడికిలి బిగించి ఫోర్స్‌తో ఉన్న ఫోటో వేశారు. ఆ ఫోటో ముందు ఆయన ఆదర్శంగా, ఆయన అడుగుజాడల్లో, పిడికిలి బిగించి ముందుకెళ్తోన్న నలుగురు యువకులు.. పోస్టర్‌లో ఇంటెన్స్ కనిపిస్తోంది. పవన్ కళ్యాణ్‌ని స్ఫూర్తిగా తీసుకొని తన సిద్ధాంతాలను ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సమాజం పై యవత బాధ్యతతో ఉండాలని చెబుతూ పవన్ కళ్యాణ్ ఫాన్స్ అయిన నలుగురు యువకులు సమాజాన్ని మార్చే బాధ్యత తీసుకుంటే ఎలా ఉంటుందనేది ఈ చిత్ర కథాంశంగా తెలుస్తోంది. లవ్ స్టోరీస్, అడల్ట్ కంటెంట్, లిప్ లాక్‌లతో సినిమాలు వస్తున్న ఈ రోజుల్లో ఇలా సొసైటీ పైన సినిమా చేసినందుకు దర్శకుడి ధైర్యాన్ని మెచ్చుకోవాలి.




'అశ్వథ్థామ'



● రెజీనా

కొత్త పాత్రలో...

అందాల నటి రెజీనా కొంతకాలంగా తెలుగులో భిన్నమైన సినిమాలే చేస్తోంది. 'అ!, సెవెన్, ఎవరు' లాంటి సినిమాలే అందుకు నిదర్శనం. ఈ సినిమాల్లో ఆమె పాత్రలకు మంచి పేరే దక్కింది. అందుకే ఇకపై కూడా అలాంటి చిత్రాలే చేయనుంది ఆమె. తమిళ దర్శకుడు కార్తిక్ రాజు డైరెక్షన్‌లో ఒక కొత్త చిత్రం మొదలుకానుంది. ఈ ఫీమేల్ సెంట్రిక్ సినిమాలో రెజినా ఒక కీ రోల్ చేయనుంది. ఇంతకీ అమె పాత్ర ఏమిటని అనుకుంటున్నారా.. ఆస్ట్రాలజర్. ఇందులో మనుషుల భవిష్యత్ చెప్పే ప్రత్యేకమైన వ్యక్తిగా ఆమె కనిపించనుంది. ఈ పాత్ర మీద, సినిమా మీద రెజినా చాలా నమ్మకంగా ఉంది. జనవరి రెండో వారం నుండి చెన్నైలో ఈ సినిమా షూట్ మొదలుకానుంది. ఇందులో మరొక నటి అక్షర గౌడ కూడా ఒక కీ రోల్ చేయనుంది.



● సూర్య

విలక్షణమైన కథతో..

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు టాలీవుడ్లోనూ మంచి క్రేజ్ ఉంది. ఈ మిస్టర్ పర్ఫెక్ట్ హీరోకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి మార్కెట్ సంపాదించుకున్నాడు. దీంతో ఆయన హీరోగా తమిళంలో తెరకెక్కే ప్రతీ సినిమాను తెలుగులోకి డబ్ చేస్తుంటారు. అయితే గతేడాది రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపంచేలేకపోయాయి. అయితే ప్రస్తుతం ఓ విలక్షణమైన కథతో అభిమానుల ముందుకు వచ్చేందుకు రెడీగా ఉన్నారు హీరో సూర్య. ఈ చిత్రంలో సూర్యకు సంబంధించిన రెండో లుక్కు మూవీ యూనిట్ కాసేపటి క్రితమే విడదల చేసింది. డిఫరెంట్ హెయిర్ స్టైల్, మాసిన గడ్డంతో గంభీరంగా ఉన్న సూర్యతో పాటు ఓ పక్షి కూడా పోస్టర్లో కనిపిస్తుంది. దీంతో సినిమా కథపై నెటిజన్లు ఏవేవో ఊహించుకుంటున్నారు. ఇక ఈ లుక్లో పక్షి ఎందుకు ఉందనే దానిపై నెటిజన్లు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ఇక ఈ సినిమాతో సూర్య ఖాతాలో భారీ విజయం పడటం ఖాయమని పలువురు నెటిజన్లు జోస్యం చెబుతున్నారు. ఈ సినిమాలో అపర్ణా బాలమురళి హీరోయిన్‌గా కాగా.. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రంలో మోహన్ బాబు విలన్ గా నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. జాకీష్రాఫ్, కరుణాస్లు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు. తమిళ, తెలుగు హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్లో రిలీజ్ కానుంది.



'శ్రీరెడ్డి దొరికిపోయింది'

ఎస్ఎస్ఆర్ ఆర్యన్, ఉపాసన హీరో హీరోయిన్లుగా రాహుల్ పరమహంస దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కరుతుకలై పతివు సెయ్'. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని తెలుగులో యశ్వంత్ మూవీస్ పతాకంపై 'శ్రీరెడ్డి దొరికిపోయింది' (మానవమృగాలకు అనేది టాగ్‌లైన్) పేరుతో నిర్మాత డి.వెంకటేశ్ విడుదల చేస్తున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలతో ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత డి.వెంకటేశ్ మాట్లాడుతూ ''తమిళ్లో పెద్ద విజయం సాధించిన ఈ చిత్రాన్ని మా బేనర్లో విడుదల చేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం సమాజంలో ఆడవారిపై జరుగుతున్న హత్యాచారాల నేపథ్యంలో సినిమా ఉంటుంది అన్నారు.

ఫిబ్రవరి 7న 'సవారి'


నందు, ప్రియాంక శర్మ జంటగా నటించిన సవారీ సినిమా విడుదలకు సిద్ధమైంది. అన్ని వర్గాలను ఆకట్టుకునే యానిమల్ లవ్ ఎంటర్టైనర్‌గా సవారి చిత్రం తెరకెక్కింది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ మరియు ప్రొడక్షన్ సంస్థ ఏషియన్ సినిమాస్ ఈ సినిమా థియేట్రికల్ హక్కులను దక్కించుకున్నారు. నైజాంలో సవారి సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ పాటలకు మంచి రెస్పాన్స్ రావడంతో సినిమాకు క్రేజ్ వచ్చింది. నందు, ప్రియాంక శర్మ జంటగా 'సవారీ' చిత్రంలోని పాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. రాహుల్ సిప్లిగంజ్ పాడిన నీ కన్నులు లిరికల్ సాంగ్ 5 మిలియన్ వ్యూస్ దక్కించుకుని.. ఇంకా వ్యూస్ తెస్తూనే ఉంది. దాంతో పాటే ఉండిపోయా పాటకు కూడా అద్భుతమైన స్పందన వస్తుంది. సాహిత్ మోత్కూరి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని కాల్వ నరసింహ స్వామి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సంతోష్ మోత్కూరి, నిశాంక్ రెడ్డి కుడితి సంయుక్తంగా నిర్మించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారు. మీడియా ముందుకు వచ్చి విడుదల తేదీని ఖరారు చేసారు మేకర్స్. ఈ సినిమా 2020, ఫిబ్రవరి 7న విడుదల కానుంది.



● నందు, ప్రియాంక శర్మ

రివర్స్ టెండరింగ్‌తో అవినీతికి చెక్

- **రివర్స్ టెండరింగ్‌తో అవినీతికి చెక్**
- **వేల కోట్ల ప్రజాధనం ఆదా**
- **పోలవరంలో రూ.782.80 కోట్ల ఆదా**



అమరావతి, జనవరి 1 (మనం న్యూస్ బ్యూరో): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి పనుల పేరుతో తమకు అనుకూలమైన సంస్థలకు ఎక్సెస్ రేట్లకు టెండర్లను కట్టబెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. గత సర్కార్ అవినీతికి రివర్స్ టెండరింగ్ ద్వారా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చెక్ పెట్టిందని వైసీపీ నేతలు అంటున్నారు. వేల కోట్ల రూపాయల కమీషన్లను దండుకున్నట్లు ఆరోపణలున్న సంగతి తెలిసిందే.

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే ప్రభుత్వం తీసుకున్న రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా వేల కోట్ల రూపాయల వరకు ప్రజా ధనం ఆదా అయిందంటున్నారు. సాగునీటి ప్రాజెక్టుల నుంచి మొదలు పేదలకు అందించే పక్కా గృహాల వరకు ఇష్టారాజ్యంగా ఎక్కువ కోట్ చేసిన కాంట్రాక్ట్ సంస్థలకు పనులను అప్పగించడం ద్వారా గత ప్రభుత్వంలో భారీగా అవినీతి చోటు చేసుకుందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి పనుల నిర్మాణం వ్యయం కన్నా పది నుంచి ఇరవై అయిదు శాతం వరకు అధికంగా కోట్ చేసిన సంస్థలకు కూడా ఆనాటి ప్రభుత్వం కాంట్రాక్ట్‌లను ఖరారు చేసిందని వైసీపీ ఆరోపించింది. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రైవేట్ వ్యక్తుల ద్వారా పనులను చేపట్టేందుకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తుంది. దీనిలో ఓపెన్ టెండర్లు, బిడ్డింగులు, ఈ ప్రొక్యూర్‌మెంట్, ఈ టెండర్లు, నామినేటెడ్ పనులు ఇలా వివిధ విధానాల్లో పనులను అప్పగిస్తూ ఉంటారు. అయితే ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం ద్వారా ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ పనులను నిర్వహించడంలో విఫలమైనా, అలక్ష్యంగా వ్యవహరించినా సదరు పనులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అంతేకాకుండా సదరు పనులను దక్కించుకున్న విధానంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులతో కుమ్మక్కై అధిక ధరలను కోట్ చేయడం ద్వారా ప్రజా ధనాన్ని దుర్వినియోగానికి కారణమవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో కాంట్రాక్టు పనుల్లో అవినీతిని అరికట్టడానికి ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ప్రక్రియను ఎంచుకున్నది.

ఈ విధానం ద్వారా పోలవరంలో రివ ర్స్ టెండరింగ్‌తో రూ.782.80 కోట్లు ఆదా అయినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఇందుకు సంబంధించిన రివర్స్ టెండరింగ్‌లో ఆరు సంస్థలు టెండర్లు దాఖలు చేయగా, అందులో ఎల్ 1 సంస్థ రూ. 260.26 కోట్లకు టెండర్ దాఖలు చేసింది. రూ. 274 కోట్ల విలువ చేసే పనులను 6.1 శాతం తక్కువకు పూర్తి చేయడానికి అంగీకరించిన ఎల్ 1 కన్నా ఎవరైనా తక్కువకు కోట్ చేసారా అంటూ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ నిర్వహించింది. దీంతో రూ. 231.47 కోట్లతో ఈ పనులు పూర్తి చేయడానికి మ్యాక్స్ ఇన్‌ఫ్రా సంస్థ ముందుకొచ్చింది. ఇది అంచనా విలువ కన్నా 15.66 శాతం తక్కువ కావడం గమనార్హం.

ఈ ఒక్క టెండర్‌లోనే గతంలో నిర్వహించిన టెండర్‌తో పోలిస్తే రూ. 58.53 కోట్ల ప్రజాధనం ఆదా అయినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అదే విధంగా హెడ్ వర్క్స్, పవర్‌స్టేషన్ల టెండర్ల ద్వారా భారీగా ప్రజాధనం ఆదా అయినట్లు ప్రభుత్వం తెలిపింది.

ప్రభుత్వం నిర్వహించిన రివర్స్ టెండరింగ్ ద్వారా వేల కోట్ల రూపాయలు ఆదా అయ్యాయి. పోలవరం హెడ్‌వర్క్స్, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం రూ.782.80 కోట్లు ఆదా కాగా, లెఫ్ట్ కనెక్టివిటీ పనులకు రూ. 58.53 కోట్లు, జెన్‌కో బొగ్గు రవాణాకు సంబంధించి రూ. 186 కోట్లు, వెలిగొండ రెండో టన్నెల్ మిగిలిన పనులకు రూ.61.76 కోట్లు, 4జీ సిమ్ కార్డులు పోస్టుపైడ్ రూ.33.77 కోట్లు, డెస్క్ టాప్ కంప్యూటర్లు, ప్రింటర్ల కొనుగోలులో రూ. 65.47 కోట్లు ఆదా అయ్యాయి. పోతురాజు నాలా డ్రైన్ అభివృద్ధి రూ. 15.62 కోట్లు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల స్మార్ట్ ఫోన్ల కొనుగోలుకు రూ. 83.80 కోట్లు, ఏపీ టిడ్కోలో రూ.303.31 కోట్లు, అల్లూరుపాడు ప్రాజెక్టు పనుల్లో రూ.67.81 కోట్లు, సోమశిల ప్రాజెక్టు పనుల్లో రూ.67.9 కోట్లు, గాలేరు -నగరి రెండో దశ తొలి ప్యాకేజిలో రూ.35.3 కోట్లు, గాలేరు -నగరి రెండో దశ రెండో ప్యాకేజీకి నిర్వహించిన రివర్స్ టెండరింగ్ ద్వారా రూ. 33.57 కోట్లు ఆదా అయ్యాయని ప్రభుత్వం తెలిపింది.

సామాన్య భక్తులకే పెద్దపీట

- **టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టీకరణ**
- **డ్రామాలు ఆడుతున్న చంద్రబాబు నాయుడు**



విజయవాడ, జనవరి 1 (మనం ప్రతినిధి): తిరుమలలో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికి త్వరితగతిన స్వామివారి దర్శన భాగ్యం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సామాన్య భక్తులకు అనుకూలంగా తిరుమల తిరుపతి దేవస్థానంలోనూ, ఆలయ నిర్వహణలోనూ అనేక సంస్కరణాత్మక చర్యలు తీసుకుంటున్నామని సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన, వైకుంఠ ఏకాదశి నుంచి తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ స్వామి వారి లడ్డూ ప్రసాదం ఉచితంగా అందించబోతున్నట్లు పేర్కొ న్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా కలకలం కొనసాగాలని అన్నారు. ఆయన నూతన సం వత్సరంలో సకాలంలో వర్షాలు పడి దేశ ప్రజలంతా సుఖసంతోషా లతో ఉండాలని ఆకాంక్షించారు.

సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌కు వస్తున్న జనాదరణను చూసి టీడీపీ ఓర్వలేకపోతోందని, అందుకే రైతుల పేరుతో రాజధాని డ్రామా ఆడుతోందని మండిపడ్డారు. అమరావతిలో బినామీ పేర్లతో కొన్న భూములకు విలువ పడిపోతుందన్న భయంతో కుట్ర రాజకీయాలు చేస్తోందని వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని రెండు లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన ఘనుడు చంద్రబాబు అని ఆరోపించిన ఆయన టీడీపీ భూముల కోసం లక్ష కోట్లు పెట్టి అభివృద్ధి చేయాలా అని వ్యాఖ్యానించారు. అన్ని ప్రాంతాలు అభి వృద్ధి చెందాలని ముఖ్యమంత్రి భావిస్తుంటే, ఒక్క ప్రాంతానికే పరి మితం చేయాలని ప్రతిపక్షం ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ పెద్దపీట చేశారన్నారు. రాజధాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కచ్చితంగా న్యా యం చేస్తామన్నారు. కమిటీ నివేదిక వచ్చాక అందరికీ న్యాయం జరిగేలా నిర్ణయం ఉంటుందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు.

ప్రతిదాన్నీ వ్యతిరేకిస్తున్నారు

- **తెలుగుదేశం పార్టీ నేతల తీరుపై మంత్రి విమర్శ**
- **హామీలను అమలు చేయడం కూడా తప్పేనా?: పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**




తిరుపతి, జనవరి 1 (మనం ప్రతినిధి): ఎన్నికలలో ఇచ్చిన హామీల్లో ఎనభై శాతం పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిది అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట తప్పకుండా హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. ఉగాది రోజు 25 లక్షల ఇళ్ళ పట్టాలను అందిస్తామని వెల్లడిం చారు. బుధవారమిక్కడ ఆయన మాట్లాడుతూ, మూడు రాజధానుల ఆలోచన మంచిదని, అమరావతిలో రియల్ ఎస్టేటు వ్యా పారం చేసేవాళ్లే దీనిని వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. రాజధాని అంశంపై కమిటీలు అందించిన నివేదిక గురించి అసెంబ్లీలో చర్చిం చి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నిటినీ జగన్ ప్రభుత్వం తూచ తప్పకుండా అమలు చేస్తున్నా తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్యంగా చంద్రబాబు నాయుడు ప్రతిదాన్నీ వ్యతిరేకిస్తూ, అన్నిటినీ తప్పుబడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు.

'రాయలసీమ నుంచి వచ్చిన ముఖ్యమంత్రులు అందరూ హైదరాబాదునే అభివృద్ధి చేశారు. నిజానికి రాజధానితో పది శాతం ప్రజలకు మాత్రమే పని ఉంటుంది. కోర్టులతో కూడా పది శాతం ప్రజలకు మాత్రమే పని. మూడు రాజధానుల ఆలోచన ఎంతో మంచిది. రాయలసీమ వాసులంతా ముఖ్యమంత్రికి ధన్య వాదాలు తెలపాలి. రాజధాని అంశంలో ఇకనైనా కార్మికుల పోరా టాలు, ధర్నాలు పక్కన పెట్టాలి' అని మంత్రి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

గందరగోళం సృష్టిస్తే ఎలా?

- **రాజధానిని మార్చడం మాట తప్పడమే కదా!**
- **సీఎం జగన్‌కు సీపీఐ నేత రామకృష్ణ లేఖ**

విజయవాడ, జనవరి 1 (మనం ప్రతినిధి): రాజధాని విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల్లో లేనిపోని గందరగోళం సృష్టిస్తున్నారని సీపీఐ నాయకుడు రామకృష్ణ విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడుగా ఉండగా జగన్ అమరావతిని రాజధానిగా అంగీకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆయన ముఖ్యమంత్రికి ఈ మేరకు ఒక లేఖ రాస్తూ, మాట తప్పడం వల్ల ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో అయోమయం ఏర్పడిందని, ఇది రాష్ట్ర శ్రేయస్సుకు మంచిది కాదని అన్నారు. మూడు రాజధానుల ప్రకటనను వ్యతిరేకిస్తూ రాజధాని ప్రాంత రైతులు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా రాజధాని రైతుల ఆందోళనను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. ''కొత్త సంవత్సరం ప్రారంభం రోజున కూడా అమరావతి రైతులు దీక్షలు చేశారు. అమరావతి రాజధానిగా గతంలో మీరు కూడా అంగీకారం తెలిపారు. ఇప్పటికే అమరావతిలో రూ.9 వేల కోట్లు ఖర్చు చేశారు. రాజధాని మారు స్తామంటూ గందరగోళం సృష్టించారు. రాజధాని, అభివృద్ధిపై అఖి లపక్ష సమావేశం నిర్వహించాలి అని లేఖలో రామకృష్ణ పేర్కొన్నారు.



విజయవాడలోని సమాచారశాఖ కమిషనర్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయికుమార్ రెడ్డి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇదంతా అనవసర ప్రయాస

- **జగన్‌కు రాయలసీమ హక్కుల కమిటీ లేఖ**

అమరావతి, జనవరి 1 (మనం ప్రతినిధి): సీఎం ప్రతిపాదించిన మూడు రాజధానుల నిర్ణయం సరికాదని రాయలసీమ హక్కుల కమిటీ స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్ రెడ్డికి ఈ మేరకు లేఖ రాస్తూ రాజధాని మార్పు వల్ల రాయ లసీమకు ఒరిగేదేమీ లేదని పేర్కొంది. కర్నూలులో హైకోర్టు ఏర్పా టు వల్ల రాయలసీమకు వచ్చే అదనపు ప్రయోజనాలు ఏమీ ఉం డవని ఆ లేఖలో కమిటీ సభ్యులు తెలిపారు. విశాఖపట్నాన్ని రాజ ధానిగా అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమలో రాజధానిని ఏర్పాటు చేయాలన్నారు.

ఇన్‌సైడ్ ట్రేడింగ్‌పై త్వరలోనే చర్యలు

- **స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటన**



శ్రీకాకుళం, జనవరి 1 (మనం ప్రతినిధి): అమరాతిలో జరి గిన ఇన్‌సైడ్ ట్రేడింగ్‌పై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఈ లోపల చంద్రబాబు నాయుడు అంత తొందర పడాల్సిన అవసరమేమీ లేదని ఆయన మీడియా సమావేశంలో అన్నారు. 'అదొక ప్రతిపక్షం, అతడొక నాయకుడు' అంటూ టీడీపీని, చంద్రబాబును ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వాన్‌పిక్ భూములపై ఆరోపణలు చేస్తున్న చంద్రబాబు, అధికారంలో ఉన్నప్పుడు ఎం దుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా చంద్రబాబు సమర్థిస్తారా, వ్యతిరేకిస్తారా చెప్పాలని సీతారాం డిమాండ్ చేశారు. మూడు రాజధానులు ఏర్పడి అభి వృద్ధి చెందుతుంటే అప్పుడు చంద్రబాబు లాంటి వారికి రాజధాని మార్పు విలువ తెలుస్తుందని టీడీపీ నాయకులనుద్దేశించి స్పీకర్ వ్యాఖ్యానించారు.

ఇదంతా పనికిమాలిన వ్యవహారం

- **జీఎన్ రావు నివేదికపై చంద్రబాబు మండిపాటు**

అమరావతి, జనవరి 1 (మనం ప్రతినిధి): సీనియర్ అధి కారి, రిటైర్డ్ ఐఏఎస్ జీఎన్ రావుపై టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎన్ రావు పనికిమాలిన వ్యక్తి అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన జీఎన్ రావు వివిధ హోదాల్లో ప్రభుత్వానికి, ప్రజలకు విశేషమైన సేవలు అందించారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ ఏఐఎస్ జీఎన్ రావు నేతృత్వంలో నిపుణుల కమిటీని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి కమిటీలు, నివేదికల వల్ల ఉపయోగమేమీ లేదని ఆయన అన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి విషయమై ఐఏఎస్ జీఎన్ రావు కమిటీ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. మూడు రాజధానుల ఏర్పాటు ద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి స్పష్టమైన సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ, సమ గ్రాభివృద్ధిపై జీఎన్ రావు నేతృత్వంలోని నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను, బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) ఇచ్చే నివేదికను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే టీడీపీ అధినేత చంద్ర బాబు సీనియర్ అధికారిపై విమర్శలకు దిగారు.

ప్రతిపక్ష హోదా కూడా ఉండదేమో!

- **ఇలా తప్పిదాలు చేస్తూ పోతే టీడీపీకి భంగపాటు తప్పదు**
- **చంద్రబాబుపై మంత్రి కృష్ణదాస్ విమర్శలు**

శ్రీకాకుళం, జనవరి 1 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న సేవలను చూసి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు ఓర్చుకోలేకపోతున్నారని మంత్రి కృష్ణ దాస్ ఇక్కడ మీడియా సమావేశంలో అన్నారు. తన హయాంలో ఇలా తప్పిదాల మీద తప్పిదాలు చేసే చంద్రబాబు పార్టీ కేవలం 23 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. 151 స్థానాల్లో వైసీపీ గెలిచిందంటే చంద్రబాబు అర్థం చేసుకోవాలని కృష్ణదాస్ అన్నారు. చంద్రబాబు తప్పిదాల వల్లే ప్రతిపక్షంలో కూర్చున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. 23 మంది టీడీపీ ఎమ్మెల్యేల్లో ఇప్పటికే ఇద్దరు బయటకు వెళ్లారని, మరో ఇద్దరు వెళ్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా పోతుందని కృష్ణదాస్ వ్యాఖ్యానించారు.

వీళ్లవి చౌకబారు రాజకీయాలు

- **చంద్రబాబు, పవన్‌లపై ఎమ్మెల్యే సుధాకర్ బాబు విమర్శ**



అమరావతి, జనవరి 1 (మనం ప్రతినిధి): చంద్రబాబు, పవన్ కల్యాణ్ చౌకబారు రాజకీయ ఎత్తుగడలతో లేని సమస్యలను సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాల యంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్‌గా నటిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టును పవన్ చదవడం జరుగుతోందన్నారు. పవన్ కల్యాణ్ ఎప్పుడు ఎలా ఉంటాడో ఎవరికీ అర్థం కాదని, ఆయ న వైఖరి నచ్చకే ప్రజలు రెండు చోట్లా ఓడించారని సుధాకర్‌బాబు విమర్శిం చారు. జనసేన పార్టీ కార్యాలయానికి భూమి ఇచ్చిన లింగమనేని భూము లకు రేట్లు పడిపోతాయనే పవన్ ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. రూ. 2.50 లక్షల కోట్ల అప్పును చంద్రబాబు ప్రజల నెత్తిన రుద్దారని అన్నారు. అమరావతికి కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిన సంగతి వాస్తవం కాదా అని ప్రశ్నిం చారు. రాజధాని పేరుతో ప్రజలకు గ్రాఫిక్ జిమ్మిక్కులు చూపించారని పేర్కొన్నారు. 'చంద్రబాబూ నీ కాపురం ఎక్క డుంది? మీ సతీమణి అమరావతిలో ఉండడం లేదు. మీ కోడలు ఇక్కడ ఎందుకు ఉండడం లేదు?' అని ప్రశ్నించారు. మీ మనవడిని ఏ స్కూల్‌లో చేర్పించారో చెప్పాలన్నారు.

అప్పుల రాష్ట్రాన్ని ఎలా బయటకు తీసుకురావాలా అని జగన్ మల్ల గుల్లాలు పడుతున్నారని సుధాకర్‌బాబు అన్నారు. వెనుకబడిన వర్గాల సమ గ్రామాభివృద్ధికి జగన్ అవిశ్రాంతంగా పని చేస్తున్నారని అన్నారు. అమరావతి ప్రాంత రైతులకు ఎటువంటి నష్టం జరగదన్నారు. రెచ్చగొట్టేవారి మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీని విమర్శిస్తుంటే ఏపీ బీజేపీ నాయకులు మాత్రం చంద్రబాబుకు అనుకూలంగా ధర్నాలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సీఎం సమపాళ్లలో అందిస్తున్నారని, అమరావతిలో ఎందుకు చంద్రబాబు సొంతిల్లు నిర్మించు కోలేదన్నారు. అమరావతికి జగన్ వ్యతిరేకం కాకపోయినా ఇల్లు, పార్టీ కార్యాలయం నిర్మించుకున్నారని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ఘనత సీఎందే అన్నారు. జనవరి 9 నుంచి అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ప్రతి తల్లికి రూ. 15 వేలు అందిస్తామన్నారు. పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియం విద్యను అందించాలనుకుంటే చంద్రబాబు, పవన్ అడ్డుకుంటున్నారని అన్నారు.

ఆర్‌టీసీ విలీనం చరిత్రాత్మకం

- **సంకల్ప బలం ఉంటే ఏదీ అసాధ్యం కాదు**
- **ఇది నిరూపించిన ముఖ్యమంత్రి జగన్**
- **రాష్ట్ర మంత్రి పేర్నినాని ప్రశంసలు**



విజయవాడ, జనవరి 1 (మనం న్యూస్): అనుభవం కంటే సంకల్ప బలం ముఖ్యమని, ఆ సంకల్పబలంతోనే సీఎం జగన్ ఏపీఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి చూపించారని రాష్ట్ర రోడ్డు రవాణా, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య అన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు ఆర్‌టిసిని విలీనం చేయడం అసాధ్యమని అంటే అధికారంలోకి వచ్చిన 200 రోజుల్లోనే వైయస్ జగన్ ప్రభుత్వంలో విలీనం చేసి చూపించారని మంత్రి స్పష్టం చేశారు. ఎన్ని అవరోధాలు ఉన్నా ఆర్‌టిసి డ్రైవరు ఏ విధంగా నమ్మకంగా ప్రయాణీకులను గమ్యం చేరుస్తాడో, అలాగే జగన్మోహన రెడ్డి కూడా సంపూర్ణంగా ఉద్యోగుల హామీలను అమలు చేసి గమ్యం చేరుస్తారన్నారు. జగన్ ఆర్‌టిసి ఉద్యోగులు అనుమాన పడవలసిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. విలీనాన్ని నిలుపుదల చేయాలని ఎన్ని అభ్యంతరాలు వచ్చినా నష్టాల్లో ఉన్న విలీనం చేసే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం భారతదేశ చరిత్రలో లిఖించతగ్గ రోజు అని ఆయన పేర్కొన్నారు.

కార్మికులు తన కుటుంబ సభ్యులు అని, తన కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటున్నానని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖా మంత్రి పేర్ని వెంకట్రామయ్య పేర్కొన్నారు. బుధవారం పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలోని వర్క్‌షాపు ప్రాంగణంలో ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి కృతజ్ఞతా సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ, జగన్మోహనరెడ్డి తన పాదయాత్ర సందర్భంగా ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీకి కట్టుబడి అమలు చేసి చూపించారన్నారు. గత ప్రభుత్వం రైతులకు బేషరతుగా రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించినా వాటిని అమలు చేసిన దాఖలాలు లేవన్న విషయం అందరికీ తెలుసని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం ఆర్‌టిసిని జాతీయం చేస్తామని ప్రకటించి భయభ్రాంతులకు గురి చేసిందని, ఆర్‌టిసి ఉంటుందో మూసివేస్తారో అనే అపోహ ఆనాటి ఉద్యోగుల్లో కలిగిందని అన్నారు. జగన్మోహనరెడ్డి తాను ఇచ్చిన హామీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపోహలను తొలగించారన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులకు రావాల్సిన జిపియఫ్, సిసిఎస్, పదవీ విరమణ సొమ్ములను గత ప్రభుత్వం ఇవ్వలేదని ఆ మొత్తాలను త్వరలోనే చెల్లింపులు చేస్తామన్నారు. ఒక మంచి పని చేస్తే దానిలోని లోపాలను వెతకకుండా ఆచరణ సాధ్యమైన విధానంలో ప్రభుత్వం అడుగులు వేస్తుందన్న విషయాన్ని గుర్తించాలని మంత్రి కోరారు.

రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఆర్‌టిసి ఉద్యోగులను విలీనం చేయడం జరిగిందన్నారు. విలీనం చేయడానికి డబ్బు ముఖ్యం కాదని మనస్సు ఉండాలని మొదటి కేబినెట్ ద్వారానే స్పష్టం మైందన్నారు. ఏవిధంగానైనా ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారన్నారు. నందిగామ శాసనసభ్యులు జగన్మోహనరావు మాట్లాడుతూ 2020 కి ఒక విశిష్టత ఉందని, క్రికెట్ మ్యాచ్‌లో 20 20 కు ఉన్న ప్రాధాన్యత ద్వారా త్వరగా ఫలితాలు వస్తాయన్నారు.

అన్నదాతలకు జగన్ అండ

- **వ్యవసాయానికి అధిక కేటాయింపులు**
- **విలేకరుల సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి**



అమరావతి, జనవరి 1 (మనం ప్రతినిధి): దేశ చరిత్రలో ఎక్కడా ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.28,866 కోట్లు కేటాయించిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్. నాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మొత్తం బడ్జెట్‌లో వ్యవసాయ రంగం వాటా 12.66 శాతం ఉండడం గమనార్హం అన్నారు. ఏ రాష్ట్రంలోను ఇటువంటి కేటాయింపులు కనిపించవన్నారు. నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. పాదయాత్రలో రైతులకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకుంటూ ముందుకు పోతున్నారని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్ రద్దు చేయమని పాదయాత్రలో జగన్‌ను రైతులు అడిగారు. అధికారంలోకి రాగానే దానిని రద్దు చేయడం జరిగింద న్నారు. ఉచిత పంటల బీమా కూడా ఇవ్వడం జరిగింద న్నారు. మొదటిసారిగా 2,164 కోట్ల బీమా చెల్లించి 55 లక్షల రైతు కుటుంబాల తరపున 56 లక్షల హెక్టార్ల భూమికి ఇన్సూరెన్స్ చెల్లించడం జరిగిందన్నారు. రైతు భరోసా కింద రూ.5,350 కోట్లు అందజేయడం జరిగిందన్నారు.

కౌలు రైతులకు కూడా ఈ మధ్యే రూ.181 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. కౌలుదారులకు రక్షణగా ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల హక్కుల చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ఏడు లక్షలు పెంచి ఆదుకుంటున్నామన్నారు. శనగ రైతులను కూడా ఆదు కున్నామన్నారు. రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామన్నారు. మంచి సూచనలు ఎవరిచ్చినా తీసుకుని సరిదిద్దుకుంటూ ముందుకు పోతున్నా మన్నారు. రైతు జీవితాలకు వైసీపీ ప్రభుత్వం సంపూర్ణ భరోసాను ఇస్తుందన్నారు. ఎంతటి కష్టమైనా రైతులను ఆదుకోవడంలో జగన్ అగ్రభాగాన ఉంటున్నారని నాగి రెడ్డి పేర్కొన్నారు. ఇన్ని చేయబట్టే ప్రజలు వైఎస్‌ఆర్ పార్టీ పాలన కలకాలం ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. ఆరు నెలల్లోనే మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి ఒక్కదానిని సంపూర్ణంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం చేయని విధంగా వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, కేటాయింపులు చేసిందన్నారు.

ఆ ఐదుగురు



అమిత్ ఫంగల్

(మనం క్రీడావిభాగం)

అందరి దృష్టి ఇప్పుడు టోక్యో ఒలింపిక్స్‌పై ఉంది. ఈ మెగా ఈవెంట్‌లో భారత అథ్లెట్లు ఎలాంటి ప్రతిభ కనబరుస్తారో అని అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. గతేడాది సత్తా చాటిన క్రీడాకారులు ఈ నూతన దశాబ్దంలో తమ ప్రభావం కొనసాగించనున్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రభావం చూపగల ఆ క్రీడాకారులెవరో ఓసారి చూద్దాం...

శ్రేయాస్ అయ్యర్ (క్రికెట్)

టీమిండియాలో 4వ నంబర్ స్థానం ఎవరిదన్న చర్చకు ఎట్టకేలకు తెరపడింది. 2019లో శ్రేయాస్ అయ్యర్ అద్భుతమైన బ్యాటింగ్ ప్రతిభ కనబరిచి నాల్గో స్థానంను సుస్థిరం చేసుకున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన ఈ కెప్టెన్ బ్యాటింగ్‌లో ఎంతో పరిణితి కనబరిచాడు. అంతేకాకుండా చురుకైన ఫీల్డింగ్‌ను ప్రదర్శించాడు. నాల్గో నంబర్ స్థానం తలనొప్పి పోయిందన్న ప్రధాన కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యలే ఇందుకు ఉదాహరణ. ఆస్ట్రేలియాలో జరగనున్న టీ20 వరల్డ్ కప్‌కు సన్నాహకంలో అయ్యర్ 2020లో మరింత మెరుగైన ప్రతిభ కనబరచనున్నాడు. ఈ వరల్డ్ కప్ అక్టోబర్‌లో జరగనుంది.


శ్రేయాస్ అయ్యర్

సౌరభ్ చౌదరి (షూటింగ్)

భారత షూటర్ సౌరభ్ చౌదరిని చూస్తుంటే అతను పతకాల ఆకలితో ఉన్నట్టు అనిపిస్తోంది. 2019లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో అతను స్వర్ణ పతకం సాధించి ప్రపంచ రికార్డు సృష్టించడంతో పాటు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత కూడా సాధించాడు. అంతేకాదు మరో యువ షూటర్ మను భకర్‌తో కలిసి మిక్స్‌డ్ పెయిర్ ఈవెంట్‌లోనూ పతకం సాధించాడు. మ్యూనిచ్ వరల్డ్ కప్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. రియో డీ జెనీరోలో జరిగిన వరల్డ్ కప్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఆసియా చాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలవడంతో పాటు మిక్స్‌డ్ ఈవెంట్‌లో యశస్విని సింగ్ దేశ్వాల్‌తో పాటు మరో పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ యువ షూటర్ ఒలింపిక్స్‌తో పాటు ఇతర ఈవెంట్లలోనూ భారత్‌కు మరిన్ని కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టే అవకాశముంది.



వినేష్ పొగట్

వినేష్ పొగట్ (రెజ్లింగ్)

వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలవడం ద్వారా వినేష్ పొగట్ తన సత్తా ఏంటో నిరూపించింది. రష్యాలో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో గ్రీస్‌కు చెందిన మారియాను పొగట్ 4-1తో చిత్తు చేసింది. దీంతో టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత తొలి రెజ్లర్‌గా నిలిచింది. అంతేకాదు వరల్డ్ కప్ టోర్నీ ద్వారా ఒలింపిక్ బెర్త్ సాధించిన భారత తొలి మహిళా రెజ్లర్‌గా కూడా ఆమె ఘనత సాధించింది. ఈ నేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్‌లో వినేష్ పొగట్ మరింత సత్తా చాటే అవకాశముంది. సాక్షి మాలిక్ ఫామ్‌లో లేకపోవడంతో టోక్యోలో వినేష్‌పైనే భారత్ ఆశలు పెట్టుకుంది.


అమిత్ ఫంగల్ (బాక్సింగ్)

అమిత్ ఫంగల్ స్థిరంగా రాణించడం చూస్తుంటే లెజెండరీ మహిళా బాక్సర్ ఎంసీ మేరీకోమ్ గుర్తుకు వస్తోంది. అమిత్ 48 కిలోల నుంచి 51 కిలోల విభాగానికి మారాడు. అయినప్పటికీ అతను స్ఫూర్తిదాయక ప్రతిభను కొనసాగించాడు. పురుషుల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఈ 23 ఏళ్ల బాక్సర్ భారత్‌కు తొలిసారి రజత పతకం అందించాడు. 2019లో అమిత్ చివరిసారి 48 కిలోల కేటగిరిలో పాల్గొని స్వర్ణం కూడా సాధించాడు. 51 కిలోల విభాగానికి మారిన తర్వాత ఆసియన్ చాంపియన్‌షిప్‌లో తొలి స్వర్ణం గెలిచాడు. ఈ నేపథ్యంలో టోక్యోలోనూ ఇతను పతకం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.


సౌరభ్ చౌదరి

జి. సథియన్ (టేబుల్ టెన్నిస్)

ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్‌లో భారత్‌కు చెప్పుకోదగిన చరిత్ర ఏమీ లేదు కానీ గతేడాది సథియన్ అద్భుతాలు సృష్టించాడు. శరత్ కమల్‌కు వారసుడిగా పేరు తెచ్చుకున్న సథియన్ 2019లో అత్యధిక ర్యాంక్ సాధించిన భారత ఆటగాడిగా నిలిచాడు. ఐటీటీఎఫ్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్-25లో స్థానం సాధించిన భారత తొలి ప్లేయర్‌గా సథియన్ నిలిచాడు. జులైలో విడుదలైన ర్యాంకింగ్స్‌లో 24వ స్థానం సాధించాడు. అంతేకాదు 2019లో టాప్-20 ప్లేయర్స్‌ను ఓడించాడు. ఇందులో జపాన్‌కు చెందిన ప్రపంచ నం.5 ర్యాంక్ యువ సంచలనం హరిమొటొ టొమొకజు కూడా ఉన్నాడు. ఆసియా కప్‌లో పాల్గొన్న తొలిసారే సథియన్ ఆరో స్థానంలో నిలవడం వల్ల వరల్డ్ కప్‌కు అర్హత సాధించాడు. వరల్డ్ కప్ మెయిన్ డ్రాలో తన గ్రూప్‌లో ఉన్న టాప్ ఆటగాళ్లను ఓడించాడు. ఇక టోక్యో ఒలింపిక్స్‌లోనూ సథియన్ టాప్ ప్లేయర్స్‌ను ఓడించి భారత్‌కు పతకాన్ని అందించాలని కోరుకుందాం.


జి. సథియన్

కోహ్లీకున్న ఎనర్జీ ఏ కెప్టెన్‌కూ లేదు

- **టీమిండియా కోచ్ రవిశాస్త్రి**



న్యూఢిల్లీ: మైదానంలో సహచరుల్లో ఉత్సాహం నింపాలంటే కెప్టెన్ విరాట్ కోహ్లీ తర్వాతే ఎవరైనా అని టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రి అన్నారు. గత ఐదేళ్లుగా బ్యాటింగ్‌లో నిలకడగా రాణిస్తున్న కోహ్లీ.. కెప్టెన్‌గా కూడా భారత్‌కు చిరస్మరణీయమైన విజయాలను అందిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా లక్ష్య ఛేదన సమయంలో తాను ముందుండి జట్టును నడిపించే కోహ్లీ.. ఫీల్డింగ్‌లోనూ డైవ్ క్యాచ్‌లతో సహచరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇటీవల వెస్టిండీస్‌తో ముగిసిన సిరీస్‌లో మంచు కారణంగా భారత ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేసినప్పటికీ బౌండరీ లైన్ వద్ద ప్రమాదకర రీతిలో కోహ్లీ డైవ్ క్యాచ్‌లు పట్టి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. భారత్, శ్రీలంక మధ్య ఈ నెల 5న మూడు టీ20ల సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కోహ్లీ కెప్టెన్సీ గురించి రవిశాస్త్రి మాట్లాడారు. 'విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా రోజు రోజుకు రాటుదేలుతున్నాడు. మైదానంలో ఆట పట్ల అతను చూపుతున్న అంకితభావం అమోఘం. అత్యుత్తమ ప్రదర్శనతో మైదానంలోని సహచరుల్లో విరాట్ కోహ్లీ మాదిరిగా ఉత్సాహం నింపే కెప్టెన్‌ను నేను ఇంత వరకు చూడలేదు. అలాగని కోహ్లీ పర్‌ఫెక్ట్ కెప్టెన్ అని నేను చెప్పను. ఎందుకంటే.. క్రికెట్ ప్రపంచంలో పర్‌ఫెక్ట్ కెప్టెన్ ఎవ్వరూ లేరు. ఏదో ఒక బలహీనత ఉంటుంది. కానీ జట్టును నుంచి కెప్టెన్ ఏ మేరకు ఫలితాలు రాబడుతున్నాడని మాత్రమే అంతిమంగా చూడాలి' అని శాస్త్రి అన్నారు. కోహ్లీ ప్రస్తుతం తన భార్య అనుష్క శర్మతో కలిసి స్విట్జర్లాండ్ టూర్‌లో ఉన్నాడు. అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు కూడా అక్కడి నుంచే తెలిపాడు. గురువారం రాత్రికి కోహ్లీ, అనుష్క జంట భారత్‌కు చేరుకోనుండగా.. ఆదివారం నుంచి శ్రీలంకతో మ్యాచ్‌లు మొదలవుతాయి.

మాథ్యూస్ రీ ఎంట్రీ

భారత్‌తో సిరీస్‌కు శ్రీలంక జట్టు ఖరారు



న్యూఢిల్లీ: టీమిండియాతో ఈ నెల 5న ప్రారంభం కానున్న మూడు టీ20ల సిరీస్ కోసం 16 మంది సభ్యుల జట్టును శ్రీలంక బుధవారం ప్రకటించింది. ఫాస్ట్ బౌలర్ లసిత్ మలింగ ఈ సిరీస్‌లో కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. దాదాపు 16 నెలల తర్వాత ఆల్ రౌండర్ ఏంజెలో మాథ్యూస్ మళ్లీ టీ20 జట్టుకు ఎంపికయ్యాడు. గతేడాది చివర్లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన శ్రీలంక జట్టు మూడు టీ20ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో అదే జోరును భారత్‌లోనూ కొనసాగించాలని లంకేయులు ఉత్సాహంగా ఉన్నారు. భారత్ పిచ్‌లపై శ్రీలంక ఆటగాళ్లకు మంచి అనుభవం ఉండగా... మాథ్యూస్, మెండిస్, ఇసుర ఉదాన వంటి సీనియర్లు జట్టులో ఉండటంతో శ్రీలంక సమతూకంతో కనిపిస్తోంది. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకుని మెరుగైన ఫామ్‌లో ఉన్నప్పటికీ బౌలింగ్ బలహీనత కాస్త కంగారుపెట్టించింది. కానీ గాయం నుంచి కోలుకున్న జస్‌ప్రీత్ బుమ్రా పునరాగమనం చేయనుండటంతో టీమిండియా కూడా హాట్ ఫేవరెట్‌గానే బరిలోకి దిగుతోంది. తొలి టీ20 5వ తేదీన గౌహతిలో జరగనుండగా.. రెండో టీ20కి 7న ఇండోర్, చివరి టీ20కి 10న పుణె ఆతిథ్యమివ్వనున్నాయి. అన్ని మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు జరగనున్నాయి.

శ్రీలంక టీ20 జట్టు: లసిత్ మలింగ (కెప్టెన్), కుశాల్ పెరీరా, దనుష్ గుణతిలక, అవిష్క ఫెర్నాండో, భనుక రాజపక్సే, ఒసాడ ఫెర్నాండో, దసున్ శనక, ఏంజెలో మాథ్యూస్, నిరోషన్ డిక్వెల్లా, కుశాల్ మెండీస్, హసనరంగ, లక్ష్యన్ సందకన్, ధనంజయ డిసిల్వా, లాహిరు కుమార, ఇసురు ఉదాన.

భారత టీ20 జట్టు: విరాట్ కోహ్లీ (కెప్టెన్), శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), మనీష్ పాండే, సంజు శాంసన్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, చాహల్, కుల్‌దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్, నవ్‌దీప్ సైనీ, జస్‌ప్రీత్ బుమ్రా.

హార్దిక్ పాండ్య సీక్రెట్ ఎంగేజ్‌మెంట్

న్యూఢిల్లీ: టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యకి, బాలీవుడ్ నటి నటాషా స్టాన్‌కోవిచ్‌తో బుధవారం నిశ్చితార్థం జరిగింది. ఉదయం తన ప్రేమ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అభిమానులకు తెలియజేసిన పాండ్య... సాయంత్రం నిశ్చితార్థం అయిపోయినట్టు ఫోటోల్నీ షేర్ చేశాడు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ ఎంగేజ్‌మెంట్ జరిగినట్లు తెలుస్తోంది. వెన్ను గాయం కారణంగా గత సెప్టెంబర్ నుంచి టీమిండియాకు దూరమైన పాండ్య... సర్జరీ చేయించుకుని ఇటీవల ఫిట్‌నెస్ సాధించాడు. దీంతో ఈ నెలాఖర్లో న్యూజిలాండ్ పర్యటనకు అతడ్ని ఎంపిక చేయాలని భారత సెలెక్టర్లు భావిస్తున్నారు. దేశవాళీ క్రికెట్‌లో కనీసం ఒక్క మ్యాచైనా ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని సూచించారు. ఇప్పటికే పాండ్య స్థానంలో జట్టులో చోటు సంపాదించిన యువ ఆల్ రౌండర్ శివమ్ దూబే.. హిట్టింగ్‌తో అదరగొడుతున్నాడు. 2016 జనవరిలో భారత జట్టులోకి అరంగేట్రం చేసిన పాండ్య అనతికాలంలోనే అగ్రశ్రేణి ఆల్ రౌండర్‌గా ఎదిగాడు. ఒకానొక దశలో దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్‌తో ఈ క్రికెటర్‌ని పోల్చారు. కానీ 2019లో వివాదాలు, గాయాలు అతడి కెరీర్‌ను కాస్త దెబ్బతీశాయి. గత ఏడాది ఆరంభంలోనే కాఫీ విత్ కరణ్ టాక్ షోకి హాజరై అమ్మాయిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాండ్యపై బీసీసీఐ రెండు వారాల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వెన్ను గాయం కారణంగా దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, బంగ్లాదేశ్‌తో కీలకమైన సిరీస్‌లకు ఈ ఆల్ రౌండర్ దూరమయ్యాడు.



2020 స్పోర్ట్స్ క్యాలెండర్

న్యూఢిల్లీ: సమ్మర్ ఒలింపిక్స్‌తో పాటు ఈ ఏడాది ఎన్నో మెగా ఈవెంట్లు జరగనున్నాయి. దీంతో ఈ ఏడాది ప్రతి నెలలో అభిమానులు క్రీడల పండగ చేసుకోనున్నారు. 2020లో జరగనున్న అంతర్జాతీయ క్రీడా పోటీలను నెల-వారిగా మీకందిస్తున్నాం...

జనవరి

- 5-10: క్రికెట్ : ఇండియా – శ్రీలంక 3 టీ20లు
- 7-12: బ్యాడ్మింటన్ : మలేసియా మాస్టర్స్
- 9-22: వింటర్ యూత్ ఒలింపిక్స్, లూసాన్నే, స్విట్జర్లాండ్
- 14-19: క్రికెట్ : ఇండియా – ఆస్ట్రేలియా 3 వన్డేలు
- 17-ఫిబ్రవరి 9: క్రికెట్ : ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్, సౌతాఫ్రికా
- 18-19: హాకీ ప్రో లీట్ : ఇండియా – నెదర్లాండ్స్
- 20-ఫిబ్రవరి 2: టెన్నిస్ : ఆస్ట్రేలియా ఓపెన్, మెల్‌బోర్న్
- 21-16: బ్యాడ్మింటన్ : థాయ్‌లాండ్ మాస్టర్స్
- 24-మార్చి 4: క్రికెట్: భారత్‌కు రానున్న న్యూజిలాండ్ (5 టీ20లు, 3 వన్డేలు, 2 టెస్టులు)

ఫిబ్రవరి

- 8-9: హాకీ ప్రో లీగ్: ఇండియా – బెల్జియం
- 18-23: బ్యాడ్మింటన్: స్పెయిన్ మాస్టర్స్
- 18-23: రెజ్లింగ్: ఆసియన్ చాంపియన్‌షిప్స్ (సీనియర్స్), ఢిల్లీ
- 21-మార్చి 8: క్రికెట్ : ఐసీసీ మహిళల టీ20 వరల్డ్ కప్, ఆస్ట్రేలియా
- 21-22: హాకీ ప్రో లీగ్: ఇండియా – ఆస్ట్రేలియా
- 25-మార్చి 1: బ్యాడ్మింటన్ : చైనా మాస్టర్స్
- 26-మార్చి 1: సైక్లింగ్: వరల్డ్ ట్రాక్ చాంపియన్‌షిప్స్ – బెర్లిన్, జర్మనీ

మార్చి

- 3-8: బ్యాడ్మింటన్: జెర్మన్ కప్
- 4-13: షూటింగ్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ షాట్‌గన్, నికోసియా, సైప్రస్
- 11-15: బ్యాడ్మింటన్: ఆల్ ఇంగ్లాండ్
- 12-18: క్రికెట్: సౌతాఫ్రికా భారత్ పర్యటన – 3 వన్డేలు
- 13-15: వరల్డ్ అథ్లెటిక్స్ ఇండోర్ చాంపియన్‌షిప్స్ – నాంజింగ్, చైనా
- 15: ఎఫ్1: ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ
- 15-26: షూటింగ్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్/, ఢిల్లీ
- 17-22: బ్యాడ్మింటన్: స్విస్ ఓపెన్
- 22: ఎఫ్1: బహ్రెయిన్ గ్రాండ్ ప్రీ
- 22-29: ఐటీటీఎఫ్ వరల్డ్ టీమ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్, బుసాన్, కొరియా
- 24-29: బ్యాడ్మింటన్: ఇండియా ఓపెన్
- 27-29: రెజ్లింగ్: ఆసియన్ ఒలింపిక్ క్వాలిఫయర్, జియాన్, చైనా
- 31-ఏప్రిల్ 5: బ్యాడ్మింటన్: మలేసియా కప్

ఏప్రిల్

- ఏప్రిల్-మే: క్రికెట్: ఇండియన్ ప్రీమియర్ లీగ్
- 2-5: రెజ్లింగ్: ఆసియన్ చాంపియన్‌షిప్స్ (క్యాడెట్స్, జూనియర్స్, సీనియర్స్, వెటరన్స్), మనీలా, ఫిలిప్పీన్స్
- 5: ఎఫ్1: వియత్నాం గ్రాండ్ ప్రీ
- 7-12: బ్యాడ్మింటన్: సింగపూర్ ఓపెన్
- 9-12: గోల్ఫ్: ఆగస్టా మాస్టర్స్, యూఎస్ఏ
- 16-25: షూటింగ్: ఒలింపిక్ గేమ్స్ టెస్టు ఈవెంట్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్/ టోక్యో, జపాన్
- 18-మే 4: వరల్డ్ స్నూకర్ చాంపియన్‌షిప్: క్రుసిబుల్ థియేటర్ ఇన షెఫీల్డ్, ఇంగ్లాండ్
- 19: ఎఫ్1: చైనీస్ గ్రాండ్ ప్రీ
- 25-26: హాకీ ప్రొ లీగ్ : జర్మనీ – ఇండియా
- 29-మే 3: బ్యాడ్మింటన్: న్యూజిలాండ్ ఓపెన్

మే

- 1-17: ఐస్ హాకీ: ఐఐహెచ్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్, జూరిచ్, లూసాన్నే.. స్విట్జర్లాండ్
- 2-3: హాకీ ప్రొ లీగ్: గ్రేట్ బ్రిటన్ – ఇండియా
- 3: ఎఫ్1: స్పానిష్ గ్రాండ్ ప్రీ
- 11-17: గోల్ఫ్: యూఎస్ పీజీఏ – టీపీసీ హార్డింగ్ పార్క్, సాన్ ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా
- 16-24: బ్యాడ్మింటన్: థామస్ అండ్ ఉబెర్ కప్ ఫైనల్స్
- 23-24: హాకీ ప్రో లీగ్: ఇండియా – న్యూజిలాండ్
- 24: ఎఫ్1: మొనాకో గ్రాండ్ ప్రీ
- 25-జూన్ 1: టెన్నిస్ ఫ్రెంచ్ ఓపెన్ – పారిస్, ఫ్రాన్స్
- 23: ఫుట్‌బాల్ : ఎఫ్ఏ ఫుట్‌బాల్ ఫైనల్ – వెంబ్లే స్టేడియం, లండన్
- 27: ఫుట్‌బాల్ : యూరోపా లీగ్ ఫైనల్, పోలండ్
- 31: ఫుట్‌బాల్ : యూఈఎఫ్ఏ చాంపియన్స్ లీగ్ ఫైనల్, ఇస్తాన్‌బుల్, టర్కీ

జూన్

- జూన్: బాస్కెట్‌బాల్: ఎన్‌బీఏ ఫైనల్స్, యూఎస్ఏ/కెనెడా
- 2-7: బ్యాడ్మింటన్: ఆస్ట్రేలియా ఓ
- 2-9: షూటింగ్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్, మ్యూనిచ్, జర్మనీ
- 5-6: హాకీ ప్రో లీగ్: అర్జెంటీనా – ఇండియా
- 6-21: హాకీ : మహిళల ఆసియన్ చాంపియన్‌షిప్ ట్రోఫీ, కొరియా
- 7: ఎఫ్1: అజెర్బైజాన్ గ్రాండ్ ప్రీ
- 9-14: బ్యాడ్మింటన్: థాయ్‌లాండ్ ఓపెన్
- 12-జూలై 12: ఫుట్‌బాల్: యూరో 2020
- 12-జూలై 12: ఫుట్‌బాల్: కోపా అమెరికా, అర్జెంటీనా, కొలంబియా
- 13-14: హాకీ ప్రో లీగ్: స్పెయిన్ – ఇండియా
- 14: ఎఫ్1: కెనెడియన్ గ్రాండ్ ప్రీ
- 16-21: బ్యాడ్మింటన్: ఇండోనేషియా ఓపెన్
- 18-21: గోల్ఫ్: యూఎస్ ఓపెన్, న్యూయార్క్
- 22-జూలై 3: షూటింగ్: ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్, బకు, అజెర్బైజాన్
- 23-28: బ్యాడ్మింటన్: యూఎస్ ఓపెన్
- 25-29: రెజ్లింగ్: ఆసియన్ చాంపియన్‌షిప్ (క్యాడెట్స్), బ్యాంకాక్, థాయ్‌లాండ్
- 28: ఎఫ్1: ఫ్రెంచ్ గ్రాండ్ ప్రీ
- 27-జూలై 19: సైక్లింగ్: టూర్ డి ఫ్రాన్స్
- 28-జూలై 6: టెన్నిస్: వింబుల్డన్, లండన్, ఇంగ్లాండ్
- 30-జూలై 5: బ్యాడ్మింటన్: కెనెడా ఓపెన్

జూలై

- 5: ఎఫ్1: ఆస్ట్రియన్ గ్రాండ్ ప్రీ
- 7-12: బ్యాడ్మింటన్: రష్యన్ ఓపెన్
- 7-12: రెజ్లింగ్: ఆసియన్ చాంపియన్‌షిప్ (జూనియర్స్)
- 11-19: షూటింగ్: వరల్డ్ చాంపియన్‌షిప్ జూనియర్స్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్, జర్మనీ
- 16-19: గోల్ఫ్: బ్రిటీష్ ఓపెన్, ఇంగ్లాండ్
- 16: ఎఫ్1: బ్రిటీష్ గ్రాండ్ ప్రీ
- 24-ఆగస్టు 9: సమ్మర్ ఒలింపిక్స్, టోక్యో, జపాన్
- 28-ఆగస్టు 2: బ్యాడ్మింటన్: హైదరాబాద్ ఓపెన్

ఆగస్టు

- 2: ఎఫ్1: హంగేరియన్ గ్రాండ్ ప్రీ
- 16-23: వరల్డ్ రోయింగ్ చాంపియన్‌షిప్స్, స్లోవేనియా
- 17-23: రెజ్లింగ్: వరల్డ్ చాంపియన్‌షిప్స్ (క్యాడెట్స్), హంగేరి
- 18-23: బ్యాడ్మింటన్: అకిట మాస్టర్స్, జపాన్
- 25-సెప్టెంబర్ 6: పారాలింపిక్స్ గేమ్స్, టోక్యో, జపాన్
- 25-30: బ్యాడ్మింటన్: వియత్నాం ఓపెన్
- 28: రెజ్లింగ్: వరల్డ్ చాంపియన్‌షిప్స్ (క్యాడెట్స్, జూనియర్స్), రుమేనియా
- 30: ఎఫ్1: బెల్జియన్ గ్రాండ్ ప్రీ
- 31-సెప్టెంబర్ 13: టెన్నిస్: యూఎస్ ఓపెన్, న్యూయార్క్

సెప్టెంబర్

- సెప్టెంబర్: క్రికెట్: ఆసియా కప్ టీ20, యూఈఏ
- సెప్టెంబర్-అక్టోబర్: క్రికెట్: ఇంగ్లాండ్ జట్టు భారత్ పర్యటన (3 వన్డేలు, 3 టీ20లు)
- 16: బ్యాడ్మింటన్: చైనీస్ తైపీ ఓపెన్
- 6: ఎఫ్1: ఇటాలియన్ గ్రాండ్ ప్రీ
- 7-13: రెజ్లింగ్: వరల్డ్ చాంపియన్‌షిప్స్ (జూనియర్స్), సెర్బియా
- 9-13: వరల్డ్ యూనివర్సిటీ స్పోర్ట్ చాంపియన్‌షిప్, చెక్ రిపబ్లిక్
- 15-30: బ్యాడ్మింటన్: చైనా ఓపెన్, చాంగ్‌ఝూ
- 20: ఎఫ్1: సింగపూర్ గ్రాండ్ ప్రీ
- 20-27: సైక్లింగ్: యూసీఐ రోడ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్, స్విట్జర్లాండ్
- 22-27: బ్యాడ్మింటన్: జపాన్ ఓపెన్, టోక్యో
- 25-27: గోల్ఫ్: రైడర్ కప్, విస్కాన్‌సిన్
- 27: ఎఫ్1: రష్యన్ గ్రాండ్ ప్రీ
- 29-అక్టోబర్ 4: బ్యాడ్మింటన్: ఇండోనేషియా మాస్టర్స్ సూపర్ 100

అక్టోబర్

- అక్టోబర్: క్రికెట్: ఆస్ట్రేలియా జట్టు భారత్ పర్యటన (3 టీ20లు)
- 6-11: బ్యాడ్మింటన్: డచ్ ఓపెన్
- 11: ఎఫ్1: జపనీస్ గ్రాండ్ ప్రీ
- 13-18: బ్యాడ్మింటన్: డెన్మార్క్ ఓపెన్
- 18-నవంబర్ 15: క్రికెట్: ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్, ఆస్ట్రేలియా
- 20-25: బ్యాడ్మింటన్: ఫ్రెంచ్ ఓపెన్
- 25: ఎఫ్1: యూఎస్ గ్రాండ్ ప్రీ
- 27-నవంబర్ 1: బ్యాడ్మింటన్: సార్లోర్‌లక్స్ ఓపెన్
- 27-నవంబర్ 1:బ్యాడ్మింటన్: మకావ్ ఓపెన్
- 27-నవంబర్ 1: రెజ్లింగ్: వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్స్ (సీనియర్స్), రష్యా

నవంబర్

- నవంబర్ – డిసెంబర్: క్రికెట్: టీమిండియా ఆస్ట్రేలియా పర్యటన (4 టెస్టులు, 3 వన్డేలు)
- 1: ఎఫ్1: మెక్సికన్ గ్రాండ్ ప్రీ
- 3-8: బ్యాడ్మింటన్: చైనా ఓపెన్
- 10-15: బ్యాడ్మింటన్: హాంకాంగ్ ఓపెన్
- 15: ఎఫ్1: బ్రెజిలియన్ గ్రాండ్ ప్రీ
- 17-22: బ్యాడ్మింటన్: సయ్యద్ మోడీ ఇండియా ఇంటర్నేషనల్
- 23-29: రెజ్లింగ్: వరల్డ్ చాంపియన్‌షిప్స్ (అండర్-23), ఫిన్లాండ్
- 24-29: బ్యాడ్మింటన్: కొరియా మాస్టర్స్
- 29: ఎఫ్1: అబుధాబీ గ్రాండ్ ప్రీ

డిసెంబర్

- 9-13: బ్యాడ్మింటన్: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్, గ్వాంగ్‌ఝూ

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.